ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్







# యుగశక్తి గాయత్రి

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 18 - సంచిక 11
**ఏప్రియల్ 2014**

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**


## ఉత్థాన-పతనములను ఎంచుకునే స్వేచ్ఛ

మానవుడు సృష్టియొక్క సర్వోత్కృష్టమైన సంరచన! అతని శక్తి సవ్యమైన దిశాధారలో ప్రవహిస్తే, ఆత్మకళ్యాణమనే స్వార్థము మరియు లోకకళ్యాణమనే పరమార్థమును ఈ జన్మలోనే సాధించగలుగుతాడు. మనిషి తన సామర్థ్యములను తగిన రీతిలో ఉపయోగించుకుంటే అతను ఎవ్వరి ముందు చేయిచాపవలసిన అవసరము ఉండదు. పరస్పరము ఇచ్చిపుచ్చుకోవటం మరియు స్నేహసహయోగం అన్నవి వేరే అంశములు. విధాత మనిషి నుదుటివ్రాతలో పతన-పరాభవములను వ్రాయలేదు. మనిషి తన కూడని ఆలోచనలతో, చేతలతో స్వయముగానే దుర్గతిని ఆహ్వానిస్తున్నాడు.

ఉన్నతికి చేరుటకు ఆధారములు సరైన దిశానిర్ధారణ, సజ్జనత్వముతో నిండిన ఆచరణ అనగా సదాచరణ. అనుపయుక్తమైన ఆలోచనలు మరియు ఆ ఆలోచనల మత్తులోపడి చెడుమార్గములో పయనించుట అనేవి పతనమునకు కారణములు. ఉత్థాన-పతనముల యొక్క రెండు మార్గములు ప్రతి ఒక్కరికి తెరిచే ఉంటాయి. ఎవరికైనా సరే వీటిలోనుండి ఏదో ఒకదానిని ఎన్నుకునే స్వేచ్ఛ ఉన్నది. మనిషి తన భాగ్యమునకు తానే నిర్మాత! ఈ తథ్యము యొక్క వాస్తవికత స్వీయ-ఉదాహరణ ద్వారా సర్వదా సత్యమని, సార్థకమని నిరూపించ వచ్చును.

మనిషి ఉత్కృష్టదిశవైపు అగ్రసరులయ్యే సామర్థ్యముతోనే సృజించబడ్డాడు. ఉత్థానము యొక్క రాజమార్గమును వదిలిపెట్టి, పతనదిశగా ముందుకుసాగి దౌర్భాగ్యమును, దుర్గతిని పొందడం అన్నది మనిషి ప్రవృత్తి మరియు ఎన్నుకునే మార్గము మీద ఆధారపడి ఉంటుంది.

*- అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**సరైన స్పృహతో జీవిస్తే ప్రతిక్షణం జీవంతో ఉంటారు**

# విషయ సూచిక


1. **సంపాదకీయం :** ఉత్థాన-పతనములను ఎంచుకునే స్వేచ్ఛ 1
2. **విషయసూచిక-సద్గురు వాణి :** సదాచరణ 2
3. **వేదమంత్రం :** బద్ధకాన్ని వదలండి 3
4. **గాయత్రీ విద్య - 43 :** కళాసాధన 4
5. **గాయత్రీ చిత్రావళి - 22 :** కుటుంబంలో సుఖశాంతి 6
6. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 22 :** హిమాలయాల యాత్ర-3 7
7. **యుగనిర్మాణ యోజన :** మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 15 10
8. **కుండలినీ మహావిజ్ఞానం-8 :** షట్చక్రాల బుట్టలో చేతనత్వ మహాసాగరం 12
9. **వ్యక్తి నిర్మాణం :** సంస్కారవంతులుగా కావాలి 15
10. **శ్రీరామనవమి ప్రత్యేకం :** గాయత్రీ రామాయణం 19
11. **మనం - మన ఆరోగ్యం :** జలమును ఉపయోగించుకోవాలి 22
12. **వైజ్ఞానిక ఆధ్యాత్మికత :** భవిష్యత్తులో ధర్మవిజ్ఞానముల సంగమం 24
13. **మెస్మరిజం-9 :** మెస్మరిజం యొక్క సిద్ధులు 27
14. **శరీర విజ్ఞానం :** రహస్యమయ ఉపత్యికలు 31
15. **పునర్జన్మ** 34
16. **విపరీత కామవాసనలతో దుష్పరిణామాలు** 37
17. **మానవేతర ప్రాణులు మానవునికి ఏ విషయంలోను తీసిపోవు** 39
18. **బోధ కథ :** పూర్ణత్వమనే మార్గంలోకి నడిచిన పూర్ణ 40
19. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మికత యొక్క మొదటి పాఠం-కర్మయోగం-2 42
20. **నా వారితో నా మాట :** యుద్ధం మనుషులతో కాదు, ప్రవృత్తులతో 45
21. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 48




## సద్గురు వాణి

### సదాచరణ

మోసం చేసి డబ్బు సంపాదించితే లేక శీలం పోగొట్టుకొని ధనం సంపాదించితే అది పాపం మూటకట్టుకున్నట్లే. ఎంత డబ్బు ఉన్నా చరిత్ర హీనులకు ప్రపంచంలో మర్యాద లభించదు. డబ్బు లేనప్పటికీ శీలవంతులకు, నీతిమంతులకు మర్యాద ఖచ్చితంగా లభిస్తుంది.

సదాచరణ ప్రభావం వలన పూర్వకాలంలో ఋషులు, మునులు వస్తే చక్రవర్తులు, సామ్రాట్టులు సింహాసనం నుండి లేచి నిలబడి వారిని సాదరంగా ఆహ్వానించేవారు. కొల్లాయి గుడ్డ కట్టుకున్న గాంధీగారిని ఇంగ్లాండు యొక్క కింగ్‌జార్జి-4 లేచి నుంచుని స్వాగతం పలికాడు. మనకు కూడా సదాచరణే ధ్యేయంగా ఉండాలి.

---

## యుగశక్తి గాయత్రి

**చందా రుసుమును ఆన్‌లైన్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ

ఖాతాపేరు : శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 20/- చందాకు అదనంగా పంప ప్రార్థన. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము**, హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| **విడి ప్రతి రూ॥ 12/-** | **3 సం॥ చందా రూ॥ 350/-** |
| **సం॥ చందా రూ॥ 120/-** | **10 సం॥ చందా రూ॥ 1116/-** |

**మర్యాదల కోసం వెంపర్లాడరాదు**

వేద మంత్రం

# బద్ధకాన్ని వదలండి

**ఇచ్ఛన్తి దేవాః సున్వన్తం న స్వప్నాయ స్పృహయన్తి ।**
**యన్తి ప్రమాదమతన్ద్రాః ॥**

**(ఋగ్వేద 8/2/18, అథర్వవేద 20/18/3)**

**భావార్థం:** సోమరి ఎల్లప్పుడు దుఃఖం పొందుతాడు. అందువలన మనమందరం కర్మనిష్ఠులం, శ్రమశీలురం కావాలి.

**సందేశం:** సోమరితనమే మనుష్యునికి అసలైన శత్రువు. అది మనలను పాపపు దారిలోకి తీసుకువెళ్తుంది. బద్ధకానికి, సోమరితనానికి లొంగితే మనము అనేక పాపకర్మలలో మునిగి పోతాము. కొన్నిసార్లు అత్యంత లాభకరమైన ప్రణాళికలను వేసి కేవలం సోమరితనం వలన మధ్యలో వదలివేస్తాము. ఇతరులకంటే వెనుకబడిన తర్వాత నిరాశ చెందుతాము, ఆత్మ కల్యాణము నుండి వంచితులమవుతాము. పరమాత్మ కూడా సోమరిని ప్రేమించడు. చైతన్యవంతులను, కృషి చేయువారిని, పురుషార్థులైన వారిని ప్రేమిస్తాడు.

ఈ ప్రపంచమంతా యజ్ఞమయం. ఇక్కడ ప్రతివ్యక్తీ అన్ని సమయాలలో తన శ్రమను ఆహుతివ్వాలి. కర్మనిష్ఠుడగుటకు తాత్పర్యము ఇదే. ప్రపంచము ఉన్నతం, ఉత్తమం, పవిత్ర మగుటకు ఏ కర్మ సహాయపడునో దానినే శుభకర్మ అని అంటారు. సోమరిపోతు ఎదురు దెబ్బలు తింటాడు. మనం ఎల్లప్పుడు శ్రమ, పురుషార్థములో నిమగ్నం కావాలి. ఏ పనిని చిన్నదనుకొని ఉపేక్షించి, అవహేళన చేయకూడదు. అలా చేస్తే అహంభావం పెరిగి కార్యసామర్థ్యమును నశింపచేస్తుంది.

నిస్వార్థ భావముతో శుభకర్మలలో నిరంతరం నిమగ్నమగు వాడే కర్మయోగి. మనం ఎన్నో కోరుకుంటాము కానీ అందుకు చేసేదేమీ ఉండదు. ఇంద్రియసంయమం, సమయసంయమం, అర్థసంయమం లేకపోతే మానవుడు కర్మనిష్ఠుడు కాలేడు, ముఖ్యమార్గం నుండి దారి తప్పుతాడు, ఓడిపోతాడు, దుఃఖితుడు అవుతాడు. ఎవరు ఇంద్రియాలను వశంలో ఉంచుకుంటారో, సమయాన్ని సదుపయోగం చేస్తారో, అర్థము విషయంలో అనర్థమునకు అవకాశం ఇవ్వరో వారే ఐశ్వర్యవంతులవుతారు. పరమాత్మ ప్రేమను పొందుటకు సోమరితనం వదలి కర్మనిష్ఠులు అగుటయే నిజమైన ఉపాసన అవుతుంది.

వ్యక్తిని, దేశాన్ని ఉన్నతమొనరించుటకు కొన్ని కొలబద్దలు ఉన్నాయి. ఆ ఆవశ్యక గుణాలు శ్రీ మద్భగవద్గీతలో 'దైవీ సంపద'గా వర్ణించబడ్డాయి. మానవజీవనాన్ని అమూల్యంగా చేసే సామర్థ్యం కలిగినవే ఈ మూల్యాలు.

ప్రపంచంలో మహాపురుషులైన వారందరు అంతులేని కర్మనిష్ఠతో తమ జీవితంలోని ఒక్కొక్క క్షణం సమాజ ఉన్నతికి సమర్పణ చేశారు. రామకృష్ణ పరమహంస, దయానంద మహర్షి, స్వామివివేకానంద, స్వామిరామతీర్థ, లోకమాన్య తిలక్, మహాత్మాగాంధీ, డా॥ హెడ్గేవార్ మొదలైన అనేకమంది మహాపురుషుల జీవితంలో మనకు వారి ఉత్కృష్ట ఉద్యమశీలత దర్శనమిస్తుంది. వీరు ఎప్పుడైనా ఒక్కక్షణమైనా సోమరితనంగా గడిపారా? వారికి 'ఆరామ్ హరామ్ హై' (విశ్రాంతి పెద్ద నేరం) అనే మూలమంత్రమే సర్వస్వం. అటువంటి మహాత్ములను మన జీవితానికి ఆదర్శపురుషులుగా చేసుకొని మనం ప్రపంచంలో సాఫల్యాన్ని పొందగలము.

మన కర్తవ్యమేమిటంటే మనం స్వయంగా సోమరితనం వదలి ఇతరులను కూడా ఈ రాక్షసి నుండి విముక్తి కలిగించాలి.

★★★

## పండుగలు

**ఏప్రిల్ 2014**

| | |
|---|---|
| 08-04-2014 | శ్రీరామనవమి |
| 18-04-2014 | గుడ్ ఫ్రైడే |
| 14-04-2014 | అంబేద్కర్ జయంతి |
| 15-04-2014 | శ్రీ హనుమాన్ జయంతి |

**మే 2014**

| | |
|---|---|
| 04-05-2014 | ఆది శంకరాచార్య జయంతి |
| 14-05-2014 | వ్యాస పూర్ణిమ |

**ఈ రోజు గౌరవ మర్యాదలు ఇచ్చేవారు రేపు మిమ్మల్ని పట్టించుకోకపోవచ్చు**



## గాయత్రీ విద్య-43

# కళాసాధన

కళ అంటే కిరణము. ప్రకాశం అత్యంత సూక్ష్మమైనది, దానిని ఒక నిశ్చితమైన పద్ధతి ప్రకారం అనుభవంలోకి తెచ్చుకొనే దానిని 'కళ' అంటారు. సూర్యుని నుండి అత్యంత సూక్ష్మమైన ప్రకాశ తరంగములు భూతలం మీదకు వస్తాయి. వాటిలో ఒక సమూహాన్ని మాత్రమే మన కంటి ద్వారా కాని, యంత్రముల ద్వారా కాని చూడగలుగుతాము. సూర్యుని ఏడు రంగులు సుప్రసిద్ధము. పరమాణువుల అంతర్గతంగా ఉన్న 'పరమాణువుల' విద్యుత్తు తరంగములు మన కన్నులను తాకినప్పుడు, రంగుల యొక్క జ్ఞానం మనకు కలుగుతుంది. రూపములను ప్రకాశ వంతం చేసే పని కళ ద్వారానే జరగుతుంది.

కళలు రెండు రకములు 1) ఆప్తి 2) వ్యాప్తి. ప్రకృతి యొక్క అణువుల నుంచి ప్రస్ఫుటించే కిరణములను ఆప్తి అంటారు. వ్యాప్తి కిరణములు పురుషుని అంతరాళము నుండి ఆవిర్భూతమవుతాయి. వీటిని తేజస్సు అని కూడా అంటారు. వస్తువులు పంచతత్త్వములు ద్వారా తయారవుతాయి. అందువలన పరమాణువుల గురించి వచ్చే కిరణములు తమ ప్రధాన తత్త్వ విశేషతను కూడా వెంట తీసుకు వస్తాయి. ఆ విశేషతను రంగు ద్వారా గుర్తించగలుగుతాము. వస్తువు యొక్క ప్రాకృతిక రంగును చూసి పంచతత్వలలో ఏ తత్వం ఎంత ఉన్నదో చెప్పవచ్చు.

వ్యాప్తి కళ మనిషి యొక్క తేజస్సు రూపంలో (परिलक्षित) ఉంటుంది. ఈ తేజస్సు ముఖం చుట్టుప్రక్కల ప్రకాశ మండలం వలె వ్యాపించి ఉంటుంది. దీనిని ఇంగ్లీషులో ఆరా (aura) అని, సంస్కృతంలో తేజోవలయం అని చెప్తారు. దేవతల చిత్రాలలో దేవతల ముఖారవిందాల చుట్టుప్రక్కల ప్రకాశం యొక్క గోళాన్ని కూడా చిత్రీకరిస్తారు. ఇది వారి కళల చిహ్నము. అవతారముల శక్తిని తెలుపాలంటే వారు పొందిన కళలను గురించి చెప్తారు. పరశురామునిలో మూడు, శ్రీరామ చంద్రుడిలో పన్నెండు, శ్రీకృష్ణుడిలో పదహారు కళలు ఉన్నాయని చెప్పబడ్డాయి. ఈ కళలు సాధారణం కన్నా ఎన్ని రెట్లు ఆత్మిక శక్తి కలదో తెలియచేస్తాయి.

సూక్ష్మదర్శులైన వారు వ్యక్తుల లేక వస్తువుల ఆంతరిక స్థితిని గురించి, వాని తేజోవలయము, రంగు, రూపం, ప్రకాశం, చైతన్యములను చూసి తెలుసుకోగలుగుతారు. కళావిద్య తెలిసిన వారు భూమిలో దాచిపెట్టబడి ఉన్న పదార్థములను, వస్తువులలోని గుణములను, ప్రభావమును మహత్వమును తేలికగా తెలుసుకోగలరు. ఏ మనిషిలో ఎన్ని కళలు ఉన్నాయి? అతని శారీరిక, మానసిక, ఆత్మిక విశేషతలు ఏమిటి? అతని గుణదోషములు, యోగ్యతలు, సామర్థ్యములు గురించి సహజంగానే తెలుసుకోగలుగుతారు. ఈ జ్ఞానం వలన ఎవరితో ఎటువంటి సంబంధం పెట్టుకోవాలో తేలికగా నిర్ణయించుకోవచ్చు.

కళా విజ్ఞానం తెలిసిన వారు తన శరీరం యొక్క తత్త్వముల న్యూనాధికత తెలుసుకుని, దానిని తన ఆత్మబలంతో సరిచేసుకుంటారు. తమ కళలను సముచితంగా శుద్ధి చేసుకుని వికసింపచేసుకోగలరు. కళే సామర్థ్యము. కళలను పరీక్షించి తమ ఆత్మిక సామర్థ్యం, ఆత్మిక ఉన్నతిని తెలుసుకోగలుగుతారు, సాధకుడు తన ఉన్నతి జరుగుతున్నదో లేదో తెలుసుకో గలుగుతాడు; సాధన సఫలవంతమవనున్నదా లేదా అని తెలుసుకోగలుగుతాడు.

కన్నులు మూసుకుని, భృకుటి మధ్య భాగములో ధ్యానం ఏకత్రితం చేస్తే మస్తిష్కంలో, దాని చుట్టుప్రక్కల రంగు రంగుల రిబ్బనులవలె, సీతాకోకచిలుకలవలె ఎగరటం కనిపిస్తుంది. వీటి రంగులు తత్త్వముల మీద ఆధారపడి ఉంటాయి. పృథ్వీ తత్వం యొక్క రంగు పసుపు, జలం శ్వేత వర్ణం, అగ్ని వర్ణం ఎరుపు, వాయువు యొక్క వర్ణం ఆకుపచ్చ, ఆకాశం యొక్క వర్ణం నీలం. ఏ రంగులు మెరుస్తూ కనిపిస్తాయో ఆ తత్వం అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది.

ప్రతి రంగుకు ఒక విశేషత ఉంటుంది. పసుపు రంగులో క్షమ, గంభీరత, ఉత్పాదన, స్థిరత, వైభవం, దృఢత్వం, సౌమ్యత ఉంటాయి. శ్వేత వర్ణములో శాంతి, రసికత, కోమలత, తృప్తి, శీతలత, సౌందర్యం, ప్రేమ; ఎరుపు రంగులో వేడి, ఉష్ణత, క్రోధము, ఈర్ష్య, ద్వేషం, అనిష్ఠము, శూరత, సామర్థ్యము.

**ఆత్మగౌరవం అంటూ పోతే ఒక్కరోజైనా ఆనందం పొందలేరు**

ఉత్తేజన, కఠోరత, కాముకత, తేజస్సు, మెరవటం, స్ఫూర్తి; ఆకుపచ్చ రంగులో చంచలత, కల్పన, స్వప్నశీలత, నొప్పి, ధూర్తత, వినోదం, ప్రగతిశీలత, ప్రాణపోషణ, పరివర్తన; నీలం రంగులో బుద్ధి సూక్ష్మత, సాత్వికత, ప్రేరణ, వ్యాపకత, ఆకర్షణ మొదలైన గుణములు ఉంటాయి.

జడ పదార్థములు నుండి అయిన, ఒక ప్రాణి నుండి అయినా ప్రకటితమయ్యే రంగు, వాటి నుండి వెలువడే సూక్ష్మ ప్రకాశ జ్యోతి నుండి వాటి గుణం, ధర్మం, స్వభావం, ప్రభావం తెలుసుకోవచ్చు. సాధారణముగా ఇవి పంచతత్వముల కళలు. వీటి ద్వారా 1) వ్యక్తుల, పదార్థముల ఆంతరిక స్థితి తెలుసు కోవచ్చు. 2) తన శారీరిక, మానసిక క్షేత్రములోని గుణ దోషములను సరిచేసుకోవచ్చు. 3) ఇతరుల శారీరిక, మానసిక వికృతలను సరిచేయవచ్చు. 4) తత్వముల మూలాధారం దగ్గరకు వెళ్ళి తత్వముల లక్షణములను, క్రియా పద్ధతులను తెలుసుకోవచ్చు. 5) తత్వములపై అధికారం సాధించి ప్రాపంచిక పదార్థముల నిర్మాణం, పోషణ, వినాశనం చేయవచ్చు.

పైన చెప్పబడిన ఐదు లాభములు రిద్ధి సిద్ధులకు సమానమైన ఆశ్చర్యజనకమైన ఫలితాలను ఇస్తాయి. ఇవి ఐదు భౌతిక కళలు. వీటిని రాజయోగి, హఠయోగి, మంత్రయోగి, తాంత్రికులు తమ తమ పద్ధతిలో ఉపయోగించుకోగలరు. ఈ తాత్విక శక్తిని సదుపయోగం చేయవచ్చు, దురుపయోగం చేయవచ్చు. తదనుసారంగా మంచి చెడు ఫలితాలు వస్తాయి. కళల ద్వారా ప్రాపంచిక భోగం, వైభవం కూడా లభిస్తాయి. ఆత్మ కళ్యాణం కూడా జరుగుతుంది. ఇతరులకు శాపం, దుఃఖం, శోకం కూడా కలిగించవచ్చు.

ఆత్మిక కళలు మూడు. అవి సత్వము, రజస్సు, తమస్సు. తమో గుణముల కళలకు కేంద్రం శివుడు. రావణుడు, హిరణ్య కశిపుడు, భస్మాసురుడు, కుంభకర్ణుడు, మేఘనాథుడు మొదలైన వారు ఈ తామసిక కళలయందు సిద్ధపురుషులు. రజోగుణ కళలు విష్ణువు నుండి లభిస్తాయి. ఇంద్రుడు, కుబేరుడు, వరుణుడు, బృహస్పతి, ధృవుడు, అర్జునుడు, భీముడు, యుధిష్ఠిరుడు, కర్ణాదుల యందు ఈ కళ విశేషంగా ఉన్నది. వ్యాసుడు, వశిష్ఠుడు, అత్రి, బుద్ధుడు, మహావీరుడు, ఏసుక్రీస్తు, గాంధీ మొదలైన వారిలో సాత్వికత కేంద్రం నుండే శక్తి ప్రాప్తించింది.

ఆత్మిక కళల సాధన గాయత్రీ యోగంలోని గ్రంథి భేదనం ద్వారా జరుగుతుంది. రుద్రగ్రంథి, విష్ణుగ్రంథి, బ్రహ్మగ్రంథి జాగృతం అయినప్పుడు ఈ మూడు కళలు సాధకునికి సాక్షాత్కరిస్తాయి. పూర్వకాలంలో మనుష్యులు శరీరాలలో ఆకాశతత్వం అధికంగా ఉండేది. అందువలన వారికి ఈ సాధనల వలన ఆశ్చర్యకరమైన సామర్థ్యం కలిగేది. ఈ యుగపు మనుష్యులలో పృథ్వీతత్వం ప్రధానమైనది. అందువలన అణిమ, మహిమ మొదలైనవి లభించకపోయినా సత్వ, రజ, తమో శక్తుల ఆధిక్యత వలన నేడు కూడా ఆశ్చర్యకరమైన ఫలితాలను ఇచ్చే సాధనలు చేసుకోవచ్చు.

*(సశేషం)*

## సౌమ్యంగా ఉండాలి

*పరమతేజస్సుతో కూడి కన్నులు మిరుమిట్లు గొల్పే ముఖారవిందంతో సూర్యదేవుడు ఇంటికి రాగా, ఆయన భార్య సంజ్ఞ, ఆ తేజస్సు భరింపజాలక కన్నులు మూసుకున్నది. దీనికి సూర్యదేవుడు కుపితుడై తేజస్సుతో కూడిన నా స్వరూపం నచ్చలేదా అని ప్రశ్నించాడు. దీనితో భయ కంపితురాలైన సంజ్ఞ తన చూపులను మరింతగా తలవాల్చి నేలను చూడసాగింది. దీనితో తనకు అవమానం జరిగిందని భావించిన సూర్యదేవుడు మరింత కుపితుడైనాడు. ఇది చూచి సంజ్ఞ మరింత భయానికి లోనై పుట్టింటికి చేరింది. తదుపరి సూర్యదేవుడు 'శాంతించి, కోపం తగ్గగానే యోగి రూపాన్ని ధరించి, భార్య సంజ్ఞ వద్దకు చేరి, తాను పుట్టింటికి చేరిన కారణాన్ని తెలుపమని కోరగా, సంజ్ఞ ఇట్లు జవాబిచ్చింది. "నా భర్త తేజస్సుతో నిండి ఉండాలని నేను స్వయంగా కోరుకుంటాను. కానీ ఆయన స్వభావం సౌమ్యంగా ఉంటేనే, నేను ఆయన ముఖారవిందాన్ని దర్శించుకోగలను" దీనిని విన్న సూర్యదేవుడు సంతసించి, నాటి నుండి తన 16 కళలలోని ఒక్క కళతోనే ప్రకాశింప ప్రారంభించాడు. దీనికి సంతసించిన భార్య సంజ్ఞ తిరిగి భర్తను చేరి ఇట్లన్నది "ప్రాణనాథా! వైభవమెంతదైనా, స్నేహంతో కూడిన సౌమ్యత ఉంటేనే తృప్తి, సంతోషం లభిస్తాయి.*

*– అఖండజ్యోతి, డిసెంబరు 2013*

*అనువాదం: ఎ.వేణుగోపాలరెడ్డి*

**చదువుకుంటున్న వయస్సులో కూడా పిల్లలు ఇంటి బాధ్యతలను వహించేలా చెయ్యాలి**

గాయత్రీ చిత్రావళి - 22

# కుటుంబంలో సుఖశాంతి




కుటుంబములోని వారందరు ప్రేమ పూర్వకంగా, ఒకరిపట్ల మరొకరు సంవేదనతో. సేవ సహకారాలతో, ఒకరిపట్ల మరొకరు తగు గౌరవంతో, త్యాగం, ఉదారతలతో వ్యవహరిస్తే ఇంటిలో స్వర్గసమాన సుఖశాంతులు విరాజిల్లుతాయి. పరస్పర సహకారం వలన ఇంటి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది, ఉత్పత్తి పెరుగుతుంది, తక్కువ ఖర్చులో నిర్వహణ చేయగలుగుతారు, కష్టకాలంలో కూడా నవ్వుతూ తుళ్ళుతూ గడపగలుగుతారు, వారి ప్రతిష్ఠ పెరుగుతుంది. వారిపై దాడిచేయుటకు ఎవ్వరూ సాహసించరు. ఎవరైనా దుస్సాహసం చేసినా వారికి పరాభవం తప్పదు.

ఏ కుటుంబంలో పరస్పర ఈర్ష్య, ద్వేషము, తిరస్కారము, మానసిక మాలిన్యము, విరోధభావము ఉంటాయో; ఎక్కడ తగాదాలు, పోట్లాటలు, కలహము, దొంగతనము, దురాచారములు ఉంటాయో; పెద్దలు పిన్నలను అణచివేస్తారో, పిన్నలు పెద్దలను గౌరవించరో, అందరు స్వార్థపరులై వ్యవహరిస్తారో, సామూహిక లాభము, ఇంటి అవసరాలు పట్టించుకొనరో ఆ కుటుంబం తొందరలోనే పతనమైపోతుంది. దాని ప్రతిష్ఠ మట్టిలో కలిసిపోతుంది. ఆదాయము తగినంత ఉన్నా సరిపోదు. ఇతరులు వారిని చూసి నవ్వుకుంటారు. తంపులు పెట్టేవారు, స్వార్థపరులు అటువంటి కుటుంబాలలో తగాదాలు పెట్టి తమ పబ్బం గడుపుకుంటారు. స్వార్థం, ద్వేషము ఈర్ష్య కారణంగా విడిపోతారు. మాల నుండి తెగిపడిన ముత్యాలవలె ఆ కుటుంబ సభ్యులంతా చెల్లాచెదరవుతారు, దుర్గతి పాలవుతారు.

కుటుంబ అశాంతికి ముఖ్య కారణం సభ్యులలోని దుర్బుద్ధి. ఇతర సమస్యలను తేలికగా పరిష్కరించవచ్చు, కానీ దుర్బుద్ధి వదిలించినా వదలనటువంటి పిశాచి వంటిది. ఎవరిని పట్టుకుంటుందో వారిని సుఖంగా ఉండనివ్వదు, సమీప సంబంధీకులను కూడా బాధిస్తుంది. ఇంటిలో ఒకరిద్దరు దుర్బుద్ధి కలిగి ఉంటే, వారు శాంతిప్రియులైన వారిని కూడా సుఖంగా ఉండనివ్వరు, అకారణంగా అందరికి దుఃఖం కలుగజేస్తారు.

గాయత్రీ ఉపాసన చేసేవారి బుద్ధి నిర్మలమవుతుంది. ఏ ఇంటిలో గాయత్రీ పూజ, ఉపాసన, యజ్ఞము. స్వాధ్యాయము, జపము, తపము మొదలైనవి జరుగుతుంటాయో అక్కడ స్వాభావికంగానే సద్బుద్ధి ప్రకాశిస్తుంది. ఆ కుటుంబంలో విచ్ఛిన్నకరతత్త్వాలు, దుర్గుణాలు వాటంతట అవే తగ్గిపోతాయి. అటువంటి ధార్మిక కుటుంబాలలో ఎల్లప్పుడూ అన్ని విధాలుగా శాంతి విరాజిల్లుతూ ఉండటం చూస్తాము.

– అనువాదం : డా॥ తుమ్మూరి

**హాస్యానికి దగ్గరగా ఉండటం ఆనందకరం, ఆరోగ్యకరం**

### పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-22

# హిమాలయాల యాత్ర-3

### తపోవనం దిశగా

జ్యోతిర్మఠానికి తిరిగి రావడానికి కొద్ది సమయమే పట్టినట్లు అనిపించింది. తిరిగి వెనక్కు రావడం వలన కాబోలు, దారి ఒకసారి చూచినదే కనుక, కుతూహలం రోమాంచము కలగడం లేదు. ఆ తర్వాత సమయం వాయువేగంతో పరుగు తీసింది.

జ్యోతిర్మఠంలో శంకర గుహ దగ్గర ఇద్దరు వృద్ధ సన్యాసులు కలిశారు. ఇద్దరి వయస్సులో 10-15 సంవత్సరాల తేడా ఉన్నది. దాదాపు 60 సంవత్సరాల వయస్సు ఉన్న సన్యాసి స్వామి నిర్మలానంద. ఆయన కన్నా తక్కువ వయస్సులో ఉన్న సన్యాసి స్వామి గంభీరానంద. ఇద్దరు గురు శిష్యులు. ఎంతో సహజంగా, ఎంతో త్వరగా వారితో పరిచయం ఏర్పడింది. స్నేహం కావడానికి కూడా ఎక్కువ సమయం పట్టలేదు. గోముఖం వరకు కలిసి వెళ్ళాలనే నిర్ణయం సుమారు పది నిమిషాలలో జరిగిపోయింది.



అది చలికాలం. దారిలో ఇబ్బందులు చలి కన్నా తీవ్రంగా ఉన్నాయి. భవిష్య బదరి దాటిన తర్వాత వచ్చిన సెలయేరు వద్ద తపస్వి గోముఖ యాత్ర గురించి ఇచ్చిన సమాచారం శ్రీరామ్ మనస్సులో మారు మ్రోగుతోంది. త్రోవలో సిద్ధ యోగులు కలుస్తారనే ఆశ కూడా ఆ తపస్విని చూసినప్పుడు శ్రీరామ్ మనసులో ఏర్పడింది. కొండల మీదుగా, గ్రామాల మీదుగా సన్యాసులతోపాటు వెళుతూ ఉండగా "దారిలో అడుగడుగునా గుహలు ఉన్నాయి. ఇప్పుడే గుహ నుండి ఒక సిద్ధ పురుషుడు బయటకు వస్తాడు" అని అనిపించేది. ఆ గుహ దాటేసరికి కొద్ది నిరాశ కలిగేది. వారు ముందుకు వెళ్ళేవారు. మరో గుహ వచ్చేవరకు ఎదురు చూసేవారు. ఆ గుహ వచ్చినా, మళ్ళీ అదే నిరాశ.

చివరికి సిద్ధ యోగులను కలుసుకునే ఆశ వదలిపెట్టే పరిస్థితి వచ్చింది. సహచరులు ఇద్దరితో కబుర్లు చెప్తూ శ్రీరామ్ విశ్రాంతిగా ప్రయాణించాడు. మధ్యలో గుట్టల మీద చిన్నా పెద్దా దుకాణాలు కనిపించేవి. ముగ్గురూ ఆ దుకాణాల వద్ద కొద్దిసేపు విశ్రమించేవారు. గిరిజనులతో కబుర్లు చెప్పేవారు. ఆ దుకాణాలలో గోధుమపిండి, పప్పు, బియ్యం వంటి వస్తువులతో పాటు శెనగలు, బెల్లం, బంగాళాదుంపలు, అగ్గిపెట్టెలు మున్నగు సరకులు కూడా ఉండేవి. జనం తమ అవసరాలను బట్టి ఆ సరుకులు కొంటారు. ఆ దుకాణాల వద్దనే వండుకుని తినే ఏర్పాటు కూడా ఉండేది. సరుకులు కొంటే, వంటకు వడ్డనకు పాత్ర సామాను అద్దె లేకుండా ఇచ్చేవారు.

అయితే వీటి అవసరం అంతగా రాలేదు. దారిలో కొన్ని గ్రామాలు వచ్చాయి. వాటిలో జనాభా బాగా తక్కువ. వారిలో స్త్రీల శాతం ఎక్కువ. పురుషులు బ్రతుకు తెరువుకోసం మైదాన ప్రదేశాలకు వెళ్తారు. సన్యాసులు తోడుగా ఉన్నారు. అయినా నిర్జనమైన దారిలో భయం కలుగుతోంది. అక్కడక్కడ అడవి జంతువులు, క్రూర మృగాలు కనిపించేవి. 20-22 గంటల ప్రయాణంలో 15 సార్లు పులులు, చిరుతపులులు, ఎలుగుబంట్లు ఎదురు అయినాయి. కొన్ని మలుపులలో చిన్న పులులు కూడా కనిపించాయి. నేడు ఆ ప్రాంతంలో ఇలాంటి పులులు కానరావు. అడవి జంతువుల తోలు వ్యాపారం చేసేవారు వాటిని చంపివేశారు. అయితే, 1926-27లో ఇలాంటి పులులు పెద్ద సంఖ్యలో ఉండేవి.

గోముఖం చేరడానికి మామూలుగా మూడు రోజులు పడుతుంది. వీరు ఒక రోజులోనే గోముఖం చేరారు. గంగోత్రికి సుమారు 20 కి.మీ. దూరంలో ఉన్నది గోముఖం. అయితే తెలియని దారి. రాళ్ళతో నిండిన దారి. గోముఖం చేరడంతో, సన్యాసులు ఇద్దరూ శ్రీరామ్ నుంచి విడిపోయారు. వారు గత 25 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. తక్కువ సమయం పట్టే దగ్గర దారులు కూడా వారికి బాగా తెలుసు. ఉత్తరాఖండ్‌లోని ఈ ప్రాంతంలోని ప్రతి అంగుళం వారికి తెలిసినదే. దగ్గర దారిలో కష్టం చాలా ఎక్కువ. అయినా, నడచివెళ్ళేవారు ఈ దారినే ఎంపిక చేస్తారు. శరీరంలో సామర్థ్యం ఉన్న వారు ఎట్టి పరిస్థితిలోను ఈ దారుల ద్వారా గమ్యాన్ని చేరుకోవాలని అనుకుంటారు.

### నలువైపులా ప్రమాదమే ప్రమాదం

గోముఖానికి ఆవల అంతటా నలువైపులా తెల్లటి మంచు కప్పి ఉన్నది. మంచుతో నిండిన ఈ పీఠభూమిలో అడుగడుగునా

**నవ్వుతూ మాట్లాడితే ఎంత పెద్ద గొడవ అయినా చల్లబడిపోతుంది**

సవాళ్ళే. దారి అంతటా పెద్ద పెద్ద గోతులు. కాలు జారితే వాటిలో పడిపోయే ప్రమాదం ఉన్నది. గోముఖానికి ఆవల ఉన్న ఈ దారి 4 కి.మీ. మాత్రమే, అయితే అడుగడుగునా ప్రమాదమే. అనుక్షణం మెలకువతో ఉండవలసిందే.

ఈ దారిలో ప్రయాణిస్తున్న శ్రీరామ్‌కు గత రెండు రోజులు పలుమార్లు గుర్తు వచ్చాయి. ఆ దారులలో కూడా ప్రమాదాలు తక్కువేమీ కావు. అయితే, మంచు, ఆ మంచు క్రింద దాగిన మరణ గహ్వరాలు మాత్రం లేవు. ప్రమాదం ముఖ్యంగా క్రూర జంతువుల నుంచే. అవి ఎదురు అయినప్పుడు మృత్యువు కళ్ళెదుట నిలబడినట్లు అనిపిస్తుంది. కానీ, ఆ జంతువులు కూడా మనుషులకు భయపడేవి. రాత్రిపూట నల్లటి సర్పాలు బుసకొట్టేవి. పెద్ద పెద్ద కొండ చిలువలు నోళ్ళు తెరుచుకుని కనిపించేవి. ఎలుగుబంట్లు, చిరుతపులులు, ఏనుగులు మున్నగు జంతువులు కూడా ఎదురు వచ్చేవి. తపోవనంలోని మంచు పీఠభూమిలో ఆ సంఘటనలు గుర్తుకు వచ్చాయి. కానీ, ఆ పీఠభూమి మరింతగా వణికించే స్థలం. ఒకరిద్దరు సన్యాసులు అక్కడ కనిపించారు. వారు ఆ దారి గురించి కొన్ని కథలు వినిపించారు, అవి విన్న మనిషి మరింతగా భయకంపితుడు కావలసిందే.

శరీరాన్ని గగుర్పాటు చెందించే ఈ స్మృతులతో బయటకు వచ్చి శ్రీరామ్ అంతటా కనిపిస్తున్న రంగురంగుల రాళ్ళను, అడవి పువ్వులను పరిశీలించసాగాడు. నలువైపులా విస్తరించి తళాతళా మెరుస్తున్న తెల్లని మంచులో ఈ రంగు రాళ్ళు, పువ్వులు ఇంద్రధనుస్సులా ప్రకృతి అందాలకు మెరుగులు దిద్దుతున్నాయి. అప్పుడు శ్రీరామ్‌కు అక్కడ అడుగడుగునా కనిపించిన కందకాలు, బావులు గుర్తుకు వచ్చాయి. మృత్యు స్మరణలోనే జీవన ఆనందం ఇమిడి ఉన్నదని ఈ అనుభూతులు శ్రీరామ్‌కు బోధించాయి. మృత్యువు యొక్క భయానకత గుర్తుంటే మనం వర్తమానాన్నే సమగ్రంగా జీవిస్తాం; ఎదురుగా ఉన్న క్షణాన్ని పూర్తిగా సద్వినియోగపరుచుకుంటాం. అది సత్యంతో పాటు ఆనందానుభూతిని కలిగిస్తుంది. గడచిన మూడు నాలుగు రోజులలో ఎప్పుడూ ఉన్ని దుస్తులు ధరించే అవసరం రాలేదనే విషయం కూడా ఈ అనుభూతితో పాటు శ్రీరామ్‌కు జ్ఞప్తికి వచ్చింది.

చలి వేయలేదని గుర్తుకు రావడంతో మరో ఆలోచన మనసు లోకి వచ్చింది. నోరు, కళ్ళు, ముక్కు - వీటిని కప్పుకోము. వీటికి చలివేయదు. మరి, మిగతా శరీరానికి చలి ఎందుకు వేస్తున్నది? కొండలలో ప్రజలు ఉన్ని దుస్తులు లేకుండానే బ్రతకగలుగుతున్నారు. వారికి చలి వేయదు. జ్యోతిర్మఠం నుండి గోముఖానికి వస్తున్నప్పుడు స్వామి నిర్మలానంద చెప్పిన ఈ మాటలు గుర్తుకు వచ్చాయి. కొండ మీద చలిగా ఉంటుంది. కానీ, కొండ లోపలి గుహలలో వెచ్చగా ఉంటుంది. అక్కడ లభించే కాయగూరలు కొన్నింటిని పచ్చివే తినగలుగుతాము. వాటివల్ల వేడి పుడుతుంది. భోజపత్రం కాడలోని కణుపులను ఉడికించి ఆ జావ త్రాగితే, చలి వేయదు. కడుపులో మోకాళ్ళు, తల దూర్చి గొంతు కూర్చుంటే కూడా చలివేయదు. విషమ పరిస్థితులలో, అడవి జంతువులను ప్రకృతి ప్రమాదాలను ఎదుర్కొంటూ ఒంటరిగా జరిపిన ఈ యాత్ర, మారిన పరిస్థితులలో మరింతగా గగుర్పాటు కలిగించింది.

ఆ పీఠభూమిలో స్వామి తత్వబోధానంద అనే సన్యాసిని శ్రీరామ్ కలుసుకున్నాడు. ఆ సన్యాసి ఒక చిన్న కుటీరం నిర్మించుకున్నారు. అయితే ఆయన అందులో ఉండడం అరుదు. ఆయన ఎక్కువ సమయం మంచుతో కప్పబడి ఉన్న తపోవనంలోనే ఉంటారు. ఆరుబయట శరీరంపై ఒక వస్త్రం చుట్టుకుంటారు. అప్పుడప్పుడు వచ్చే వ్యక్తులకు ఆ కుటీరంలో బస ఏర్పాటు చేస్తారు. అలాంటి యాత్రికులు ఒకటి రెండు రోజులు ఉండి వెళ్ళిపోతారు. ఆ కుటీరానికి ఇదే ఉపయోగం. మిగతా సమయాలలో అది ఖాళీగానే ఉంటుంది. తపోవనం ప్రారంభమయ్యే చోట ఆశ్రమం కాని, ఆవాసం కాని, ఆలయం కాని, తీర్థం కాని లేదు.

## నందనవనంలో ప్రవేశం

తపోవనం నుండి కొంత ముందుకుపోతే నందనవనం ప్రారంభమవుతుంది. ఆ రోజుల్లో యాత్రికులలో ఎక్కువమంది ఇక్కడికి వచ్చేవారు కాదు. మంచు, ఎక్కడో ఒకటి రెండు వనస్పతులు తప్ప ఎంత దూరం వెళ్ళినా ఏమీ కనపడవు. యాత్రకు, చూడడానికి అక్కడ ఎలాంటి ఆకర్షణా లేదు కనుక, యాత్రికులు తపోవనం నుండే తిరిగి వెళతారు. 99 శాతం యాత్రికుల యాత్ర గోముఖం వద్దనే ముగిసిపోతుంది. ఈ విధంగా నందనవనం పూర్తిగా నిర్జనమైనది. ఆకర్షణ లేనిది. ఇక్కడికి రమ్మని ఆదేశం రాకపోతే, శ్రీరామ్ కూడా ఈ వైపు వచ్చేవాడు కాదు.

పీఠభూమికి కొద్ది కిలోమీటర్లు ఆవల ఈ నందనవనం ఉన్నది. ఇక్కడి పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి. బాగా పలుచటి మంచు పొర నేలను కప్పేసింది. మెల్లగా ఆచితూచి అడుగు వేయాలి. స్వామి తత్వబోధానంద ఇలా సలహా ఇచ్చారు "మంచుతో కప్పిన నేలమీద నెమ్మదిగా, జాగ్రత్తగా అడుగు వేయాలి. నేల మీద పువ్వులు పరచారని అనుకుని అడుగు వేయాలి. అడుగు మోపే ముందే ఈ జాగ్రత్త

**శ్రమిస్తే సాధించలేనిది ఏమి లేదు**

తీసుకోవాలి. ఊతకఱ్ఱను ఉపయోగించవచ్చు. అయితే కేవలం ఊతకఱ్ఱ మీదనే ఆధారపడకూడదు. ఒక అడుగు సరిగ్గా మోపకుండా మరో అడుగు వేయకూడదు. అక్కడక్కడ నీళ్ళ గుంటలు ఉంటాయి. అక్కడ కూడా ఇలా జాగ్రత్తగా ఉండాలి".

జ్యోతిర్మఠం దాటిన తర్వాత దాంధరియా సమీపంలో భూఇందర్ కొండచరియలో కూడా ఒక పూలలోయ ఉంది. దీనిని నందనకానన అని పిలుస్తారు. 'ఫూలోంకీ ఘాటీ' (పూలలోయ) అన్నది ప్రసిద్ధి పొందిన పేరు. త్రేతాయుగంలో లక్ష్మణుడు ఇక్కడే తపస్సు చేశాడు.

పూలలోయను పరశురాముడు నిర్మాణం చేశాడన్నది ప్రజల నమ్మకం. సీతా స్వయంవరం సమయంలో శ్రీరామచంద్ర భగవానుని ఆజ్ఞతో ఆయన ఇక్కడే నివసించాడు. బ్రాహ్మణ ధర్మాన్ని వదలి క్షత్రియ సంహారం చేసినందుకు ఆయన ఇక్కడ ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు. దుర్మార్గులైన క్షత్రియులను సంహరించడానికి ఆయన తన ఆయుధాన్ని ప్రయోగించాడు. అయితే అది బ్రాహ్మణత్వ నియమానికి ఉల్లంఘన అని ఆయన భావించాడు. ఈ పాపం నుండి విముక్తి ఎలా కలుగుతుందని ఆయన శ్రీరామచంద్రుడిని అడిగాడు. హిమాలయ ప్రాంతాన్ని పూలచెట్లతో నింపవలసిందని ఆయన సలహా ఇచ్చాడు. విష్ణుమూర్తి అంశావతారం ఆయన పరశురాముడు ఈ ప్రాంతంలోనే తపస్సు చేశాడు. చాలారకాల పూలచెట్లను నాటాడు.

అయిదు కిలోమీటర్ల పొడవు, రెండు కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ క్షేత్రంలో నేటికి 700 రకాల పూలచెట్లు ఉన్నాయి. ప్రపంచంలో మరెక్కడా ఇంతటి వైవిధ్యం కలిగిన పూలచెట్లు, వనస్పతులు లేవు.

శ్రీరామ్ చేరిన నందనవనం ఈ పూలలోయ కన్నా భిన్నమైనది. అక్కడికి ఎవరికీ సులభంగా ప్రవేశం దొరకదు. ఎన్ని కష్టాలు పడినా, ఎంత సాహసం చేసినా అక్కడికి వెళ్ళలేము. స్వామి తత్త్వబోధానంద చెప్పిన జాగ్రత్తలన్నింటినీ శ్రీరామ్ అక్షరాలా పాటించాడు. అయినా కొన్నిచోట్ల ఇబ్బందులు వచ్చాయి. అడుగు స్థిరంగా పడినప్పటికీ, లోతుకు దిగబడి పోతున్నట్లు అనిపించేది. అయితే మరుక్షణంలో ఎవరో చేయి పుచ్చుకుని లేవదీస్తున్నట్లు అనిపించేది.

## మరో మారు సాక్షాత్కారం

ఇలా జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ శ్రీరామ్ 2 - $2^1/_2$ కిలోమీటర్లు ముందుకు వెళ్ళి ఉంటాడు. అక్కడ ఒక కొండ దిబ్బ కనబడింది. ఆ దిబ్బ మీద మంచు కప్పును చీల్చుకుని కొన్ని వనస్పతులు వెలిశాయి. వాటిని చూస్తే శ్రీరామ్‌కు ఆశ్చర్యం కలిగింది. మంచు వాతావరణంలో పచ్చని పైరు ఎలా మొలిచింది. అయితే అది ప్రకృతి చేసిన అద్భుతం అని ఆయన తనను తాను సమాధానపరచుకున్నారు. అంతా సహజమే కావచ్చు. స్వాభావికమే కావచ్చు. ప్రకృతి నియమం అర్థం కాదు కనుక మనకు అద్భుతం అనిపించవచ్చు. ఆయన ఆ వనస్పతుల వైపు దృష్టిసారిస్తూ ఉండగా ఒక చల్లని వాయు వీచిక వచ్చింది. ఆ గాలి తరగలో ఏదో తీయ తీయని సుగంధం నిండి ఉన్నది. ఆ సువాసనను గుర్తు పట్టడానికి శ్రీరాం ప్రయత్నించాడు. ఆవల్‌ఖేడాలో వసంత పంచమి రోజున పూజ గదిలో తనకు అనుభవం అయిన సువాసనయే అది.

ఆ సువాసనను గుర్తుపట్టగానే, ఆయన దృష్టి ఆ వనస్పతుల నుండి మళ్ళింది. ఆ సుగంధం వస్తున్న వైపు చూసాడు. కొద్ది అడుగుల దూరంలో తనకు పరిచితమైన గురుదేవులు దిగంబర స్థితిలో నిలబడి ఉన్నారు. ఆయనను చూడగానే ఆనందం అవధులు దాటింది. ముఖమండలం పులకితం అయింది. ఆయనకు ప్రణామం చేయడానికై వంగారు. దిగంబర యోగి చేయి ఆశీర్వచన ముద్రలో పైకి లేచింది. మంచులా తెల్లని గడ్డం. మీసాల వెనుక దాగిన చిరునవ్వు వెలికి వచ్చింది. ఆ కళ్ళలో వెలుగు. ఆ వెలుగు తళతళలలో శ్రీరామ్‌కు అభివాదనం. ఆయన ఏమీ మాట్లాడలేదు. దారిలో వచ్చిన ఇబ్బందుల గురించి కూడా అడుగలేదు. కుశల ప్రశ్నలు వేయలేదు. తన వెనుక రమ్మని సైగ చేశారు.

శ్రీరామ్ తన మార్గదర్శక సత్తాను అనుసరిస్తూ ముందడుగు వేయసాగాడు. జాగ్రత్తగా నడవాలనే ఆలోచన అతని మనస్సులో ఇప్పుడు లేదు, నిశ్చింతగా తమ మార్గదర్శక సత్తా వెనుక నడుస్తున్నాడు. శ్రీరామ్ ఏ కొండదిబ్బ చూచి ఆశ్చర్య పడ్డాడో ఆ కొండ దిబ్బవైపు గురుదేవులు నడుస్తున్నారు. అయితే ఆయన ఆ గుట్ట ఎక్కలేదు. మంచు అడుగున ఉన్న ఒక గుహలో ప్రవేశించారు. గురుదేవులు వెనుక గుహలోకి వెళ్తూ ఉండగా ఒక ఆలోచన వచ్చింది. పైన కప్పబడి ఉన్న మంచు విచ్చుకుని పడితే సజీవ సమాధి అవుతానని. ఆ క్షణంలోనే తన ఆలోచనకు తనకే నవ్వు వచ్చింది. ఆయన అలా నవ్వుతూ ఉండగా గురుదేవులు ఇలా అన్నారు.

"సజీవ సమాధి కావడంలో కూడా ప్రయోజనం ఉన్నది. నీవు కూడా సూక్ష్మశరీరధారివి అయిపోతావు. సిద్ధులు నివసించే ఈ కాననంలో నివసిస్తావు".

★★★

**వ్యక్తి ఉన్నతికి గానీ, పతనానికి గానీ అతని ఆలోచనలే మూలకారణం**

యుగ నిర్మాణ యోజన

# మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 15

## సజ్జనులను సంఘటిత పరచుటలో, అవినీతి యెడల కాఠిన్యత కలిగి ఉండుటలో, సృజనాత్మక కార్యకలాపాలలో పూర్తి ఆసక్తిని కలిగి ఉంటాము

సౌమ్యమైన విషయములను కనుసైగతోనే అర్థమయ్యేలా చేయవచ్చు; వివేకము, తర్కము ద్వారా వాటి యొక్క గొప్పతనాన్ని వివరించి ప్రజలను సన్మార్గములో నడిచేందుకు తోడ్పడవచ్చు. కానీ దుర్మార్గపు ఆలోచనలను మార్చాలంటే ఇనుమును కొలిమిలో కాల్చి సాగగొట్టినంత ప్రయత్నము చేయక తప్పదు. దుర్యోధనుడిని బుజ్జగించాలని శ్రీకృష్ణుడు రకరకాలుగా ప్రయత్నించాడు. కానీ సఫలం కాలేకపోయాడు. ఇక అప్పుడు అతడిని సరైన మార్గంలోకి లాగేందుకు అర్జునుని ద్వారా బాణ ప్రయోగం చేయకతప్పలేదు. సాధుస్వభావమున్న పశువులకు చెప్పినట్లుగా పొగరుగిత్తలకు చెప్పాలంటే కుదరదు. వాటికి సున్నితమైన భాష అర్థం కాదు అందుకని చెర్నాకోలుతోనే చెప్పాలి. భగవంతుడు ధర్మస్థాపన చేసేందుకై మళ్ళీ మళ్ళీ అవతారం తీసుకుంటాడు, దానితోపాటే రాక్షసనిర్మూలన చేసేందుకై రౌద్రకృత్యములను కూడా చేస్తాడు.

వ్యక్తిగత జీవితంలో దైవీశక్తిని అవతరింపచేయడమనేది ఒక సృజనాత్మక కార్యము. దాని కొరకు నిరంతరం సద్గుణాలను అభివృద్ధిపరుచుకోవడమనే సాధన నిరంతరం జరుగుతూనే ఉండాలి. దానితోపాటే అంతరంగంలో ఉన్న దోషములను, దుర్గుణములను విడనాడక తప్పదు. కుసంస్కారములను నిర్మూలించకపోతే సద్గుణములు మొలకెత్తడం చాలా కష్టం . బద్ధకం, నిర్లక్ష్యం, ఆవేశం, అసంయమనం వంటి దుర్గుణాలకు వ్యతిరేకంగా అడుగడుగునా యుద్ధం చేసి వాటిని నాశనం చేయుటకు ప్రయత్నం చేస్తూనే ఉండాలి. లోపల ఉన్న శత్రువులను కౌరవులుగా భావించి జీవిరూపంలో ఉన్న అర్జునుడిని పోరాడేందుకు ప్రోత్సహించడమే గీతలోని అంతరార్థము. ఎవరైతే తమపై తాము విజయం సాధిస్తారో వారే నిజమైన విజేతలుగా చెప్పబడతారు. సామూహిక జీవితంలో కాలానుగుణ్యంగా అనేక దురాచారాలు ప్రబలుతుంటాయి. వాటిని నిలువరించేందుకు అధికారిక, అనధికారిక స్థాయిలో తీవ్రమైన ప్రయత్నాలు చేయబడతాయి. రక్షకభటులు, కారాగారాలు, న్యాయస్థానం, న్యాయం, సైన్యముల ద్వారా ప్రభుత్వం వాటిని అణచివేస్తుంది. ఇంకా ఎన్నో చట్టాలు చేసి వారిని ఆపేందుకు యథాశక్తి ప్రయత్నం చేస్తూనే ఉంటుంది.

ఈనాడు నైతిక, భౌతిక, సామాజిక రంగాలయందు అవాంఛనీయతత్వాలు విపరీతంగా పెరిగిపోయాయి. అక్కడ శాంతిని, సువ్యవస్థను నెలకొల్పడమనేది ఒక పెద్ద సమస్యగా తయారైంది. మోసం, అసత్యం, కపటం, నమ్మక ద్రోహం అనేవి ఎంత విపరీతంగా పెరిగిపోయాయంటే ఎవరిని నమ్మాలన్నా ప్రమాదకరంగానే అనిపిస్తున్నది. ఈనాడు మనిషి యొక్క ఆలోచనలు చాలా నీచంగా, స్వార్థపూరితస్థాయికి దిగజారిపోయి చాలా హీనస్థితికి చేరుకున్నాయి. ఉదరపోషణ, సంతానము తప్ప ఎవ్వరికీ మరో లక్ష్యమనేది లేదు. ఆదర్శవాదం, ఉన్నతమైన జీవిత విధానంవంటి పదాలు చెప్తే వినేందుకు మాత్రమే పనికొస్తున్నాయి. ఆచరణ యోగ్యమైనవిగా ఎవరు భావించడం లేదు. సామాజికపరమైన చెడు సంప్రదాయాల గురించి చెప్పవలసిన అవసరమే లేదు. వివాహములనేవి ఉన్మాదములుగా మారిపోయాయి, విందు భోజనాలు, స్త్రీలను నీచంగా చూడడం, బాల్యవివాహాలు, వృద్ధ వివాహాలు... భారతీయ సమాజపు గౌరవాన్ని కించపరిచే విధంగా పేదరికం లోకి తోసేసే ఈ వివాహోన్మాదము పేరుతో ప్రబలిపోతున్న రాక్షసుడిని మనం సంపూర్ణ శక్తితో ఎదిరించక తప్పదు. దీన్ని వ్యతిరేకించేందుకై ప్రతిజ్ఞా పత్రాల ద్వారా ప్రచారం సాగించేందుకు చిన్నఅడుగులు వేయబడ్డాయి. ఇంకా ముందుకు సాగి సత్యాగ్రహాలు చేయడం, ఘొరావ్‌లు, సహాయ నిరాకరణవంటి పద్ధతుల ద్వారా ఈ దురాచారాన్ని నిర్మూలించేందుకు ప్రయత్నించాలి. ఈ దురాచారము చాలా

**అసూయ మానవత్వాన్ని మంటగలిపి, మానవజన్మనే వ్యర్థం చేస్తుంది**

నీచమైనదని, చెడ్డదని అందరికీ అర్థమయ్యేలా వివరించి వారు దాన్ని వదిలేందుకు సిద్ధపడేలా చేయాలి. **రాబోయే రోజుల్లో వివాహం పేరుతో చేస్తున్న ఈ ఆడంబరాలను నిర్మూలించేందుకు మద్దతిచ్చే వారందరినీ ఒకచోట ఏకం చేసి బలమైన ఏకాభిప్రాయానికి రావాలి. పూర్తిగా సాధారణమైన రీతిలో స్వల్పమైన ఖర్చుతో చేసే వివాహాలను ప్రచారంలోకి తీసుకు వచ్చేదాకా మన సంఘర్షణ ఆగకూడదు. ఈ అనైతిక, అవాంఛనీయ సాంప్రదాయాన్ని తరిమికొట్టేంతవరకు మనం విశ్రాంతి తీసుకోము, తీసుకోనివ్వము.**

మానవీయ అధికారాలను అపహరించడం, స్త్రీని కాళ్ళ క్రింద త్రొక్కి పీడించే అకృత్యాలు మన సమాజం మీద పడ్డ మచ్చలు. సహృదయుడైన, వివేకశీలుడైన ఏ వ్యక్తి కూడా వీటిని సమర్థించడు. ఈ మూర్ఖపరంపరలను, మూఢ సంప్రదాయాలను ఇప్పుడు ధార్మికత అనే పేరుతో పిలుస్తున్నారు. ఇలాంటి స్థితిని చూస్తూ ఎంతకాలం సహించి ఊరుకోగలము? ఈ మూఢాచారాలకు విరుద్ధంగా యుద్ధ ప్రాతిపదికన ప్రచారం సాగించాలి. మనతోపాటు అందరూ ఇందులో సక్రియులై అడుగులు ముందుకు వేయాలి. ఈ సందర్భంలో మనకు ఎన్నో ప్రమాదాలు ఎదురు కావచ్చు. వ్యక్తిగత దోషాలు, దుర్గుణాలతో పోరాడి జీవితాన్ని పవిత్రంగా, స్వచ్ఛంగా, నిర్మలంగా తయారుచేసుకోవాలి. అంతర్గతంగా ఇంకా మిగిలి ఉన్న కుసంస్కారాలతో కూడా పోరాడవలసినదే. కుటుంబ సభ్యులలో కొందరు దాసదాసీలవలె; కొందరు రాజురాణీలవలె జీవించాలి అనే సంప్రదాయమేదైనా ఉంటే దాన్ని మనం మార్చక తప్పదు. అందరికీ సమాన అధికారాలు, లాభాలు, శ్రమ, సహకారము న్యాయమైన రీతిలో అందుబాటులోకి తీసుకు రావాలి. ఆర్థిక రంగంలో అవినీతికి తావు ఉండకూడదు. వ్యక్తిగత వ్యవహారాలయందు మోసం, నమ్మకద్రోహం వంటివి ఉండకూడదు. ఇందుకొరకు అందరినీ ఒప్పించి ఏకాభిప్రాయానికి వచ్చేటట్లు చేయాలి. అవాంఛనీయతత్వాలకు వ్యతిరేకంగా పోరాటం ఎంత సక్రియంగా చేయాలంటే తప్పు చేయాలన్నా, గుండాగిరి చేయాలన్నా మనుష్యులు భయపడాలి. అవినీతి సంపాదన తినేవారికి వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం చేయాలి. ఈ పోరాటం వల్ల అవినీతిపరులు రోడ్డుపైకే కాదు ఇంటి నుండి బైటకు రావాలన్నా ముఖం చాటేయాల్సిందే. వారి స్వస్థలంలో కూడా వారికి వ్యతిరేకంగా నోరు విప్పేందుకు ఎవరూ భయపడకూడదు. సమాజంలో వారు తిరగడం మానెయ్యాలి. అలాంటివారికి సహాయం చేసేందుకు పనివారు, దర్జీవారితో సహా అందరూ నిరాకరించాలి. ఒకప్పుడు కత్తి తిప్పేవాడిని, శిరస్సులు ఖండించేవాడిని అగ్రస్థాయి యోధుడిగా చెప్పేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు నలువైపులా వ్యాపించి ఉన్న అనాచారాలకు, ఆక్రమణలకు వ్యతిరేకంగా యుద్ధం చేయగలిగే సాహసం చూపినవాడు గొప్ప వీరుడిగా చెప్పబడతాడు. దుర్బుద్ధితో పోరాడే సామర్థ్యం ఉన్నవారు చేసే ప్రయత్నాల ద్వారానే మానవతను రక్షించడం సంభవమవుతుంది. ఆ కీర్తి వారికే దక్కుతుంది.

స్వార్థపరులు, అధికార దుర్వినియోగం చేసేవారు సార్వజనిక సంస్థలను తమ సొంత పనులకు అడ్డాలుగా ఉపయోగించు కుంటున్నారు. అలాంటి వాళ్ళందరినీ పాలలో పడ్డ ఈగను తీసి పారేసినట్లు తీసి పారెయ్యాలి. ధర్మము, ఆధ్యాత్మికత అనే ముసుగు వేసుకున్నవారి నిజస్వరూపాన్ని రోడ్డు మీద నిలబెట్టి అందరి ఎదుట వారు చేసే అకృత్యాలను నిరూపించాలి. వారిని చూసి అందరూ అసహ్యించు కోవాలి. అలాంటివారి బారి నుండి అమాయక ప్రజలను రక్షించి కాపాడడమనేది కూడా అత్యంత శ్రేష్ఠమైన, ఉన్నతమైన సేవగా పరిగణించాలి. స్వచ్ఛమైన పరిపాలనను అందించగలిగే రాజకీయనాయకులు, సహాయకులు, మంత్రులు, అధికారులు ఈ పనిచేసే బాధ్యత తీసుకోవాలి. వారు పరిపాలనా వ్యవస్థను తమ కొరకు కాక లోకకళ్యాణం కొరకు ఉపయోగించాలి.

యుగనిర్మాణ ప్రణాళిక రాబోయే రోజుల్లో ఈ విధమైన బహుముఖ పోరాట కార్యక్రమానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నది. దానికి అవసరమైన సాధనాలు ఎంతమేరకు అందితే అంతమేరకు, సంఘటితశక్తి ఎంత మేరకు అందితే అంతమేరకు శాంతంగా, అహింసాయుతంగా సౌమ్యమైన కార్యక్రమాలకు యుగనిర్మాణ ప్రణాళిక శ్రీకారం చుడుతుంది. అడుగడుగునా అవినీతి, అన్యాయంతో పోరాడడమనే ధర్మయుద్ధం చేస్తున్నాము. ఇందులో మానవత్వం ఎగురవేసే విజయకేతనం ప్రపంచ మంతా ఎగిరేంతవరకు ఈ పోరాటం ఆగదు.

*– అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ఎదుటి వారి ఆనందాన్ని పంచుకునే మనస్సు, ఒక దివ్యమైన వరమే**

# షట్చక్రాల బుట్టలో చేతనత్వ మహాసాగరం

మానవ కాయసత్తా గురించి ఇప్పటివరకు జరిగిన చర్చ సామాన్య జ్ఞానపరిధిలోకి వస్తుంది. దీనిని యంత్రముల ద్వారా తెలుసుకోవచ్చు, అర్థం చేసుకోవచ్చు. ఇది కాయం యొక్క స్థూలపక్షము. ఈ జ్ఞానాన్ని విశ్లేషణ చేసి డాక్టర్లు శరీర చికిత్స, శల్య చికిత్స చేస్తుంటారు.

ఇప్పుడు చేతనత్వ సత్తా గురించి చర్చించబోతున్నాము. అది స్థూలము, సూక్ష్మము కూడా. స్థూలం ఎంతవరకు అంటే శరీరంలో ప్రాణంపోతే అప్పటిదాకా రకరకాల పనులు చేస్తున్న ఆ శరీరమే ఒక్క క్షణంలో నిశ్చేష్టమవుతుంది, కుళ్ళటం మొదలవుతుంది. సూక్ష్మం ఎంతవరకు అంటే దాని చిన్నపెద్ద పనులు విశ్వ చేతనత్వంతో ముడిపడి ఉన్నాయి. విశ్వమంతటా వ్యాపించి ఉన్న శక్తిని తన సామర్థ్యానుసారం గ్రహిస్తుంటుంది, వదలడం జరుగుతుంది. వ్యక్తిగత చేతనత్వం బ్రహ్మచేతనత్వం లోని ఒక అంగం కావడం వలన వాటి మధ్య ఆదాన ప్రదానములు (ఇచ్చి పుచ్చుకోవడాలు) జరుగుతుంటాయి. కుండలినీ శక్తి యొక్క చర్చ ఎప్పుడు వచ్చినా ఈ సూక్ష్మ చేతనత్వ వివేచన చేయబడు తుంది.




మనిషి శరీరంలో జీవనీశక్తి ఎక్కువగా ఉండే అనేక కేంద్రములు ఉన్నాయి. వీటిని మర్మస్థానములని అంటారు. వీటి సంఖ్య ఏడు వందలుగా చెప్పబడింది. ఈ స్థానములలో ప్రాణశక్తి తగ్గితే ఆరోగ్యం దెబ్బ తింటుంది, అనేక రోగాలు పాలవుతారు. చికిత్సా విజ్ఞానంలో మర్మస్థానములకు విశేషమైన ప్రాధాన్యత ఇవ్వబడింది. జపాన్, చైనా దేశములలోని ఆక్యుప్రెజర్ (accupressure) ఆక్యుపంక్చర్ (accupuncture) చికిత్సా విధానాలకు మూలాధారం ఈ మర్మ స్థానములే.

సుప్రసిద్ధ వైజ్ఞానికుడు కె. కార్లఫీడ్ తన "ది వైటల్ సెంటర్స్ ఆఫ్ మైన్" గ్రంథములలో మర్మస్థానములలో నరాలు అధికంగా ఉంటాయని, అవి కేంద్రముతోను, ఒకదానితో ఒకటి సంబంధం కూడా కలిగి ఉంటాయని చెప్పాడు. మర్మ స్థానములే కాక శరీరంలో ఏడు ప్రముఖ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ప్రాణశక్తి, అతీంద్రియ శక్తుల అపార వైభవం నిద్రాణంగా పడి ఉన్నది. ఈ స్థానములను చక్రములని లేక ప్లెక్సస్ (plexus) అని అంటారు. ఈ కేంద్రాలలో జ్ఞాన తంతువులు ఎక్కువగా ఉంటాయి. స్థూల, సూక్ష్మ శరీరముల కలిసే స్థానములలో ప్లెక్సస్ ఉన్నాయని చెప్పబడింది.

ఐరోపాకు చెందిన ప్రఖ్యాత మనోవైజ్ఞానికుడు పైలాసెక్స్ శరీరంలోని సూక్ష్మ కేంద్రాలను 'ఎస్టామ్' అని పేరుతో పిలుస్తూ వాటిని శక్తిపుంజములుగా వర్ణించాడు. ఆయన చెప్పేదాని ప్రకారం గ్రహ నక్షత్రం, బ్రహ్మాండంలోని శక్తులు ఈ కేంద్రముల ద్వారా మనిషిలో అవతరిస్తాయి.

యోగాచార్యులు చక్రాలను కమలములని కూడా అంటారు. ఉదాహరణకు హృదయ కమలం, నాభి కమలం, సహస్రార కమలం మొదలైనవి. ఇంగ్లీషు భాషలో వీటిని ప్లెక్సస్ అంటారు. జపాన్ దేశం యొక్క జెన్ ధర్మంలో వీటిని క్యాసోస్ అంటారు. చైనాకు చెందిన టావో ధర్మంలో చక్రములను విశ్వ బ్రహ్మాండంలో చెల్లాచెదురైన నర-నారీ ''యంగ్, ఇన్'' శక్తుల ఏకత్రీకరణ-సమ్మిళన కేంద్రములుగా చెప్పబడింది.

సర్ జాన్ ఉడ్‌రఫ్ అనే ఆయన "పవర్ యాజ్ రియాలిటి" అనే పుస్తకంలో, వి.జి.రేల్ "ది మిస్టీరియస్ కుండలినీ" లోను, శ్రీదాస్ గుప్త "హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫి" లోను, ఇవాన్స్ వేటూన్స్ "టిబెటియన్ బుక్ ఆఫ్ గ్రేట్ లిబరేషన్" లోను హెచ్.జి.వెల్స్ "మైథాలజి ఆఫ్ సోల్" లోను, సూక్ష్మ శరీరం యొక్క వర్ణన ఇచ్చారు. ఇవన్నీ భారతీయ ఋషులు, యోగులు తంత్ర శాస్త్రములో వివరించినవే. యోగ

**ఆశించిన గమ్యం వైపు నడుస్తూనే ఉండాలి**

కుండల్యుపనిషద్, మహానిర్వాణ తంత్రము, షట్చక్ర నిరూపణ, ధ్యాన బిందు ఉపనిషత్తు, యోగార్ణవ తంత్రం, కుండలినీ తంత్రం, శారదా తిలకం మొదలైన గ్రంథములలో వివరించిన కుండలినీ, ఇడ-పింగళ, సుషుమ్నల; మూలాధారం, సహస్రారం అనే రెండు కేంద్రాలను, విజ్ఞాన సమ్మత భాషలో ఒక పరిధి వరకు వివరించవచ్చు.

సుషుమ్నను విద్యుతీయ ద్విధృవ కేంద్రంగా (electric dipole) గా భావిస్తారు. దీని క్రింది భాగం కాడా ఈక్వినా (cauda equina) గా చెప్తారు. ఇది ఋణ ఆవేశం గలది, పై భాగం 'సెరెబ్రమ్' (cerebrum) అనే భాగం ధనావేశం గలది. కాడా ఈక్వినా మూలాధార చక్రస్థానంలో ఉన్నది. ఇదేవిధంగా సెరెబ్రమ్‌లో వెలుగొందుతున్న ఎసెండింగ్ రెటిక్యులర్, ఎసెండింగ్ సిస్టంను సహస్రారంగా భావించవచ్చు. అసామాన్య స్థితిలో ప్రవాహం క్రింద నుండి పైకి ప్రవహించి నప్పుడు, దీనిని కామబీజం నుండి బ్రహ్మబీజం యొక్క యాత్రగా చెప్తారు. ఇది మేరుదండంలో దేవయాన మార్గంలో పూర్తవుతుంది. శరీరం మొత్తంలో సుమారు ఒక లక్ష ఓల్టులు ప్రతి సెంటీమీటర్‌లో జీవవిద్యుత్తు యొక్క ప్రభావం ఉంటుందని వైజ్ఞానికుల అభిప్రాయం. ఇతర జీవజంతువులవలె ఇది జననేంద్రియముల ద్వారా, చర్మం ద్వారా, శ్వాస ద్వారా ప్రతి నిత్యం క్షీణిస్తుంటుంది, చివరకు పూర్తిగా పోతుంది. మనుష్యుడు స్ఖలనం వలన పతనం చెందకుండా ఆత్మసత్తాను ఊర్ధ్వగామిగా చెయ్యాలి, యోగాభ్యాసం ద్వారా చక్రబంధనం చేస్తూ సహస్రారం వరకు వెళ్ళి తన తేజోవలయాన్ని పెంచుకోవచ్చు.

చక్రములు ఆరు. ఏడవదైన సహస్రారం ఈ లెక్కలోకి రాదు. దానిని సహస్రదళ కమలమని కూడా పిలుస్తారు. ఈ చక్రములు మానవ శరీరములో ఏ భాగానికి సంబంధం ఉన్నదో వివరణ ఇక్కడ ఇవ్వబడుతున్నది.

మూలాధార చక్రం సుషుమ్న (central canal of spinal cord) క్రింది మొన వద్ద మేరుదండం యొక్క కాక్సీజియల్ (coccygeal) క్షేత్రములో పెరీనియం (perineum)లో గుదమునకు జననేంద్రియమునకు మధ్య భాగంలో ఉంటుంది. ఇక్కడ కాడా ఈక్వినా నుండి బయలుదేరే సేక్రల్ నెర్వ్‌రూట్సు అనేక గుచ్ఛకములుగా తయారయి సేక్రెల్, పెరీనియల్ ప్లెక్సస్ (sacral, perenial plexus) తయారవుతాయి. ఈ నాడుల గుచ్ఛకములలో ప్రవహించే విద్యుత్ప్రవాహం శక్తిని ఉత్పత్తి చేసే సుడిగుండంవలె ఉంటుంది. ఈ సూక్ష్మ విద్యుత్ప్రవాహ మును మూలాధార శక్తి అని అంటారు. దీని పని ఉత్పాదన, ప్రజనన. కుండలినీ మహాశక్తి మూడున్నర చుట్టలు చుట్టుకుని ఇక్కడ నిద్రాణమై ఉంటుంది. ఇక్కడ ఉండే ప్రవాహం నాలుగు దళములు గల కమలంగా యోగిజనులకు కనిపిస్తుంది. ఈ నాల్గింటిని పరమానందం, సహజానందం, యోగానందం, వీరానందములకు ప్రతీకలుగా చెప్తారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే శబ్ద బ్రహ్మ కంపనలకు 'లం' అనే పేరు ఇచ్చారు. ఈ చక్రం యొక్క తన్మాత్ర గంధము, తత్వము పృథ్వి.

పైకి పోతుంటే స్వాధిష్ఠాన చక్రం వస్తుంది. ఇది మూలాధారమునకు నాలుగు అంగుళాలు పైన హైపోగాస్ట్రియం (Hypogastrium) అనే స్థానంలో ఉన్నది. ఇక్కడ ఉన్న ప్లెక్సస్ సుషుమ్నకు రెండు వైపుల ఉన్న సింపథిటెక్ గాంగ్లియాన్ (sympathetic ganglion) లేక సుషుమ్న యొక్క నాడీ గుచ్ఛకములతో ఏర్పడుతుంది. దీనికి సంబంధించిన గ్రంథి ఎడ్రినాల్ గ్రంథి, ఈ గ్రంథి ఎడ్రినాలిన్ అనే హార్మోనును ఉత్పత్తి చేస్తుంది. ప్రతికూలతలను ఎదుర్కొనే శక్తి ఈ గ్రంథి సక్రియత వలన కలుగుతుంది. ఉత్సర్జన్ - విసర్జన (**उत्सर्जन-विसर्जन**) దాని ముఖ్యమైన పనులు కానీ ఇది జాగృతమయితే బలిష్ఠత, స్ఫూర్తి పెరుగుతాయి; బద్ధకం-అజాగ్రత్త-అవిశ్వాసం మొదలైన దుర్గుణాలు కనిపించకుండా పోతాయి. ఇక్కడ ఉన్న కమలమునకు ఆరు దళములు, బీజ మంత్రం 'వం' ఈ చక్రమునకు తన్మాత్ర రసం, తత్వం జలం. **మూలాధారం, స్వాధిష్ఠానం ఒక సమూహంలోనికి వస్తాయి. ఇవి కలిసే బిందువును రుద్రగ్రంథి అని అంటారు.**

మూడవ చక్రము మణిపూరకము. శరీర నిర్మాణ దృష్టిలో ఇది నాభిస్థానంలో, మేరుదండంలో లంబార్ రీజియన్ (lumbar region)లో ఉంటుంది. ఇక్కడే సోలార్ ప్లెక్సస్ (solar plexus) ఉంటుంది. ఇది సింపథిటిక్ గాంగ్లియాన్ (sympathetic ganglion) వేగస్ నెర్వ్ (vegus nerve) నాడీ గుచ్ఛకములు కలసి ఏర్పడుతుంది. దీనికి సంబంధించిన గ్రంథి పాంక్రియాస్ (pancreas). ఇది హార్మోనులనే గాక, ఎంజైమ్‌లను కూడా ఉత్పత్తి చేస్తుంది. ఈ చక్రం జాగరణ వలన సంకల్పబలం, పరాక్రమం వృద్ధి చెందుతాయి. జీర్ణక్రియ దీని ముఖ్యమైన పని. మనోవికారాలు తగ్గి, పరమార్థ

**మనం ఒక మంచి పనిని మనస్ఫూర్తిగా తలపెడితే ప్రపంచం తప్పనిసరిగా తోడవుతుంది**

కార్యములలో రుచి కలుగుతుంది. నాభి వద్ద ఉన్న ఈ కమలమునకు పది దళములు ఉంటాయి. దీని బీజ మంత్రం 'రం', తన్మాత్ర రూపం (దృశ్యం), తత్వం అగ్ని. దీని జాగరణ వలన మూడు అగ్నులు జాగృతం అవుతాయి. ఊర్ధ్వగమనంలో సహాయపడతాయి. ఇక్కడ ఉద్భవించిన ఊర్జాను (శక్తిని) జపాన్‌కు చెందిన డా॥ హిరోషిమా మోటోయామా గ్రాఫ్‌పై చిత్రీకరించారు. టిబెట్టు వాసులు దీనిని మణిపద్మం అంటారు.

నాలుగవ చక్రం అనాహతం. ఇది హృదయం వెనుక కార్డియక్ ప్లెక్సస్ (cardiac plexus) స్థానంలో ఉన్నది. ఇక్కడ సింపథిటెక్ గాంగ్లియాన్ చైన్, సుషుమ్న, వేగస్ నెర్వ్ (vegus nerve) తంతువులు కలసి ఒక వలలాగా తయారవుతుంది. ఇది హృదయ క్షేత్రమంతటికి ఊర్జాను (శక్తిని) ఇచ్చే భూమికను నిర్వహిస్తుంది. ఈ చక్రమునకు **12 దళములు ఉంటాయి. పేస్ మేకర్‌కు** (pace maker) **ఊర్జను (శక్తిని) ఇచ్చే క్షేత్రం ఇదే.** దీనిని భావనల సంస్థానమని కూడా భావిస్తారు. కళాత్మక తరంగాలు– రసానుభూతి, కోమలమైన సంవేదనలు ఇక్కడే ఉత్పత్తి అవుతాయి. దీని జాగరణవలన ఉదారత, సహకారం, పరమార్థం, "వసుధైవ కుటుంబకం" అనే భావనలు ఉప్పొంగుతాయి. దీనితో కలసిన గ్రంథి, థైమస్ గ్రంథి. ప్రాణధారణ, దాని సదుపయోగం దీని ముఖ్యమైన పనులు. ఈ చక్రం యొక్క బీజమంత్రం 'యం'. అనాహతనాదం లేక శబ్ద బ్రహ్మ కేంద్ర స్థలం ఇదే. స్పర్శ దీని తన్మాత్ర, తత్వం వాయువు. **అనాహతం, మణిపూరకం కలసి సూర్యఖండం తయారవుతుంది, దీనిని విష్ణుగ్రంథి అని అంటారు.**

కంఠంలో విశుద్ధి చక్రం ఉన్నది. థైరాయిడ్ గ్రంథి, దాని వెనుక ఉన్న ఫేరెంజియల్ (pharyngeal), లారెంజియల్ ప్లెక్సస్ (laryngeal plexus) దీనికి సంబంధించినవి. ఈ చక్ర జాగరణ వలన అతీంద్రియ శక్తుల బీజాంకురం విచ్చుకుంటుంది. ఈ చక్రం అచేతన మనస్సును, చిత్త సంస్థానమును ప్రభావితం చేసి, కుడి మస్తిష్కంలోని "సైలెంట్ ఏరియా (silent area)" ను జాగృతం చేస్తుంది. ఇక్కడ ఉన్న కమలమునకు 16 దళములు, దీని బీజమంత్రం 'హం', శబ్దం దీని తన్మాత్ర, తత్వం ఆకాశం. **ఆజ్ఞాచక్రం ఆరవది, చివరిది. విశుద్ధితో కలసి చంద్ర సమూహం, బ్రహ్మగ్రంథి తయారవుతుంది.** దీని బీజమంత్రం ఓం (ఓం), తత్వము, మనస్సు. దీనికి రెండు దళములు ఉంటాయి. ఇది పీనియల్, పిట్యూటరి గ్రంథులు కలసి తయారవుతుంది. భ్రూమధ్య స్థానమునకు నేరుగా ఉన్న ఈ రెండు గ్రంథులు శరీరం యొక్క గతివిధులను (activities) సంచాలనం చేస్తాయి. దీని జాగరణ వలన దివ్యచక్షువు తెరచుకుంటుంది. లింబిక్ సిస్టం (limbic system) హైపోథలమస్ (hypothalamus) జాగృతం అయితే మస్తిష్కం యొక్క అన్ని పొరలు తెరచుకుంటాయి. వ్యష్టి సత్తా సమిష్టి చేతనత్వంతో సంబంధం ఏర్పరచుకో గలుగుతుంది.

సహస్రారం కుండలినీ జాగరణ యొక్క మహాయాత్రకు అంతిమ మజిలి. ఇది మెదడు మధ్య ఇంటర్నల్ క్యాప్సూల్, రెటిక్యులర్ యాక్టివేటింగ్ సిస్టంలో (internal capsule, reticular activating system) ఉన్నది. ఇక్కడ అగ్ని కణములు సహస్ర సంఖ్యలో లేస్తాయి. అందువలన దీనిని సహస్రారం అని చెప్పబడింది. దీనిని బ్రహ్మలోకమని, బ్రహ్మ రంధ్రమని కూడా అంటారు. సహస్రారం ఉత్తర ధృవం, ఇది బ్రహ్మాండీయ చేతనత్వంతో కలసి బ్రహ్మానందాన్ని ప్రాప్తింప చేస్తుంది. సహస్రార చక్ర జాగరణ అంటే మెదడులోని గ్రే మేటరు (grey matter) లోని కేంద్రముల జాగరణ. మూలాధారం నుండి బయలుదేరిన సుషుమ్న నాడి పైకి వెళ్తుంది. తన రెండు వైపుల ఎడమ ప్రక్క నుంచి కుడి ప్రక్కకు, మరల కుడి నుండి ఎడమ ప్రక్కకు ఇడ (గంగ), పింగళ (యమున) లను తీసుకుని వెళ్తుంది. ఇడ ఎడమ వైపు ఉంటుంది. దీనిని చంద్రనాడి అని అంటారు. ఇది ఋణావేశం (-ve) కలది. పింగళ నాడి కుడివైపు ఉంటుంది, దీనిని సూర్యనాడి అని అంటారు. ఇది ధనావేశం (+ve) కలది. ఈ రెండు సుషుమ్న రూపిఐయిన సరస్వతితో కలసి మూలాధారం వద్ద, ఆజ్ఞాచక్రం వద్ద త్రివేణి సంగమం తయారవుతుంది. ఇడ, పింగళ నాడులు పారాసింపథిటెక్, సింపథిటెక్ సిస్టం (para sympathetic, sympathetic system)ల ప్రతినిధిత్వం చేస్తాయి.

వస్తుతః కుండలినీ శక్తిని స్థూల అనాటమి యొక్క శబ్దావళిలో వర్ణించడం అసంభవం. అయినా ప్రయత్నించడం జరిగింది. కుండలినీని సర్పెంట్ పవర్ (serpent power) అని, జీవనీ శక్తి అని, ఫైర్ ఆఫ్ లైఫ్ (fire of life) అని, ఇంకా ఎన్నో రకాల పేర్లతో పిలుస్తారు. షట్చక్ర భేదన లేక కుండలినీ జాగరణతో ఉద్భవించే శక్తితో వ్యక్తికి బ్రహ్మవర్చస్సు ప్రాప్తిస్తుంది.

*– అఖండజ్యోతి, జనవరి 1987*

**ఆత్మవిశ్వాసం లేనివాడే నిజమైన వికలాంగుడు**

వ్యక్తి నిర్మాణం

# సంస్కారవంతులుగా కావాలి

సంస్కారము అనగా 'బాగుచేయుట'! ప్రపంచములోని ప్రతి వస్తువు ఏదో ఒకనాటికి వెళ్ళిపోతుంది. అయితే ఆ వస్తువు వెళ్ళిపోయినా ఆ వస్తువు సాధించిన విజయముల వలన ఆ వస్తువు యొక్క కీర్తిని శాశ్వతముగా ఉండే రీతిలో ఆ వస్తువును తీర్చిదిద్దటాన్ని 'సంస్కారము' అంటారు. తుమ్మ చెట్టుకున్న కొమ్మ ముళ్ళతో కూడి ఉంటుంది. నైపుణ్యము కలిగిన వ్యక్తి ఆ చెట్టు మొదలులో కూర్చుని ఆ చెట్టుకున్న నిటారుకొమ్మని నరికి, దానికున్న బెరడును, ముళ్ళను జాగ్రత్తగా కత్తితో చెక్కివేస్తాడు. అలా చెక్కివేసినాకూడా ముళ్ళున్నచోట చేతితో తడిమితే కనుక ఆ ప్రదేశములో బుడిపలాగా ఉండి అది గుచ్చుకుంటుంది. అందుచేత గరుకుగా ఉన్న నేలమీద పెట్టి దాన్ని అరగదీస్తాడు. అప్పుడు ముళ్ళ ప్రారంభ స్థానము కూడా నునుపుగా అయిపోతుంది. ఆ తరువాత అది నున్నగా ఉన్నదా లేదా అని తన చేయిపెట్టి ఈ చివర నుండి ఆ చివరకు రాసి చూస్తాడు. ఏమీ గుచ్చుకోవటము లేదు అని నిర్ధారించుకున్నాక కఱ్ఱ పైన, చివరలను చిన్నగా అరగదీస్తాడు. ఇప్పుడు తుమ్మకొమ్మ అంతా నున్నగా తయారైనది. దానిని పట్టుకెళ్ళి తన తాతగారికి ఇస్తాడు. తాతగారు ఆ కఱ్ఱ పట్టుకుని నడుస్తాడు.

తుమ్మచెట్టులో కొమ్మగా ఉంటే అది ఎవ్వరికీ ఉపయుక్తము కాదు. ముళ్ళు ఉంటాయి కనుక దానిని ఎవ్వరూ పట్టుకోరు. ఆ తుమ్మచెట్టు నుండి నిటారుగా ఉన్న కొమ్మను వేరుచేసి, దానికున్న ముళ్ళను తొలగించి, బెరడుని చెక్కివేసి నునుపుగా, అందంగా తెల్లగా ఉండేటట్టు తయారుచేసి ఒక తాతగారు దానిని ఊతముగా పట్టుకుని నడిచేందుకు వీలుగా తయారుచేసే ప్రక్రియకు 'సంస్కారము' అని పేరు. దానినే తయారుచేయుట, బాగుగా చేయుట అంటారు. బాగుగా చేయుట అనగా 'ఉపయుక్తము కావించుట'!

చదువు ఎందుకు చెప్పాలి అని ప్రశ్న వేస్తారు కొందరు. చదువు ఎందుకు చెప్పాలి అంటే 'సంస్కరించుట కొరకు' అని చెప్పాలి. కేవలము ధనార్జనకొరకు చదువు అన్నది మన భరతభూమిలో ఇదివరకు ఎక్కడా లేదు. విద్యార్థి బడిలో ఉంటేనే, కళాశాలలో ఉంటేనే, విశ్వవిద్యాలయములో ఉంటేనే చదువుకుంటున్నాడు అని అనుకోవడము తప్పు. చదువు అన్నది జీవితాంతము ఉంటుంది. చదువు అన్న మాటకు అర్థము 'గ్రహించుట! తెలుసుకొని చూచుట!' భగవంతుడు ఈ విశ్వములో ఉన్నదానిని తెలుసుకొని చూచుటకు మనకు జ్ఞానేంద్రియములను ప్రసాదించాడు. జ్ఞానేంద్రియములు : చెవి, ముక్కు, నాలుక, కళ్ళు, చర్మము. ఇవి ఎప్పుడూ తెలుసుకుంటూనే, గ్రహిస్తూనే ఉంటాయి. కనుక అది చదువు! అందుకే ఎప్పుడూ కూడా తెలుసుకునే ప్రక్రియ ఎంత కాలము జరుగుతుంది అంటే శరీరములో ప్రాణమున్నంత వరకు జరుగుతుంటుంది. అసలు దేనినైనా ఎందుకు తెలుసుకోవాలి? అన్న ప్రశ్నకు జవాబు 'మనలను మనము సంస్కరించుకునేందుకు తెలుసుకోవాలి, చదువుకోవాలి'. ఇది అనుక్షణం సాగే ప్రక్రియ. అంతేతప్ప ఒక ప్రత్యేకమైన ప్రాంగణములో ఉంటేనే చదువుకోవటము అవ్వదు. ఆ ప్రాంగణములో ఉంటే చదువుకుంటున్నట్లు, ఆ ప్రాంగణమును విడిచిపెట్టేస్తే చదువు అయిపోయినట్లు కాదు.

సంస్కారము వలన ప్రధాన ప్రయోజనము ఏమిటి? 'పది మందికి పనికొచ్చేటట్లుగా తయారుచేయుట'. ఈ క్రమములో విద్యార్థికైతే కేవలము చదువు చెప్పటము ఒక్కటే జరుగదు. ఏదో పాఠము చెప్పటము మాత్రమే జరుగదు. దానితోపాటు మనస్సు సంస్కరించబడుతుంది. పదిమందికి ఉపయోగపడే రీతిలో తీర్చిదిద్దబడతాడు. చదువు యొక్క అంతర్భాగముగా మూడు విషయములను ప్రతి వ్యక్తి తెలుసుకోవాలి. సమాజములో ఉన్నప్పుడు మూడురకములైన స్థాయిలు గల వ్యక్తులతో ఎలా మెలగాలి? కేవలము విద్యార్థిగా ఉన్నాడు అని కాదు. పాఠశాల ప్రాంగణములో ఉన్నాడు అని కాదు. జీవితాంతం మనము ఆ మూడు విషయములనుండి విముఖులమవ్వరాదు. ఆ మూడు విషయములలో మనము పరాకుగా ఉండరాదు. త్రికరణ శుద్ధిగా ఆ మూడింటిని పాటించటములో మన

**ఎంత కష్టం వచ్చినా తట్టుకోగల మానసిక ధృడత్వం పెంచుకోవాలి**

ప్రవర్తనలో తేడా రావటము లేదుగదా అని మనలను మనము నిరంతరము పరిశీలించుకుంటూ ఉండాలి. మనలను మనము పరిశీలించుకొని ఎప్పటికప్పుడు సంకల్పించిన భావనలో దృఢముగా నిలబడే ప్రయత్నము చెయ్యటమునే 'సంస్కారము' అంటారు. మనిషిని ఎప్పుడూ పట్టి పీడించే అనారోగ్యము ఏమిటంటే 'అహంకారము'. 'నా అంత వారు లేరు' అన్న భావన. ఈ భావన చిన్నపిల్లల నుండి పరమ ముదుసలుల వరకు ఉంటుంది. ఆ అహంకార భావన ఉన్నప్పుడు సమాజములో మూడురకములైన వ్యక్తులతో మనము సమన్వయము చూసుకోవాలి.

1) మనకన్నా అధికులైనవారు, 2) మనతో సమానమైన వారు, 3) మనకన్నా తక్కువస్థాయివారు. ఎక్కడున్నా ఈ మూడు రకములే కనబడతాయి. వీరితో మనము సమన్వయము అవ్వడములో, ప్రవర్తించడములో జీవితాంతం మనలను మూడు రకములైన పీడలు పట్టి బాధిస్తుంటాయి.

ఒక్కొక్కసారి మనకన్నా పెద్దవారిని చూస్తే మనస్సులో ప్రయత్నరహితముగానే అసూయ చెలరేగుతుంది. మనకన్నా బాగా చదువుకున్న వ్యక్తి కనిపించాడనుకోండి. 'అబ్బా! మహానుభావుడు ఎంత బాగా ఉన్నత విద్యలను అభ్యసించాడో!' అని అభినందించడము చాలా కష్టము. 'ఆ......ఆయన చదువా! ఆయన ఒకచోట ఒక మాట మార్చి ఏదో వ్రాశాడు, కనుక విజయమును సాధించాడు' అని అంటారు. లేదా ఆయన ప్రసంగములో చెప్పిన పద్యములోని ఒక పాదమును పట్టుకుని దానిలోని తప్పును వేలెత్తి చూపిస్తారు. ఎందుకంటే 'ఈయన కన్నా ఆయన ఎక్కువ తెలివున్నవాడు, బాగా చదువుకున్నవాడు' అన్న విషయమును ఓర్చలేడు. దానినే 'అసూయ' అంటారు. పుట్ట లోపల పాము ఎలా పడుకుని ఉంటుందో మనిషి మనస్సులో అసూయ అలా ఉంటుంది. అవకాశము వచ్చినప్పుడల్లా అది పైకి లేచి బుస కొడుతుంటుంది. అసూయ ఉన్నవారు తనకన్నా అధికులను చూసి ఓర్వలేరు. అసూయతో, మాత్సర్యముతో ప్రవర్తిస్తారు. ఇది మొదటి రకము ఆలోచనాశైలి.

తమతో సమానుడు కనబడ్డాడనుకోండి. ఉదాసీనముగా ఉంటారు. 'అతనిలో అంతగా గౌరవించవలసిన అంశము ఏమున్నది? అతను నాతో సమానుడే' అన్న భావన తొంగి చూస్తూ ఉంటుంది సాధారణముగా. మీరు ఎంత దూరమైనా వెళ్ళండి, జీవితములో ఇది కనిపిస్తూనే ఉంటుంది. 'అతను 10వ తరగతే చదువుకున్నాడు. నేనూ 10వ తరగతే చదువుకున్నాను. ఏదో పదోన్నతి వలన అతను పై స్థాయికి వెళ్ళాడు కానీ, మా ఇద్దరి బేసిక్ ఒక్కటే.' సాటి ఉద్యోగి పట్ల ఇలా సాగుతాయి ఆలోచనలు. ఎక్కడో అక్కడ సమానత్వము చూస్తారు. అలా సమానత్వమును చూసి, 'మరి నేనెందుకు అంత గౌరవించాలి? ఆ అవసరము ఏమున్నది?' అని అనుకుంటారు.

శ్రీమద్రామాయణములో ఈ లక్షణము సుగ్రీవుడంతటి వాడిని పట్టి పీడిస్తుంది. 'నేనూ రాజ్యభ్రష్టుడినే. రాముడూ రాజ్యభ్రష్టుడే. శ్రీరాముని భార్యను రావణుడు ఎత్తుకెళ్ళి పోయాడు. నా భార్యను వాలి ఎత్తుకెళ్ళిపోయాడు. నేను అడవులు బట్టి తిరుగుతున్నాను. ఆయన అడవులు బట్టి తిరుగుతున్నాడు. నా ప్రక్కన హనుమ ఉన్నాడు. ఆయన ప్రక్కన లక్ష్మణుడు ఉన్నాడు. ఇద్దరము సమానమే. తేడా లేదు.' ఇలా ఆలోచిస్తూ ఒక చెట్టుకొమ్మ నరికి నేల మీద వేశాడు. 'దానిమీద నేను కూర్చుంటాను. నువ్వూ కూర్చో' అన్నాడు రాముడితో. రాముని గొప్పతనము సుగ్రీవునికి అర్థము కాలేదు. ఎందుకంటే మనిషి తనతో సమానమైనవాడిని లేదా తనకన్నా తక్కువవాడిని చూడటానికి ప్రయత్నిస్తాడు తప్ప, వెతికి వెతికి ఎదుటివారిలో ఉన్న గొప్ప గుణములను పట్టుకోవటములో మనిషి చాలా ఇబ్బందిపడతాడు. దానిని తట్టుకుని ఓర్చలేడు. అసూయ అనే ఆ గుణము మనిషిని పట్టి పీడిస్తుంటుంది. 'అతను నాతో సమానుడు! కనుక అతనిని పెద్ద లెక్కలోకి తీసుకోనక్కరలేదు!' ఇది రెండవరకమైన ఆలోచనా ధోరణి.

ఇక మూడవ రకము. తనకన్నా క్రిందివారు. ఎక్కడికి వెళ్ళండి మీకన్నా తక్కువవారే మీకు కనబడతారు. ఆఖరుకి ఇద్దరు యాచకులు కలుసుకున్నారనుకోండి. వారు ఒకరి దగ్గర చేయి చాచనిదే బ్రతకలేరు. వారిది అధమాధమ స్థాయి. వారుకూడా 'నా చేతిలో ఉన్న పాత్ర ఇత్తడిపాత్ర. నీ చేతిలో ఉన్న చిప్ప మట్టిచిప్ప' అని పోల్చుకుంటారు. ఎందుకంటే మనిషి తనకంటే ఎదుటివారు తక్కువస్థాయిలో ఉన్నారు అని చెప్పటానికి ఏదో ఒకరకముగా ప్రయత్నిస్తాడు. ఎదుటి వ్యక్తి

**చేసిన తప్పులను ఒప్పుకోవడంలోనే గెలుపు ఉంటుంది**

తనకన్నా క్రిందివాడు అని అనిపించిందనుకోండి, ఉత్తర క్షణములో అహంకారము పెరిగిపోతుంది. 'నువ్వు నేను చెప్పిన మాట వినాలా? వద్దా?' అని గద్దిస్తాడు.' నాకన్నా తక్కువవాడు, నేను చెప్పినట్లు వినాలా? వద్దా?' అని సంకుచితముగా ఆలోచన సాగిస్తాడు మనిషి. ఇది జీవితములోని అన్ని విషయములకు వర్తిస్తుంది. ఇది మనిషిని ఎంత దూరమైనా తీసుకెళ్తుంది. ఉదాహరణకు మైదానములో క్రీడాకారులు ఆటలాడుతున్నారనుకోండి. అందులో ఒకడు 'నేను బలవంతుడిని! నేనే బాగా పరిగెడతాను! వాడేం పరిగెడతాడు?' అని తోటి క్రీడాకారుడి గురించి ఆలోచిస్తాడు, వీలైతే ఎగతాళి చేస్తాడు.

శంకరాచార్యుల శిష్యులలో కూడా ఇది కనిపిస్తుంది. ఆయన శిష్యులంటే మాటలు కాదు. శ్రీశంకరులు నడుస్తూ ఉంటే ఆయనతోపాటు 150 కి.మీ. ల దూరము వరకు జనము నడుస్తుండేవారట. అంతటి మహానుభావుడి దగ్గర స్వయముగా పాఠము నేర్చుకున్నవారు నలుగురే. 1. పద్మపాదాచార్యులవారు 2. సురేశ్వరాచార్యులవారు 3. హస్తామలకాచార్యులవారు 4. తోటకాచార్యులవారు. వీరిలో తోటకాచార్యుల వారిది కొంచం మందబుద్ధి. అంతబాగా పాఠము వెంటనే అర్థమయ్యేదికాదు. పద్మపాదాచార్యులవారు చాలా సునిశితమైన ప్రజ్ఞ కలిగినవారు. ఒకరోజున తోటకాచార్యుల వారు గురువు గారి బట్టలు ఉతికి ఆరేస్తున్నారు. బోధనాసమయము మించి పోతున్నా శ్రీశంకరులు తమ శిష్యులకు పాఠము చెప్పకుండా 'తోటకాచార్యులు ఇంకా రాలేదేమిటా?' అని అతని కోసం ఎదురుచూస్తున్నారు. ఇది గమనిస్తున్న పద్మపాదాచార్యులవారు 'వాడి మొహం, వాడు ఇక్కడికి వచ్చినా వాడికి విద్య ఏమొస్తుంది. ఆనక వచ్చాక మేము చెబితే నేర్చుకుంటాడు. మీరు పాఠము మొదలుపెట్టండి' అని అన్నాడు శంకరులతో. 'ఓహో! పద్మపాదుడికి ఇంత అహంకారము వచ్చిందా!' అని మనస్సులో అనుకుని, తన బట్టలు ఉతికి ఆరేసి గబగబా వస్తున్న తోటకాచార్యులవారి వంక అనుగ్రహముతో వీక్షించారు. తక్షణమే తోటకులవారిలో భక్తి పెల్లుబికి 'తోటకాష్టకము'ను ఆశువుగా చెప్పాడు. ఆ తోటకాష్టకమునే వల్లిస్తూ మనము ఇప్పటికీ శంకరాచార్యులవారికి నమస్కారము చేస్తాము.

మీరు ఎంత గొప్ప మహాత్ముడి దగ్గర కూర్చుని ఉన్నా 'మీరు జీవితములో ఎంత చదువుకున్నారు' అని పట్టించుకోకుండా, ఎంత పెద్ద పదవిలో ఉన్నా, ఎంత గొప్ప చదువు చదువుకున్నా, ఏ పనిచేస్తున్నా పైన చెప్పి మూడు విషయములను గమనించుకుంటూ ఉండవలసినదే. ఎందుకంటే అవి నిత్య జీవితములో మనిషిని పట్టి పీడిస్తుంటాయి.

'సంస్కారము' అన్న మాటకు ప్రధానమైన అర్థము – ఈ మూడింటిని సరిదిద్దుకోవడము. అలా సరిదిద్దుకుని సమాజమునకు పనికొచ్చేటట్లుగా తయారగుట. **సంస్కారము అన్న పదమునకున్న విస్తృతార్థములో ఒక కోణం గురించే ఇక్కడ చెప్పబడుతున్నది అన్న విషయమును కూడా గుర్తుంచుకోండి.**

1) తనకన్నా అధికులు, తనకన్నా గౌరవనీయులు, తనకన్నా పెద్దవారు కనబడితే గౌరవించగలగటము నేర్చుకోవాలి. అసూయ స్థానమునందు గౌరవమును ప్రతిష్ఠించాలి. మీకన్నా అధికులు కనబడితే 'ఆహా! ఆయన ఎంతటి మహానుభావుడు. ఎప్పుడు చదువుకున్నాడు ఇన్ని విషయములనుగురించి! ఎన్ని విషయములు జ్ఞాపకమున్నాయి! ఎంతటి జ్ఞాపకశక్తి! చదువుకున్నవాటిని ఎంత అద్భుతముగా చెప్పగలిగాడు! వాటిని ఒక వరుసక్రమములో అమరికలోకి ఎలా తీసుకురాగలిగాడు! పరీక్షలో అన్ని విషయములను అంత అందముగా ఎలా వ్రాయగలిగాడు? అన్ని మార్కులెలా సంపాదించాడు? ఎంత కఠోరపరిశ్రమ చేసి ఉంటాడోకదా! 'అందుచేత అతను నాకంటే చాలా గొప్పవాడు' అని మనస్ఫూర్తిగా, పరమసంతోషముతో, మంచి మనస్సుతో ఆలోచన చేస్తూ రెండు చేతులు జోడించి తలవంచి నమస్కరించడం అలవాటు చేసుకోవాలి. అలా చేసినప్పుడు బాహ్యముగా మీరు తల వంచినట్లుగా కనపడుతున్నారేమో కానీ ఆంతరమునందు అనగా మానసికంగా మీరు హిమాలయ పర్వతశిఖరముల అంత ఎత్తుకు ఎదిగిపోయినట్లే! మీ వల్ల సమాజమునకు విశేషమైన ఉపకారము జరుగుతుంది.

తనకన్నా పెద్దవారు కనబడినప్పుడు చిన్నవారు తల వంచి గౌరవప్రదముగా ప్రవర్తించినప్పుడు వారిని చూసి పెద్దలు సంతోషపడతారు. ఇలాంటి గుణములున్న వ్యక్తుల వలన సమాజము అభ్యుదయము చెందుతుంది. తాను వినయముతో అలా వంగి ఉన్నాడు కనుక పెద్దలైనవారు సంతోషిస్తారు. అతనికి ఇంకొక నాలుగు మంచి విషయములను చెప్పాలని సంకల్పిస్తారు. ఇది అభ్యున్నతికి హేతువుగా నిలుస్తుంది.

**నిజం చెప్పాలంటే చాలా ధైర్యం కావాలి**

వర్తమాన పరిస్థితులలో పదముల అర్థములు మారిపోయాయి. 'ఉపాధ్యాయుడు-విద్యార్థి' ఈ పదములను వేదముల ప్రారంభకాలములో ఉపయోగించలేదు. ప్రారంభములో వేదములలో 'వినీతుడు-వినీయుడు' అని అన్నారు. 'వినీతుడు' అనగా 'వినయమును ఇచ్చువాడు!' 'వినీయుడు-అనగా వినయమును నేర్చుకొనేవాడు!' 'వినయము' అన్న మాటకు అర్థము ఏమిటంటే ప్రపంచములో గొప్పదైనది ఏది కనబడినా దాని ముందు తలవంచగలుగుట!' వినయమును అలా అభ్యసించగా అభ్యసించగా చివరకు తనకన్నా గొప్పది కానిదేదీ కనబడదు. అన్నీ తనకన్నా గొప్పవిగానే కనబడతాయి. దేన్ని చూసినా 'అబ్బ! ఎంత గొప్పదిరా!' అని అనిపిస్తుంది.

ఉదాహరణకు ఒక గులాబీపువ్వును చూస్తే 'ఆ పువ్వుకున్న తొడిమమీద చిన్న చిన్న ఆకుపచ్చటి ఆకులు ఉండి, దానిపైన అన్ని రేకులు ఎంత అందముగా అమర్చబడి ఉన్నాయి. నేను ఇలా దులిపినా అవి క్రిందపడకుండా తొడిమనే పట్టుకుని ఉన్నాయి' అనే అద్భుతము దానిలో కనిపిస్తుంది. అంతేకాదు 'నేను ఒక్క నిమిషము కదలకుండా ఉండలేను, అది జీవము ఉన్నంతవరకు అలాగే అమరి ఉన్నది. కనుక ఆ గులాబీపువ్వు నాకన్నా చాలా గొప్పది' అనే భావన మనస్సులో కదలాడుతుంది. లోకములో దేన్ని చూసినా అద్భుతముగాను, గొప్పగాను కనిపిస్తుంది. ప్రతిదానిముందు తలవంచగలిగిన స్థితి వస్తుంది.

'చదువు-విద్యాసముపార్జనము'నకు ముందు ఒక విషయమును నేర్చుకోవాలి. ఒక ప్రదేశములో పెద్ద మొత్తములో నీటిని నిలువచెయ్యాలి అని అనుకుందాము. అప్పుడు ఒక పెద్ద గోతిని త్రవ్వుతాము. 'నీరు పల్లమెరుగు! నిజము దేవుడెరుగు!' కనుక ఆ గోతిలోకి నీరు వచ్చి చేరుతుంది. అంటే ఒకచోట నీరు నిలబడాలి అని సంకల్పిస్తే పల్లమును ఏర్పరచాలి తప్ప ఎత్తు అయిన ప్రదేశము ఉండరాదు. ఎక్కడ పల్లము ఉంటుందో అక్కడకు నీరు చేరుతుంది.

'వినయము' అన్న మాటకు అర్థము 'పల్లమగుట అనగా తలదించుట!' అసలు తన తలదించినవాడికి తప్ప గురువు చదువు చెప్పడు. ఆ వ్యక్తి సంస్కరింపబడదు. సంస్కారము నేర్పబడదు. కనుక విద్యను అభ్యసించే ముందు వినయముగా ఉండుట అభ్యసించాలి, తద్వారా పాత్రత చేకూరుతుంది. పాత్రత ఉన్నవారికే గురువు విద్యను బోధిస్తాడు.

మనతో సమానులు కనిపించినప్పుడు వారిపట్ల సద్భావనతో, సహృదయముతో ప్రవర్తిస్తూ వారిని మనతో సమానముగా చూడాలి. ఉదాహరణకు ఒక విద్యార్థికి పరీక్షలలో మంచి మార్కులు వచ్చాయనుకుందాము. మరో విద్యార్థికి కూడా అన్ని మార్కులే వచ్చాయనుకుందాము. అంటే ఇద్దరూ సమానముగానే శ్రమించి పరీక్షకు హాజరయినట్లే కదా! అందుచేత ఇద్దరూ ఒకరిపట్ల మరొకరు అసూయతో రగిలిపోకూడదు. తోటి విద్యార్థి కూడా తన వలెనే శ్రమించాడు అన్న విషయమును గ్రహించి ఇద్దరూ పరస్పరము స్నేహముతో ప్రవర్తించాలి.

అలాగే మనకన్నా చిన్నవారు, తక్కువస్థాయివారు కనిపించినప్పుడు వారిపట్ల ఔదార్యముతో ప్రవర్తించాలి తప్ప కించపరచేవిధముగా చూడరాదు. ఉదా : ఇంటి యజమాని ఇంటికి పెద్ద. భార్య తరువాతి స్థానమును ఆక్రమిస్తుంది. సంతానము ఆ తరువాతి స్థానములో నిలుస్తారు. కనుక ప్రకృతిలో ఎప్పుడూ చిన్నవారు ఉంటూనే ఉంటారు. అలా ఉన్నారని మనము అహంకరించరాదు. చిన్నచూపు చూడరాదు. ఇది నిత్యజీవితములో అనుక్షణము గుర్తుపెట్టుకోవలసిన ముఖ్యమైన విషయము.

**మనకన్నా పెద్దవారిని, గొప్పవారిని, ఉన్నతులను చూసినప్పుడు వారిని గౌరవించాలి.**

**మనతో సమానులు కనిపించినప్పుడు సమానస్థాయిని వారికి ఇవ్వాలి.**

**మనకన్నా చిన్నవారు కనిపించినప్పుడు ఆదరించి ఔదార్యము చూపించాలి.**

ఈ మూడు ముఖ్యవిషయములను అనుక్షణము అభ్యసిస్తూ మనలను మనము సంస్కరించుకోవాలి. సమాజమునకు, దేశమునకు ఉపయోగపడేవిధముగా మనలను మనము తీర్చిదిద్దుకోవాలి. ఆ క్రమములో మనలో జరిగే మార్పే సంస్కారముగా వ్యక్తమై మనలను సమున్నతముగా నిలబెడుతుంది.

*(బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుగారి ప్రవచనము నుండి)*

- శ్రీమతి లక్ష్మీరాజగోపాలు

**తప్పు అంగీకరిస్తే అది శత్రువులను కూడా మిత్రులుగా మారుస్తుంది**



శ్రీరామనవమి ప్రత్యేకం

# గాయత్రీ రామాయణం

వాల్మీకి రామాయణానికి మూలాధారం గాయత్రీ మంత్రము. గాయత్రీ మంత్రానికి వ్యాఖ్యగా ఈ మహాగ్రంథ రచన జరిగింది.

వాల్మీకి రామాయణంలో 24000 శ్లోకాలు ఉన్నాయి. ఒక్కొక్క అక్షరానికి వ్యాఖ్యగా వెయ్యి వెయ్యి శ్లోకాలతో ఈ గ్రంథ రచన జరిగింది. ఒక్కొక్క వెయ్యి శ్లోకాల ముందు ఒక్కొక్క గాయత్రీ మంత్ర అక్షరం సంపుటం చేయబడింది.

ఈనాడు లభ్యమయ్యే వాల్మీకి రామాయణంలో శ్లోకముల సంఖ్య సమానంగా ఉండటం లేదు, వాటిలో చాలా తేడాలు చూడవచ్చు. జరిగిపోయిన అంధకార యుగంలో, యవనుల కాలంలో చాలా శ్లోకాలు నష్టమైపోయాయని తెలుస్తుంది. ఇతర గ్రంథాలవలెనే కొన్ని శ్లోకాలు తీసివేయడం, కొన్నింటిని కలపడం కూడా జరిగి ఉండవచ్చు. రామచంద్రుడు మాంసం తిన్నాడని వ్రాయడం కూడా ఇటువంటి ప్రయోగమే. దీనిని నమ్మడానికి వీలు లేదు.

ఈ విధమైన గడబిడలో శ్లోకాల సంఖ్య కూడా తప్పిపోయింది. వాల్మీకి మహర్షి వెయ్యి శ్లోకాల తరువాత గాయత్రీ మంత్రంలోని ఒక అక్షరాన్ని సంపుటీకరణ చేసి ఇచ్చాడు. కానీ మనకు లభ్యమయ్యే పుస్తకములు సవ్యంగా లేవు. లెక్కవేసి చూసితే అక్కడ అక్కడ 4-5 శ్లోకాలు ఎత్తి వేయబడి ఉన్నట్లు కనిపిస్తుంది. కొన్ని చోట్ల కొన్ని వందల శ్లోకాల తేడా కనిపిస్తుంది.

ఇంత జరిగినప్పటికి ప్రతి వెయ్యి శ్లోకాల పైన గాయత్రీ మంత్రాక్షరం ఉండటం ఆకస్మికం అనలేము ఎందుకంటే ఏ ఇతర మంత్రానికి ఇటువంటి సంపుటి ప్రాప్తించలేదు. తెలియకుండా ఇలాంటి సంపుటితో తయారు కావు. వాల్మీకి మహర్షి దీనిని బాగా అర్థం చేసుకునే వ్రాశాడు.

ఈ గాయత్రీ సంపుటానికి ఎన్ని రహస్యాలు, కారణాలు ఉన్నాయో తెలియదు. ఈనాడు అవి అన్నీ తెలుసుకోవడం కష్టం కానీ ఆ సంపుటనలు చేసిన శ్లోకాలను పరిశీలిస్తే అవి చాలా మహత్వపూర్ణమైనవని తెలుస్తుంది. వాటిలో చాలా వరకు ఘటనాత్మకమైనవి, ప్రతి పాత్రను, సంభాషణను వివరిస్తూ రచించపడిన శ్లోకాలను బాగా లోతుగా పరిశీలిస్తే ఎంతో మహత్వపూర్ణమైన విద్యను సంకేత రూపంలో నేర్పే ప్రయత్నం కనిపిస్తుంది. ఈ విద్యను సక్రమ పద్ధతిలో నేర్చుకుంటే మానవ జీవితం అసాధారణమైన విశేషాలతో పరిపూర్ణమవుతుంది.

గాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలతో ప్రారంభమయ్యే 24 శ్లోకాలను గాయత్రీ రామాయణం అంటారు. ఈ శ్లోకాల సంక్షిప్త రూపాన్ని, దానిలో దాగి ఉన్న మర్మాన్ని అర్థం చేసుకుని, హృదయాంగమం చేసుకున్న మనుష్యుడు సంపూర్ణ రామాయణ లాభాన్ని పొందగలరు. గాయత్రీ మంత్రం యొక్క 24 అక్షరాలతో ప్రారంభమయ్యే శ్లోకాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ 24 శ్లోకాలను నిత్య పారాయణ చేయుట మంచిది.

**1. తపః స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్ ।**
**నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్ముని పుంగవమ్ ॥**

*(బాలకాండ 1/1)*

భావము: తపస్సు, స్వాధ్యాయము చేసే సర్వ మునులలో ప్రథముడైన నారదుని, తపస్వి వాల్మీకి ఇలా అడిగాడు.

**2. సః హత్వా రాక్షసాన్ సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునందనః ।**
**ఋషిభిః పూజితస్తత్ర యథేంద్రో విజయేపురా ॥**

*(బాలకాండ 30/24)*

భావము: యజ్ఞనాశకులైన రాక్షసులందరినీ రామచంద్రుడు వధించాడు. అసుర విజయం కోసం ఇంద్రుని పూజించిన విధంగా, రాముని మునులు పూజించారు.

**3. విశ్వామిత్రః సరామస్తు శ్రుత్వా జనక భాషితమ్ ।**
**వత్స రామ ధనుః పశ్య ఇతి రాఘవమబ్రవీత్ ॥**

*(బాలకాండ 68/12)*

భావము: రామునితోపాటు విశ్వామిత్రుడు కూడా జనకుని మాటలు విన్నాడు. ఆయన రామునితో - వత్సా రామా! ధనుస్సుని చూడు అన్నాడు.

**తాము టి.వి. చూస్తూ పిల్లలను వేరే గదిలో కూర్చుని చదువుకోమంటే అది సాధ్యం కాదు**

**4. తుష్టావాస్య తథా వంశం ప్రవిశ్య స విశాంపతేః ।
శతనీయం నరేంద్రస్య తదాసాద్య వ్యతిష్ఠత ॥**

*(అయోధ్యకాండ 15/19)*

భావము: రాజుగారి శయనాగారం వరకు సుమంతుడు నడచి వెళ్ళాడు. అక్కడ వారి వంశాన్ని ప్రశంసించాడు.

**5. వనవాసం హి సంఖ్యాయ వాసాంస్యా భరణాని చ ।
భర్తారమను గచ్ఛన్త్యై సీతాయై శ్వశురో దదౌ ॥**

*(అయోధ్యకాండ 40/14)*

భావము: వనవాసం చేసే దినాలను లెక్కించుకొని పతితో వెళ్ళే సీతకు దశరథుడు వస్త్రములను, ఆభరణములను ఇచ్చెను.

**6. రాజా సత్యం చ ధర్మశ్చ రాజా కులవతాం కులమ్ ।
రాజా మాతా-పితా చైవ రాజా హితకరో నృణామ్ ॥**

*(అయోధ్యకాండ 67/34)*

భావము: రాజు సత్యం మాట్లాడేవాడు, ధర్మం చేసేవాడు, కులీనుడు, తల్లిదండ్రులతో సమానుడు మరియు మనుష్యులకు హితకారి.

**7. నిరీక్ష్య స ముహూర్తం తు దదర్శ భరతో గురుమ్ ।
ఉటజే రామమాసీనం జటామండలధారిణం ॥**

*(అయోధ్యకాండ 99/25)*

భావము: భరతుడు ఆ క్షణంలోనే జటాధారియగు రాముని, ఆ కుటీరంలో కూర్చుని ఉండగా చూశాడు.

**8. యది బుద్ధిః కృతా ద్రష్టుమగస్త్యం తం మహామునిమ్ ।
అద్యైవ గమనే బుద్ధిం రోచయస్వ మహామతే ॥**

*(అరణ్యకాండ 11/43)*

భావము: ఓ బుద్ధిమతీ! నీకు అగస్త్యుని దర్శించాలి అనే కోరిక ఉంటే, ఈ రోజే వెళ్ళు.

**9. భరతస్యార్యపుత్రస్య శ్వశ్రూణాం మమ చ ప్రభో ।
మృగరూపమిదం దివ్యం విస్మయం జనయిష్యతి ॥**

*(అరణ్యకాండ 43/18)*

భావము: భరతునికి, మీకు, నా అత్తగార్లకు దివ్యమృగ రూపంలో ఉన్న బొమ్మ విస్మయం కలుగజేస్తుంది. దానిని సజీవంగా పట్టుకొనలేకపోయినా, ఏదో విధంగా సంపాదించండి. దాని చర్మము చాలా సుందరమైనది.

**10. గచ్ఛ శీఘ్రమితో వీర సుగ్రీవం చ మహాబలమ్ ।
వయస్యం తం కురు క్షిప్రమితో గత్వాద్య రాఘవ ॥**

*(అరణ్యకాండ 72/17)*

భావము: ఓ రాఘువా! నీవు ఇక్కడ నుంచి వెంటనే సుగ్రీవుని వద్దకు వెళ్ళి త్వరగా అతనిని మిత్రునిగా చేసుకో.

**11. దేశకాలౌ భజస్వాద్య క్షీయమాణః ప్రియాప్రియే
సుఖ-దుఃఖ సహః కాలే సుగ్రీవవశగో భవ**

*(కిష్కింధకాండ 22/20)*

భావము: దేశాన్ని, కాలాన్ని అర్థం చేసుకో. ప్రియ అప్రియాలను, సుఖ దుఃఖాలను భరించి సుగ్రీవుని అధీనంలో ఉండు.

**12. వందితవ్యాస్తతః సిద్ధాస్తపసా వీతకల్మషాః ।
ప్రష్టవ్యా చాపి సీతాయాః ప్రవృత్తిర్వినయాన్వితైః ॥**

*(కిష్కింధకాండ 43/31)*

భావము: నిష్పాపులకు, సిద్ధులకు, తపస్వులకు నమస్కరించి, వారిని వినయ పూర్వకంగా సీతను గురించి అడగాలి.

**13. స నిర్జిత్య పురీం లంకాం శ్రేష్ఠాం తాం కామరూపిణీం।
విక్రమేణ మహాతేజా హనుమాన్ కపిసత్తమః ॥**

*(సుందరాకాండ 4/1)*

భావము: కపికుల శ్రేష్ఠుడు, మహాతేజస్వియైన హనుమంతుడు పరాక్రమంతో కామరూపియగు లంకను ఓడించాడు.

**14. ధన్యా దేవాః సగంధర్వాః సిద్ధాశ్చ యే పరమర్షయః ।
మమ పశ్యంతి యే వీరం రామం రాజీవలోచనమ్ ॥**

*(సుందరకాండ 26/39)*

భావము: నా రాజీవలోచనసుడైన రాముని చూడగలిగి నందుకు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, ఋషిగణాలు ధన్యులు.

**15. మంగళాభిముఖీ తస్య సా తదాసీన మహాకపేః ।
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్ ॥**

*(సుందరకాండ 53/26)*

భావము: అప్పుడా సతీదేవి ఆ హనుమంతునకు శుభము చేకూర్చదలచినది. విశాలాక్షి అయిన సీత అగ్నిదేవుని స్తుతించింది.

**నిజాయితీగా బ్రతకడంలోనే ఉన్నతి ఉన్నది**

**16. హితం మహార్థం మృదుహేతుసంహితం**
**వ్యతీతకాలాయతి సంప్రతిక్షణమ్ ।**
**నిశమ్య యద్వాక్యముపస్థితజ్వరః**
**ప్రసంగవానుత్తరమేతదబ్రవీత్ ॥**

*(యుద్ధకాండ 10/27)*

భావము: మూడు కాలాలలో హితకారి, కోమలము, అర్థయుక్తమైన విభీషణుని వచనములు విని, రావణునికి చాలా క్రోధం కలిగి ఆయన ఇలా అన్నాడు.

**17. ధర్మాత్మా రాక్షసశ్రేష్ఠః సంప్రాప్తోయం విభీషణః ।**
**లంకైశ్వర్యమిదం శ్రీమాన్ధ్రువం ప్రాప్నోత్యకంటకం॥**

*(యుద్ధకాండ 41/68)*

భావము: రాక్షస శ్రేష్ఠుడు ధర్మాత్ముడైన విభీషణుడు వస్తున్నాడు. అతడు మాత్రమే శత్రువిహీనమైన లంకారాజ్యాన్ని ఉపయోగించుకోగలడు.

**18. యో వజ్రపాతాశనిసంనిపాతాన్న**
**చుక్షుభే నాపి చచాలా రాజా ।**
**స రామబాణాభిహతో**
**భృశార్తశ్చచాల చాపం చ ముమోచ వీరః ॥**

*(యుద్ధకాండ 59/139)*

భావము: వజ్రపాతం, అగ్ని ప్రహారంవంటి వాటివల్ల చలించని రావణుడు, రాముని బాణాలకు చాలా బాధపడి తను బాణాలు కురిపించాడు.

**19. యస్య విక్రమమాసాద్య రాక్షసా నిధనం గతాః ।**
**తం మన్యే రాఘవం వీరం నారాయణమనామయమ్॥**

*(యుద్ధకాండ 72/11)*

భావము: ఎవరి పరాక్రమం వల్ల రాక్షసులు చనిపోయారో అలాంటి నిష్కల్మష వీరుడు రాముడు ధన్యుడు.

**20. న తే దదృశిరే రామం దహన్తమపివాహినీమ్ ।**
**మోహితాః పరమాస్త్రేణ గంధర్వేణ మహాత్మనా ॥**

*(యుద్ధకాండ 93/26)*

భావము: మహాత్ముడగు రాముడు, దివ్య గంధర్వాస్త్రం ద్వారా రాక్షసులను మోహింపచేసాడు. అందువల్ల వారు సైన్యాన్ని నష్టం చేస్తున్న రాముని చూడలేకపోయారు.

**21. ప్రణమ్య దైవతేభ్యశ్చ బ్రాహ్మణేభ్యశ్చ మైథిలీ ।**
**బద్ధాంజలిపుటా చేదమువాచాగ్నిసమీపతః ॥**

*(యుద్ధకాండ 116/24)*

భావము: దేవతలకు, బ్రాహ్మణులకు సీత చేతులు జోడించి ప్రణామం చేసి అగ్ని వద్దకు వెళ్ళి చెప్పింది.

**22. చాలానాత్పర్వతస్యైవ గణా దేవస్య కంపితాః ।**
**చచాల పార్వతీ చాపి తదాశ్లిష్టా మహేశ్వరమ్ ॥**

*(ఉత్తరకాండ 16/26)*

భావము: పర్వతం చలించడం వల్ల శివగణాలు కూడా ఒణికిపోయినవి. పార్వతీదేవి కూడా శివుడిని ఆలింగనం చేసికొన్నది.

**23. దారాః పుత్రాః పురం రాష్ట్రం భోగాచ్ఛాదనభోజనమ్ ।**
**సర్వమేవావిభక్తం నౌ భవిష్యతి హరీశ్వర ॥**

*(ఉత్తరకాండ 34/41)*

భావము: వానర రాజా! స్త్రీ, పుత్రులు, నగరము, రాష్ట్రము, భోగము, వస్త్రము, భోజనము మొదలైనవి మన అవిభక్త సంపత్తులవుతాయి.

**24. యామేవ రాత్రిం శత్రుఘ్నః పర్ణశాలాం సమావిశత్ ।**
**తామేవ రాత్రిం సీతాపి ప్రసూత దారకద్వయమ్ ॥**

*(ఉత్తరకాండ 66/1)*

భావము: ఏ రాత్రి శత్రుఘ్నుడు వాల్మీకి ఆశ్రమం యొక్క పర్ణశాలకు వెళ్ళాడో, ఆ రాత్రే సీత ఇద్దరు పుత్రులకు జన్మనిచ్చింది.

★★★

## స్వామి వివేకానంద

*ఒకసారి డబ్బులు తగ్గిన కారణంగా వివేకానందుడు రామకృష్ణ పరమహంస ఆశ్రమం యొక్క భూమిని అమ్మేందుకు సిద్ధపడ్డారు. అప్పుడు ఒక శిష్యుడు ఇలా అడిగారు–'స్వామీ! మీరిప్పుడు గురుస్మారకాన్ని అమ్మేస్తారా? అప్పుడు వివేకానందుడు 'మందిరాలను ప్రపంచము యొక్క మంచి కొరకు స్థాపిస్తారు. అవే ఏదైనా మంచిపనికి ఉపయోగపడితే అందులో నష్టం ఏముంటుంది?' అన్నాడు.*

*– అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**సాఫల్యం కంటే నీతి చాలా ఉన్నతమైనది**

మనం - మన ఆరోగ్యం

# జలమును ఉపయోగించుకోవాలి

మానవ శరీరములో సుమారు 70% జలము ఉంటే, మిగిలిన పదార్థములు 30% ఉంటాయి. అందుచేత జలం యొక్క ఆవశ్యకత ఇతర పదార్థములకన్నా ఎక్కువ ఉన్నదని స్పష్టమౌతున్నది. జలం తక్కువైనచో శరీరము ఎండి పోతున్నట్లుగా అవుతుంది, నరములు ముడుచుకుపోతాయి, ఎముకలు బయటకు పొడుచుకువస్తాయి, రక్తము చిక్కబడుతుంది. దప్పిక, వేడి పెరగటమువంటి పలు సమస్యలు తలెత్తుతాయి.

జలమే శరీరమును సవ్యముగా ఉంచుతుంది. ప్రతిరోజు 2-3 లీటర్ల నీటిని త్రాగితే జలతత్వమును సమత్వ స్థితిలో నిలుపుకుంటూ ఉండవచ్చు. స్వచ్ఛమైన నీటిలో ఉండే ఉపయోగ కరమైన రసాయనిక పదార్థముల వలన శరీరమునకు పోషణ లభిస్తుంది. శరీరము లోపలి అంగములలో ఉత్పన్నమైన వికృతులు, వికారములు, చెమట, మూత్రం మరియు ఇతర మలినములతోపాటు ద్రవరూపములో బయటకు వెళ్తాయి. వాన పడగానే మొక్కలు ప్రఫుల్లితమై చైతన్యముతో తొణికిస లాడుతాయి. నీరు లేనప్పుడు అవి కృశించి, ఎండిపోతాయి. శరీరమునకు సరిపడినంతగా నీరు లేనప్పుడు ఇదే పరిస్థితి దాపురిస్తుంది. సమపాళ్ళలో సరైన రీతిలో అంగ-ప్రత్యంగములకు నీరు సమకూరినప్పుడే శరీరము దృఢంగా, ఆరోగ్యవంతంగా మెరుస్తుంటుంది.

రోగనివారణలో జలము చాలా చాలా గొప్ప పాత్రను పోషిస్తుంది. ఉదాహరణకు స్నానమునే తీసుకోండి. ఆరోగ్యమును కాపాడుటలో అది అనుపమానమైన సహాయమును అందిస్తుంది. హిందూధర్మములో ప్రతి శుభకార్యమును 'మంగళస్నానం' చేసి శ్రీకారము చుట్టడం అనే సంప్రదాయం ఉన్నది. తీర్థ స్నానం, మాఘస్నానం, వైశాఖస్నానం, కార్తీకస్నానం, పర్వస్నానం మున్నగు నానా విధములైన రీతిరివాజులను ఆలంబనగా చేసుకుని ధార్మికకర్మకాండలతో పాటు స్నానం యొక్క లాభము అందేలా ఏర్పాటుచేశారు మన పూర్వీకులు. భారతీయులు స్నానమును నిత్యకృత్యముగా భావిస్తారు. స్నానం చెయ్యకుండా హిందువులు భోజనము చెయ్యరు. దినచర్యలో ప్రాతఃకాలము ఆచరించే కాలకృత్యముల తరువాతి స్థానం స్నానముదే. భోజనం చెయ్యకుండా ఉండవచ్చును. కానీ స్నానం చెయ్యకుండా ఉండలేము. హిందూ ధర్మం-ఒక వైజ్ఞానికధర్మం! మనస్సు శరీరములు ఆరోగ్యముతో తొణికిసలాడేందుకు ఉపయోగపడే ఆవశ్యకమైన ఆచార-వ్యవహారములకే హిందూ ధర్మంలో స్థానము కల్పించబడింది.

'అద్భిర్గాత్రాణిశుద్ధ్యన్తి' అనగా జలముతో శారీరిక శుద్ధి జరుగుతుంది అని హిందూధర్మశాస్త్రములు అత్యంత ప్రాచీన కాలమునుండి వక్కాణిస్తున్నాయి. శరీరములో ప్రోదిచెంది ఉన్న వికారములు, మలినములు తొలగించబడి, శరీరము స్వచ్ఛముగా అయ్యేలాగా జలమును ఉపయోగించెదరు గాక!! అయితే ఈ శాస్త్రవచనముల మీద ప్రజలు అంతగా దృష్టిని సారించటము లేదు. యూరప్‌వంటి శీతల ప్రదేశములలో చలి వలన అచటి ప్రజలు నిత్యం స్నానము చేయరు. అది అక్కడ అంత ప్రాచుర్యములో లేదు. వారికి స్నానం అంత ప్రధానమైన విషయము కాదు. ఇప్పుడక్కడ శాస్త్రవేత్తలు ప్రతి విషయమును కొంగ్రొత్త కోణములో, వైజ్ఞానిక దృష్టితో పరీక్షిస్తున్నారు. ఈ క్రమములోనే స్నానం యొక్క మహత్యము వారి దృష్టిలోకి వచ్చింది. స్నానము చేస్తే వచ్చే లాభములను చూసి వారు అవాక్కయ్యారు. ఇక ఇప్పుడు అనేకమంది పండితులు 'స్నానము-జీవితానికి మూలము, సంజీవని' వంటిది అని వక్కాణిస్తున్నారు. దాని ఆధారముగానే జలచికిత్సా పద్ధతిని ఆవిష్కరించి 'స్నానము ద్వారా సంపూర్ణ రోగనివారణ చేయగలిగే విజ్ఞానము' అన్న అంశము మీద పెద్ద పెద్ద గ్రంథములను రచించారు. 'స్నానం ఆరోగ్యమునకు ఉపయోగకారి' అన్న విషయమును భారతీయులు నిర్వివాదముగా భావిస్తున్నారు. భారతదేశము-ఉష్ణదేశము! ఈ కారణముగా ఇక్కడివారికి స్నానం యొక్క ఉపయోగము ఇంకా ఎక్కువ. స్నానం యొక్క మహత్యమును వ్యావహారిక రూపములో స్వీకరించకుండా ఈ దేశములో ఏ మనిషి ఆరోగ్యవంతుడుగా మనలేడు.

'హరహరమహాదేవ్-గంగా' అని ఉచ్చరిస్తూ ఏవో రెండు చెంబుల నీటిని నెత్తిన గుమ్మరించుకుని స్నానం అయ్యిందని

**అవినీతి మార్గంలో నడవాలనుకోవడం చాలా పెద్ద తప్పు**

భావించరాదు. దీనిని కాకిస్నానం అని చెబుతారు. దాని ఉపయోగం శూన్యం. ఇలా చేయటం స్నానమును ఎగతాళి చేయటమే అవుతుంది. పనిచేయుట వలన వచ్చిన బడలికను వదిలించుకునేందుకు రెండు చెంబులతో శరీరాన్ని తడుపుకుని స్నానము చేశాము అని అనిపించుకునేందుకు కాక, శరీరము పైన ఉన్న మురికి పోయేందుకు మరియు దేహమునకు పోషణ సమకూరేందుకు స్నానమాచరించాలి. నది, బావి, కాలువ, సెలయేరులలో ప్రవహించే స్వచ్ఛమైన నీరు స్నానం చేయుటకు చాలా ఉత్తమమైనది. అలాగే మనుష్యులు, పశువులు పాడుచెయ్యని, హానికరమైన పదార్థములు లేని స్వచ్ఛమైన చెరువు నీళ్ళు కూడా స్నానమునకు మేలైనవే! ప్రవహించే స్వచ్ఛమైన నీటిలో ఉండే గొప్ప తత్వములు నిల్వ ఉన్న నీటిలో ఉండవు. జబ్బుపడిన ప్రత్యేక పరిస్థితులను మినహాయించి, సాధారణంగా అందరు శరీరరము సహించ గలిగే గోరువెచ్చని నీటిలో జలకాలాడటమే మంచిది. అన్ని ఋతువులలోను ఇలాంటి నీటితో స్నానము చేయటమే ఉత్తమము. చాలామంది చలికాలములో వేడినీటితో స్నానం చేస్తారు. అదంత మంచిది కాదు. అవసరమైనచో కాసేపు నీటిని ఎండలోపెట్టి కాస్త వేడెక్కాక స్నానము చేయుట శ్రేయస్కరము. వేడినీటిని తలమీద పోసుకుంటే కళ్ళకు హాని జరుగుతుంది. అలాగే బలమైన చల్లని గాలులు వీస్తున్నప్పుడు స్నానం చెయ్యటము మంచిది కాదు. ఎక్కువ గాలి వీచని స్థలమే స్నానము చేయటానికి యోగ్యమైనది. ఏ ఋతువులలో అయినాసరే చల్లనిశరీరమును బలమైన గాలులు స్పృశిస్తే అనారోగ్యము పెచ్చరిల్లుతుంది. అన్ని ఋతువులలోను ఇది అనారోగ్య హేతువే!

స్నానం చేస్తున్నప్పుడు మందపాటి గరుకు గుడ్డతో చర్మం ఎఱ్ఱబడేలా నెమ్మదినెమ్మదిగా రుద్దుకుంటూ స్నానం చెయ్యాలి. ఈవిధముగా ఘర్షణ తీసుకువచ్చినప్పుడు శరీరము లోపల వేడి రగులుకొంటుంది. కుమ్మరివాడు ఇనుమును వేడిచేసి తిరిగి నీటిలో ముంచి దానిని సుదృఢముగా తయారు చేస్తాడు. అదే రీతిలో ఘర్షణ ద్వారా ఉష్ణోగ్రతను (వేడిని) పెంచి, చల్లని నీటితో స్నానము చేసినచో శరీరము బలముగా తయారవుతుంది. అంతేకాకుండా శరీరము లోపలి పొరలలో ఉన్న సూక్ష్మరంధ్రములు శుభ్రపడతాయి. చెమట చక్కగా వెలువరించబడుతుంది. చర్మము మీద పేరుకున్న మురికి వదిలిపోగానే దుర్గంధం, జిడ్డు, బద్ధకం మరియు ఉదాసీనత దూరమైపోతాయి. సామాన్యజనం తాము స్నానము చేస్తున్నప్పుడు వెన్నెముక ఎముకలు, వీపు, మెడ, భుజములు, తొడలు, మర్మేంద్రియములు మొదలైన అంగముల మీద పెద్దగా దృష్టి సారించరు. అది సరైనది కాదు. ప్రతి అంగము మీద పూర్తి శ్రద్ధ చూపించాలి. తొందర తొందరగా స్నానము చేయరాదు. ప్రసన్న మనస్సుతో నెమ్మదినెమ్మదిగా ప్రతి అవయవమును బాగా రుద్దుకుని స్నానము చేయాలి. స్నానం చేసిన తరువాత శరీరమునకు రక్షణ, సుఖము నిచ్చే శుభ్రమైన వస్త్రములను ధరించాలి. చలిరోజులలో ఒకపూట, ఇతర ఋతువులలో ఉదయము-సాయంత్రము రెండుసార్లు స్నానం చేయాలి.

శాస్త్రం నిర్ణయించిన విధముగా, సరైన రీతిలో స్నానం చేసే ఏర్పాటుచేసుకున్నచో శరీరము మీద రోగాలు దాడి చెయ్యకుండా గొప్ప రక్షణ లభిస్తుంది. పైన చెప్పినవిధముగా స్నానం చేస్తే కనుక చిన్నాచితక రోగాలు చెప్పాపెట్టకుండా వాటికవే కనుమరుగైపోతాయి. చిఱుజల్లుల క్రిందన ఆడుతూ పాడుతూ స్నానము చేస్తుంటే అది మనోరంజకముగాను, ఉల్లాస పూరితముగాను ఉంటుంది. శరీరమునకు చల్లగా హాయిగా ఉంటుంది. నదులలో, చెఱువులలో ఈతకొడుతూ స్నానము చేయడము అన్నివిధాలా శ్రేయస్కరం. రెండు, మూడు వానలు కురిశాక, ఆ తరువాత పడే వర్షములో తడుస్తూ స్నానము చేస్తే మనస్సు ఆనంద తరంగితమవుతుంది. శాస్త్రము అలాగ స్నానము చెయ్యమని నిర్దేశిస్తున్నది అని పెద్దలు చెప్తుంటారు. ఇంటి పైన చేరిన, అలాగే చూరులక్రింద నుండి జారే అపరిశుభ్రమైన నీటితో కాక, ఆకాశమునుండి నేరుగా మనమీద వర్షించే నీటితో స్నానము చేయటమే మేలైన పని. మైదానాలు, ఇంటి పైభాగాలు వర్షస్నానమునకు అనువైన ప్రదేశములు.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 10 (5.88) నుండి*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**యుగశక్తి గాయత్రి**

**మాస పత్రిక చదవండి !**

**చదివించండి !!**

**తప్పు చేస్తే ఎప్పటికైనా ప్రాయశ్చిత్తం చేసుకోవలసినదే**

# భవిష్యత్తులో ధర్మవిజ్ఞానముల సంగమం

'ధర్మము-విజ్ఞానము' ఇవి రెండూ ఒకటి లేకుండా మరొకటి అసంపూర్ణమైనవే అని సాపేక్షసిద్ధాంతమును ప్రతిపాదించిన ప్రముఖ శాస్త్రజ్ఞుడు ఐన్‌స్టీన్ చెప్పిన మాటలలో, 'ధర్మము-విజ్ఞానము'ల మహాసమన్వయం అనివార్యమైనదని స్పష్టమౌతున్నది. ధర్మము అంటే అంతర్జగత్తు యొక్క యాత్ర అనగా అంతర్‌యాత్ర. భగవంతుని ఎడల తీవ్రమైన నమ్మకం, శ్రద్ధ, విశ్వాసం. విజ్ఞానం అంటే భగవంతుని ద్వారా ఏర్పరచబడిన ఈ పదార్థ జగత్తు యొక్క అధ్యయనము, అన్వేషణ. సత్యమును అన్వేషించడమే రెండింటియొక్క ఉద్దేశ్యము, కానీ ఒకరు దీనిని ఆంతరికజగత్తులో అన్వేషిస్తే, మరొకరు భౌతిక జగత్తులో. సంపూర్ణమైన, సమగ్రమైన అన్వేషణ రెండింటియొక్క కలయికతో మాత్రమే సాధ్యమౌతుంది.

'ధర్మము-విజ్ఞానము' ఇవి రెండూ నాణెమునకు రెండు వైపుల వంటివి. బండికి ఉండే రెండు చక్రములవలె, పక్షికున్న రెండు రెక్కల లాంటివని కూడా చెప్పవచ్చు. ఒకటి లేనిదే రెండవదాని ఉనికి ఏవిధముగా వీలవుతుంది? ఏకపక్ష మార్గములో సాగుతున్న అన్వేషణయే ప్రస్తుతము మన కెదురుగా ఉన్న తీవ్ర సమస్య. దీని సారాంశము, పరిణామములవల్ల మానవ జాతి అశాంతికి లోనై ఉన్నది. 'ధర్మము-విజ్ఞానము' ఈ రెండింటికీ ఇప్పుడు తాము ఒకదానితో ఒకటి కలవటము మినహా వేరొక మార్గమేదీ లేదు అన్న విషయము అర్థమౌతున్నది. అందుచేత పదార్థమునే సర్వస్వంగా భావించే విజ్ఞానముకూడా ఈ వైపుకు అడుగు ముందుకు వేసింది. ఆధునిక విశ్వ విజ్ఞానమునకు చెందిన సమాధానము లేని, ముడి విప్పలేని కొన్ని సమస్యలు విజ్ఞానమును భగవంతునివైపు, ధర్మమువైపు మళ్ళించటానికి ప్రయత్నము చేశాయి. పదార్థ జగత్తును దాటి ఆవల అడుగుపెట్టనిదే, సత్యము యొక్క ఉనికిని తెలుసుకోలేము అనేది తథ్యము!



ప్రస్తుత కాలములో విజ్ఞానం కూడా ఈ విశ్వ బ్రహ్మాండను గురించి దీర్ఘమైన లోతైన పరిశోధనలే చేస్తున్నది. వాని సారాంశమును తనదైన భాషలో విశదీకరిస్తున్నది! దానిలో న్యూటన్ యొక్క గురుత్వాకర్షణ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ యొక్క సాపేక్షవాదం (theory of relativity) ప్రాకృతిక నియమాలుగా పేర్కొనబడినాయి. విజ్ఞానము సిద్ధాంతాలను, నియమాలను తయారుచేసి నిర్వచించడమేకాక వాటికి తగినంత ప్రాచుర్యమును, ఖ్యాతిని కూడా సముపార్జించి పెట్టింది. కానీ విషయము ఇక్కడితో సమాప్తము కాలేదు. ఎందుకంటే పదార్థము-ప్రకృతి ఇవి రెండూ వైజ్ఞానిక బుద్ధికి, మేధస్సుకు ఎప్పుడూ ఒక సవాలుగానే నిలబడతాయి, వీటి అవగాహన మన పరిధిని దాటి ఉంటాయి. ఆఖరుకు కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయపు భౌతికశాస్త్రవేత్త అయిన స్టీఫెన్‌హాకింగ్ కూడా స్వయముగా సందేహాస్పదుడుగా ప్రతీతి చెందాడు. ఏమైనప్పటికీ 'శూన్యము నుండి ఈ విశ్వము ఎలా ఉత్పత్తి అయింది' అన్న ప్రశ్నకు సమాధానమును ప్రాకృతిక నియమాలను అన్వేషించి తెలుసుకొనవచ్చు' అని ఆయన ప్రతిపాదించారు. లేవనెత్తిన ప్రశ్నలో, చేసిన ప్రతిపాదనలో ఎంత దృఢత్వము, సత్యము ఉన్నదో తెలుసుకొనవలె నంటే, ఆయన వ్రాసిన 'ఎబ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' అనే పుస్తకము చదవాలి. అందులో ఒకచోట ఆయన 'ఇక భగవంతునికి స్థానమెక్కడ' అని వ్రాస్తారు. ఈ పుస్తకము చదవటము వల్ల 'ప్రాకృతిక నియమాల ద్వారా భగవంతుని యొక్క ఈ సృష్టికి సంబంధించిన విజ్ఞానమును అర్థము చేసుకొనగలము, తెలుసుకోగలము' అన్న అంశము మీద ఆయనకే సంపూర్ణముగా విశ్వాసం లేదని అర్థమౌతుంది.

ఈ విషయమై ప్రకృతిపరమైన విజ్ఞానము, థియాలజీ (ఆధ్యాత్మిక) కి సంబంధించిన బర్కలేసెంటర్‌కు చెందిన భౌతిక శాస్త్రవేత్త 'హాకింగ్ ప్రతిపాదించిన బ్రహ్మాండీయ విజ్ఞానములో సమయము యొక్క పుట్టుక, అభివృద్ధి ఇవి రెండూ విశ్వ బ్రహ్మాండముతోపాటే ఒకేసారి జరిగినట్లు, వీనికి పృష్ఠభూమి 'క్వాంటమ్' అని అర్థమౌతున్నది' అంటాడు. క్వాంటమ్ (quantum) అంటే కణము శక్తిగాను, శక్తి కణముగాను నిరంతరం మార్పుకు లోనవుతువుండటమే అని తెలుస్తున్నది. ఈ శక్తికణరూపమైన క్వాంటమ్ ఆధారభూమిలో, సమయం గురించి ఖచ్చితమైన సమాచారమేదీ లేదు. సృష్టి నిర్మాణమును

**నీతిమార్గాన్ని వదలి మానవోచిత కార్యక్రమాలు చేయలేము**

గురించిన ఖచ్చితమైన సమయము కూడా తెలియదు. బహుశః అందుకేనేమో విజ్ఞానము ఏదో ఒక మహాశక్తిమీద విశ్వాసమును చూపించలేకపోతున్నది. అలాగని అవిశ్వాసమును కూడా కనబరచటం లేదు. ఎందుకంటే విజ్ఞానము యొక్క అవగాహన పరిధినిదాటి ఇలాంటివే మరెన్నో ప్రశ్నలున్నాయి కాబట్టి.

'బిగ్‌బ్యాంగ్' (big bang) కు ముందున్న పరిస్థితి ఏమిటి? దానిని చూసిన వారెవరు? ఈ విషయములో కాస్మాలజీ (విశ్వవిజ్ఞానము) మౌనంగా ఉన్నది. కానీ ఋగ్వేదములోని ఋక్కులు ఈ సంఘటనకు ద్రష్ట భగవంతుడు ఒక్కడే అని, ఆయన ఈ మహావిస్ఫోటనమునకు ముందే ఉన్నాడని చెప్తున్నాయి. 5వ శతాబ్దికి చెందిన క్రిస్టియన్ సాధువు అగస్టీన్ ఋగ్వేదము ఋక్కులు చెప్పిన ఈ సత్యమును అంగీకరించాడు. 'భగవంతుడే సమయమును ఏర్పరచినాడు. కానీ ఆయన ఈ సమయమనే చట్రములో ఇరుక్కొనలేదు, బంధింపబడలేదు. కాలమును ఏర్పాటుచేసిన మహాకాలుడు ఆయన! దిక్కులకు, కాలమునకు ఆవలనున్న పరమ సద్వస్తువు ఆయన!' అని అన్నాడు. భౌతిక శాస్త్రవేత్త రసెల్‌యొక్క అభిప్రాయములో కూడా ఈ సత్యమే సందేహాస్పదముగా ధ్వనించినది. ఈ విశ్వము యొక్క ప్రాదుర్భావముతోపాటే సమయముకూడా ఆరంభమైనదని ఆయన అభిప్రాయపడ్డాడు. కానీ ఈ మొత్తము ప్రక్రియలో భగవంతుని పాత్రకూడా ఉందని ఆయన అంగీకరించడం జరిగింది.

'హాకింగ్‌కు భగవంతునిపట్ల నమ్మకమున్నా, లేకపోయినా కలిగే ఇబ్బందేమీలేదు. ఆయన ద్వారా ప్రతిపాదించబడిన బ్రహ్మాండీయ సిద్ధాంతము భగవంతునిపట్ల నమ్మకమును వెల్లడిచేస్తూనే ఉన్నది' అని రసెల్ వివరించాడు. హాకింగ్ భగవంతుని ఉనికిపట్ల చేసిన ప్రతిపాదన బ్రహ్మాండీయ విజ్ఞానములోనేకాదు, యావత్ విజ్ఞానప్రపంచములోనే ఒక క్రొత్త విప్లవమును ఆవిష్కరించింది. దీనివలన విజ్ఞానము, ధర్మము ఒకదానితో ఒకటి కలవటానికి, కలిసి ముందుకు సాగటానికి ఒక క్రొత్త అవకాశం లభించగలదు.

నేటి తర్కపు ఆధునిక కాస్మాలజీలో కొన్ని ప్రత్యేకమైన సూత్రాలున్నాయి. వానిలో ఒక అంచు సమస్త విజ్ఞానము తన అధ్యయనములు, అన్వేషణలలో క్రియాశీలమైయుండగా మరియొక అంచు అసలు ఏమాత్రము తెలియని, ఎటువంటి జ్ఞానంలేని ఒక అజ్ఞాతదిశవైపు సూచిస్తున్నది. అందుచేత తెలిసినదానికన్నా తెలియనిదే అధికంగా ఉన్నది. ఈ ప్రకారంగా తెలియని, ఇంతకుముందు చూడని భాగమేదైతే ఉన్నదో దానికి మన ప్రాచీనఋషులు, విద్వాంసులు 'ధర్మము' అనే పేరు పెట్టారు. విజ్ఞానము ఇప్పటిదాకా దానిని చేరుకొనలేక పోయినది. కానీ సంకేతాలు లభిస్తూనే ఉన్నాయి. అందుచేతనే ససెక్స్ విశ్వ విద్యాలయమునకు చెందిన భౌతికశాస్త్రవిభాగ ఆచార్యులు 'జాన్‌వైరో' 'ఈనాటి వైజ్ఞానికులు ఆ కనిపించని, అదృశ్యరూపుడైన భగవంతుని రేఖామాత్రముగా దర్శించ గలుగుతున్నారు' అని వర్ణించాడు.

విప్లవాత్మకమైన, ఇంతకుముందెన్నడూ లేని ఈ మార్పును అంగీకరిస్తూ ఒక జర్మనీ శాస్త్రజ్ఞుడు నవీన కాలపు బ్రహ్మాండీయ విజ్ఞానమునంతటిని భగవంతునిపట్ల విశ్వాసము ప్రభావితము చేస్తున్నది. ఈనాటి భౌతికశాస్త్రవేత్తలు యావత్‌విశ్వమును 'థియరీ ఆఫ్ ఎవ్విరిథింగ్ (Theory of everything) ' అనే ఒకే ఒక్క సిద్ధాంతముతో తెలుసుకొనగలం, అర్థము చేసుకొన గలము, పరీక్షించగలము అని భావిస్తున్నారు. ఈ వాదన నిజమైనా, కాకపోయినా, దీనిద్వారా 'భగవంతుడనేవాడు ఒకడున్నాడు, ఆయనే ఈ జగత్తు అంతటికీ నియంత, నియంత్రణ కర్త కూడా' అనే విషయము అర్థమౌతున్నది. వేదాంతులు దీనిని 'ఏకేశ్వరీయ సిద్ధాంతము' అనగా 'భగవంతుడు ఒక్కడే' అనే సిద్ధాంతముగా ప్రతిపాదించారు.

'శాస్త్రజ్ఞులకు భగవంతునిపట్ల నమ్మకము' అనే విషయమై నేచర్ అనే పత్రిక, గతములో ఒక సర్వేను నిర్వహించినది. ఈ సర్వేదారా '39.3% మంది శాస్త్రవేత్తలు, తాము ఉపాసించిన, ఆరాధించగలిగే ఒక భగవంతునిపట్ల విశ్వాసము, నమ్మకము కలిగి ఉన్నట్లుగా వెల్లడైనది. జడప్రపంచమును అధ్యయనము చేసేవారు, బోధించేవారుకూడా ఈ జగత్తు కావలనున్నదానిని గురించి ఆలోచిస్తున్నారని పైన చెప్పిన లెక్కలద్వారా అర్థమౌతున్నది. క్రీ.శ. 2000 సంవత్సరములో అమెరికా దేశములో జరిగిన ఒక విజ్ఞానసదస్సులో కూడా 'ఈ విశ్వ విజ్ఞానములో భగవంతుని ఉనికికి ఎన్నో ఋజువులు లభిస్తున్నాయి' అనే అంశమునకు పుష్టి చేకూరినది. ఇలాంటి ఖండించలేని తర్కాలు, తథ్యాలు మరెన్నో ఉన్నాయి. వీనిని హృదయపూర్వకముగా అంగీకరించగలిగితే, భగవంతుని ఉనికి పట్ల ఎటువంటి భ్రమ ఉండదు.

పైన చెప్పిన సదస్సులో ఒక ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు తన మనోభావాలను వ్యక్తము చేస్తూ 'ఏదైనా ఒక విశిష్టమైన అర్థం, లక్ష్యం, మూల్యం లేదా తర్కం మొదలైనవాటికి విజ్ఞానపరంగా ఆధారములు లభించవు. అందుచేత ఈ దిశగా మనకు సహాయపడటానికి ధర్మం యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉన్నది' అని అన్నాడు. ప్రసిద్ధిగాంచిన ఖగోళశాస్త్రజ్ఞుడు ఎలెన్ శాండజ్ 'బ్రహ్మాండమునకు సంబంధించిన గతివిధులు (activity),

**అవినీతిని సహించడమంటే ఆకతాయిలను ప్రోత్సహించడమే**

సంఘటనలు ఎంతో జటిలమైనవి, దురూహ్యమైనవి. వాటికి సరియైన, సముచితమైన అర్థమును ఈనాటి విజ్ఞానము మనకు అందించలేకపోతున్నది. జీవితము-జగత్తు ఈ రెండింటికీ సంబంధించిన తీవ్రమైన రహస్యమునుకూడా ఛేదించలేక పోతున్నది. ఏదో ఒక మహాశక్తిని మాధ్యమముగా తీసుకొన గలిగితే వీటిని అర్థము చేసుకొని అనుభూతి చెందగలము. అంతేకాదు, ఆ మహాశక్తి యొక్క దయవలన లభించే శక్తితో తన లోపల, బాహ్యజగత్తును పరికించి చూడగలము' అని నొక్కి వక్కాణించాడు.

విజ్ఞానం మతం వైపు మరలడము అనే అంశముపై రసెల్ ఇలా అన్నాడు. 'విజ్ఞానము ఇప్పుడు విశ్వాస రూపమైన ధర్మమును నమ్ముతున్నది. ఇప్పుడది భగవంతుని ఉనికిని అనుమానాస్పదమైన దృక్కులతో చూడటము లేదు.' మొదట బిగ్‌బ్యాంగ్ థియరీ (big bang theory) లో భగవంతునికి ఎలాంటి స్థానం లేదు, కానీ ఇప్పుడు శాస్త్రజ్ఞులు విశ్వమునకు ఒక సునిశ్చితమైన లక్ష్యమున్నది కాబట్టి ఈ బృహత్కార్యములో భగవంతుని పాత్ర తప్పక ఉంటుంది' అని భావిస్తున్నారు.

శ్రీఅరవిందులు 'ఈ సృష్టి నిర్మాణమంతా భగవంతుని లీల. ఆయన తన లీలను వెల్లడించటానికై ఈ బ్రహ్మాండమును సృజించాడు' అని చెప్పారు. ఈ కథనమును తనదైన శైలిలో సమర్థిస్తూ, లేజర్‌కిరణములను కనిపెట్టిన ఛార్లెస్‌టౌన్ **'ఏదో ఒక గొప్ప కళాకారుని సృష్టి లేకుండా ఇంత అద్భుతమైన విశ్వము సృష్టించబడటమనేది ఊహించలేని అంశము. ఏదో ఒక మహాశక్తి యొక్క పాత్ర ఇందులో ఉన్నది అనే విషయము మాత్రం సత్యం!'** అని నొక్కి వక్కాణించారు.

పరిణామక్రమము(ఇవల్యూషన్)లో నేడు శాస్త్రజ్ఞులు భగవంతుని పాత్రను దర్శిస్తున్నారు. ప్రకృతికి, భగవంతునికి సంబంధించిన రహస్యములన్నీ ఈ పరిణామక్రమసిద్ధాంతము ద్వారా తెలుసుకొనగలమని వారు అభిప్రాయబడుతున్నారు. పదార్థవాదులైన శాస్త్రజ్ఞులు కూడా బ్రహ్మాండము యొక్క కల్పన, నిర్మాణము, జీవితము-చేతనత్వము కోసమేనని ఊహిస్తున్నారు. అందుచేతనే అమెరికాదేశములోని ధర్మవిజ్ఞానకేంద్ర డైరెక్టర్ మార్క్ రిచర్డ్‌సన్ 'విజ్ఞానము భగవంతుని యొక్క ప్రత్యక్షమైన ఋజువులతో కూడిన సాక్ష్యముగా కాకపోయినా కనీసము ఆయన క్రియాకలాపాలకు ద్వారంగా అయినా నిలబడగలుగు తుంది' అని అంటున్నాడు. ఈ సత్యమును అనుభూతి చెందిన పిదప, జీవరసాయన శాస్త్రవేత్త పీకాక్ యొక్క జీవనగమనమే మారిపోయింది. ఆయన సంపూర్ణముగా ధర్మమును శరణుజొచ్చి, 'భగవంతుని దయవల్లనే పృథ్వీమీద ఇంత జీవనవైవిధ్యము గోచరిస్తున్నది' అని అన్నాడు.

శాస్త్రజ్ఞులు తమ పరిశోధనలు, అన్వేషణలు పూర్తిచేసిన పిదప, ఒక అభిప్రాయమునకు వస్తున్నప్పుడు వారికి ఏదో ఒక అదృశ్యమైన విషయము తొంగిచూసినట్లు అనిపించినది. అటువంటి అనుభూతి పొందినవారిలో కార్ల్ సాగాం ఒకరు. ఆయన విజ్ఞానమును అతి సహజమైన, సరళమైన ప్రామాణికమైన రూపములో ప్రజల వద్దకు తీసుకునివెళ్ళే ప్రయత్నము చేశాడు. ఆయన జీవితము యొక్క అంతిమ క్షణాలలో కూడా 'భగవంతుడిని నమ్మాలా? వద్దా? అన్న సందేహప్రవృత్తిలో ఉండిపోయాడు. ఆయన తనయొక్క ఈ డోలాయమానస్థితిని 'జాతిచర్చ్‌పరిషత్' యొక్క ప్రధానా మాత్యుని చెంతనుంచారు. ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు న్యూటన్ కూడా దాదాపు ఇలాంటి ధార్మిక భావాలతో అనుప్రాణితమై ఉండేవాడు.

విజ్ఞానము అనుసరిస్తున్న పద్ధతి చాలా ప్రశంసనీయ మైనది. అది ఎలాంటి స్వాభిమానమును పెట్టుకోకుండా సత్యమును అంగీకరించటానికి సిద్ధమైనది. తనపరంగా ఈనాడు ఏదైనా తప్పు అని ఋజువైతే దానిని సరిదిద్దు కుంటున్నది. సత్యమును వెదికే క్రమములో మేము బాటసారులమే. పట్టుదలకుపోయేకన్నా, ఏదైనా తప్పు అని నిరూపించబడినప్పుడు, అవకాశముంటే ఆ తప్పును సరిదిద్దుకుని సంస్కరించుకోవాలి అని విజ్ఞానము అంగీకరిస్తున్నది. ఈ అంగీకారముతో విజ్ఞానము యొక్క నిజాయితి నిరూపించ బడినది. అలాగే మతము కూడా తన ఆ ప్రాచీన వేద పరం పరలను అనుసరించాలి. ఎందుకంటే వానిలో తర్కమునకు, ప్రయోగములకు మహత్వపూర్ణమైన స్థానము ఉండేది. ఇలా చెయ్యటము వల్ల ధార్మికజగత్తు తన భ్రమలు, మూఢనమ్మకాల నుండి విముక్తి పొందగలుగు తుంది.

విజ్ఞానం ధార్మికభావనలు, కరుణ, సంవేదనలను అనుసరించగలిగితే, వినాశ-విధ్వంసముల వైపుగా సాగుతున్న దాని అడుగులు వెనుదిరిగి, నవనిర్మాణదిశగా సాగిపోగలవు. ఈ రెండింటి కలయికలోనే జీవితము యొక్క సమగ్రత, పూర్ణత్వము ఇమిడి ఉన్నాయి. తత్ఫలితముగా అంతరంగ జీవితములో సంతోషం, భౌతికజీవితంలో సౌందర్యము వెల్లివిరియగలవు.

*- అఖండజ్యోతి, అక్టోబరు 2002*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**దెబ్బలు తిన్న శౌర్యవంతునికే ప్రభుత్వ పురస్కారం పొందేందుకు అర్హత లభిస్తుంది**

మెస్మరిజం-9

# మెస్మరిజం యొక్క సిద్ధులు

మెస్మరిజంను అభ్యసించేవారు త్రాటకము, ప్రాణాయామం ద్వారా తమ ఆత్మశక్తులను వికసింపచేసుకొని మరిన్ని దివ్యమైన లాభాలను పొందవచ్చు. వాటి గురించి సంక్షిప్తంగా క్రింద ఇవ్వడం జరిగింది.

### 1. దూరంగా ఉన్న వ్యక్తిపై ప్రభావము-ప్రేరణ

ఏ వ్యక్తినైనా దగ్గరగా కూర్చోబెట్టుకొని అతనిపై మెస్మరిజంను ప్రయోగించే విధివిధానాలు గతంలో చెప్పుకున్నాము. ఈ ప్రయోగమును దూరంగా ఉన్న వ్యక్తిపై కూడా చేయవచ్చు. సూక్ష్మశక్తుల విషయంలో దూరం అనే ప్రశ్నే తలెత్తదు. కాంతి కన్నా ఆలోచనలు ఎన్నో రెట్ల వేగమును కలిగి ఉంటాయి. అందుచేతనే వ్యక్తులు ఎంత దూరంలో ఉన్నా కూడా ఆత్మశక్తిని ప్రయోగించడం సంభవమే.

మనం ఏ వ్యక్తిని ప్రభావితం చేసి ప్రేరణను ఇవ్వాలను కుంటామో వారికి సంబంధించిన ఒక వస్తువును తీసుకోవాలి. అది చాలాకాలంపాటు వారికి సంబంధించినదై ఉండాలి. యూరోపియన్ ప్రయోక్తులు ఈ పనికి చేతిరుమాలును అడుగుతారు. ఎందుకంటే అది చిన్నదైనప్పటికీ ఎక్కువసార్లు శరీరస్పర్శను పొందినదై ఉంటుంది. భారతీయ తాంత్రికులు గోళ్ళు లేదా వెంట్రుకలు ఎక్కువగా పనికి వస్తాయని భావిస్తారు. ఫొటోలు, దుస్తులు, ఆభరణాలు, వారిచే వ్రాయబడిన కాగితములు, ఈ ప్రయోగానికి పనికివస్తాయి. ఏ వస్తువులు మనిషి శరీరాన్ని మాటిమాటికీ స్పృశిస్తాయో వాటికి మనిషి శరీరము యొక్క విద్యుత్ కణాలు అతుక్కుని ఉంటాయి. ఈ కణాలు ఆ సంబంధము నుండి సంపూర్ణంగా విడిపోవు. తల్లి శరీరంలోని కొంత భాగం పుత్రునిలో ఉంటుంది. దూరంగా ఉన్న పుత్రునికి ఏదైనా ఆపద కలిగితే తల్లి హృదయం విలవిల్లాడుతుంది. పుత్రుని శరీరంలో ఉత్పన్నమయ్యే బాధ యొక్క అనుభూతి తల్లి శరీరము వరకు చేరడమే ఇందుకు కారణం. ఈ విధంగా గోళ్ళు, వెంట్రుకలు, వస్త్రమువంటి వానిలో అతుక్కొని ఉన్న కణములపై ప్రయోగము చేయడం వల్ల ఆ ప్రభావం దానితో సంబంధమును కలిగి ఉన్న వ్యక్తిపై పడుతుంది.

ఏకాంతస్థానంలో కూర్చొని ప్రాణాకర్షణ క్రియ ద్వారా మీ ఆత్మబలాన్ని జాగృతం చేసుకోండి. ఏ వ్యక్తికి మీరు ప్రేరణ కలిగించాలనుకుంటున్నారో అతని జుట్టు, గోళ్ళు, వస్త్రము లేదా అతని చేతివ్రాతను కలిగి ఉన్న కాగితమును దగ్గర ఉంచుకొని ఆ వస్తువుపై దృష్టిని కేంద్రీకరించండి. మీరు ఏదైనా ఒక నాటకం వేయాలంటే ఎంత ఏకాగ్రతతో రిహార్సల్స్ చేస్తారో అంతటి ఏకాగ్రతను ఈ ప్రయోగమునకు కూడా చూపించాలి. మనస్సులో ఆ వస్తువుకు సంబంధించిన వ్యక్తి మీ ఎదురుగా కూర్చొని ఉన్నాడు అని భావించి అతనిపై దృష్టిపాతము, ఆదేశములు, మార్జనమువంటి ప్రయోగాలు భౌతికంగా ఉన్న వ్యక్తిపై చేసిన విధంగానే చేయండి. ఈ ప్రయోగము వారికి శుభం కలిగించాలంటే సరైన విధానంలో చేయాలనే విషయాన్ని మర్చిపోకూడదు. హానికరమైన, అనుచితమైన మార్గంలో ఈ ప్రయోగం చేయడాన్ని మేము ఎన్నటికీ సమర్థించము. అలా చేయవద్దని కూడా పాఠకులను హెచ్చరిస్తున్నాము.

ఈ విధంగా చేసే ప్రయోగం యొక్క ప్రభావం దూరంగా ఉన్న వ్యక్తిపై అసాధారణ ప్రభావాన్ని చూపిస్తుంది. వారు మనం కోరిన విధంగా చేసేందుకు వివశుల్ని చేస్తుంది. ప్రతిరోజు ప్రాతఃకాల సమయంలో ఈ ప్రయోగము చేయాలి. ఎక్కువగా చేయాలనుకుంటే సాయంకాలంలో కూడా చేయవచ్చు. కొద్దిరోజులు ఇలాగే చేస్తూ ఉంటే కోరిన ఫలితాలు లభిస్తాయి.

### 2. ఇతరులను చెడు ప్రయోగాల నుండి రక్షించడం

కొంతమంది దురాత్ములు చనిపోయినా, జీవించి ఉన్న వారికి హాని తలపెట్టాలనే కోరికతో అదృశ్య ప్రయత్నాలు చేస్తుంటారు. ఇందువల్ల రోగాలు, బాధలు, కలహాలు, మతిభ్రమించడం, చిత్తచాంచల్యము, భయమువంటివి ఉత్పన్నం కావడం వల్ల పనిచేయగల సామర్థ్యము, బుద్ధిబలము సన్నగిల్లిపోతాయి.

ఇటువంటి చెడు ప్రభావాలను దూరం చేయాలంటే మన చుట్టూ ఒక రకమైన రక్షరేఖ గీసుకోవాలి. శ్రీరామచంద్రుల వారు, లక్ష్మణుడు ఇరువురు కలిసి బైటకు వెళ్ళవలసి వస్తే సీతమ్మతల్లి రక్షణ కోసం కుటీరం చుట్టూ ఒక రేఖ గీసేవారు.

**అవినీతిని సామూహికంగా ఎదుర్కొనే ప్రవృత్తి ప్రజలలో తీసుకురావాలి**

అది ఒక దడివలె ఉండి ఆ దాని లోపల ఉండే ఆత్మశక్తి ప్రభావం వల్ల హానికరమైన తత్వాలేవీ ఆ గీతను దాటి లోపలికి ప్రవేశించలేకపోయేవి. రావణుడు సీతమ్మను అపహరించుకు పోవాలనుకున్నప్పుడు కూడా ఆ గీతను దాటి లోపలికి వెళ్ళలేక సీతమ్మతల్లిని ఏదోవిధంగా మభ్యపెట్టి గీతదాటి బైటకు వచ్చేలా చేసి అపహరించాడు.

యోగశాస్త్ర భాషలో దీనినే 'కవచము' అంటారు. కవచము అంటే ధాతువులను కలిపి చేసే వస్త్రము. యుద్ధానికి వెళ్ళే యోధులు దీనిని ధరించి యుద్ధానికి వెళ్తారు. శత్రువులు ప్రయోగించే ఆయుధాలు ఈ కవచంపై ఏ ప్రభావాన్ని చూపలేవు. ఆత్మశక్తితో కూడిన కవచానికి కూడా ఇటువంటి ప్రభావమే ఉంటుంది. మనకు నష్టమును కలుగజేసే ప్రభావము ఏదైనా పడుతున్నదనిపించినప్పుడు క్రింద ఇవ్వబడిన ఉపాయాలను ప్రయోగించి కవచమును ధరించ వచ్చు.

అ) ఏకాంత స్థానంలో వెన్నెముకను నిటారుగా ఉంచుకొని ప్రశాంత చిత్తముతో పద్మాసనంలో తూర్పువైపు తిరిగి కూర్చోవాలి. ఊపిరితిత్తులలో నిండి ఉన్న గాలిని మెల్లిమెల్లిగా బైటకు వదులుతూ మనపై ఉన్న ఇతరుల యొక్క దుష్ప్రభావములు అన్నీ శ్వాసతో పాటుగా బైటకు పోతున్నాయి అని భావించాలి. శ్వాస పూర్తిగా బైటకు పోయిన తరువాత శ్వాసను పీల్చుకుంటూ పవనపుత్రుడైన హనుమంతుడు శ్వాసతో పాటుగా లోపలికి ప్రవేశిస్తున్నాడు అని భావించాలి. గాలిని పూర్తిగా పీల్చుకున్న తరువాత కొద్దిసేపు లోపలే ఆపి ఉంచి పవన కుమారుడైన బజరంగబలి నా శరీరములో నిండి పోతున్నాడు, ఆయన ప్రభావము వల్ల నాపై ఉన్న దుష్ప్రభావాలు అన్నీ పారిపోతున్నాయి అని భావించాలి.

ఆ) ఇలా ప్రాణాయామము చేసిన తరువాత కళ్ళు మూసుకొని ఎవరి తేజోవలయాన్ని (aura) వారు ధ్యానించాలి. శరీరము చుట్టూ ఒక ప్రకాశము వ్యాపించి ఉంటుంది. దానిని తేజోవలయం అంటారు. "నేను సూర్యునితో సమానమైన తేజోవంతుడను, నా కిరణాలు చాలా దూరం వరకు దట్టంగా వ్యాపిస్తున్నాయి. ఈ ఆవరణలో చాలా తేజస్సు ఉన్నది. ఎటువంటి చెడు ప్రభావాలు ఈ వలయంలోనికి ప్రవేశించ లేవు' అని భావించాలి. ఈ విధమైన ధ్యానమును ఎక్కువసేపు శ్రద్ధాపూర్వకంగా చేయాలి.

ఇ) మీకు ఇంకా దుష్ప్రభావములు పోలేదనే అనుమానం కలిగితే నూనె పూసుకొని వేడినీటితో స్నానం చేయండి. యజ్ఞోపవీతాన్ని మార్చుకోండి. కట్టుకున్న బట్టలను తీసివేసి శుభ్రమైన, ఉతికిన వస్త్రాలను వెంటనే కట్టుకోండి. ఉపవాసం ఉండండి, వెయ్యిసార్లు గాయత్రీ మంత్రజపం చేయండి. దైవదర్శనానికి వెళ్ళి యథాశక్తి దానం చేయండి.

ఈ) ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారి వద్ద నుండి మంత్ర జలాన్ని స్వీకరించి విభూతి, రక్షాసూత్రం లేదా తాయెత్తుల వంటి వాటిని కట్టుకోవాలి.

ఉ) ఇతరులను ఎవరినైనా దుష్ప్రభావాల నుండి రక్షించాలి అనుకుంటే పైన చెప్పిన మూడు మార్గాలను అనుసరించమని చెప్పవచ్చు. అంతేకాదు యథాశక్తి గాయత్రీ మంత్రముతో మంత్రించబడిన జలమును లేదా భస్మమును వారికి ఇవ్వండి. బీసా యంత్రమును లేదా 'ఓం' అక్షరమును రక్షాభావనతో పవిత్రంగా ఉండి వ్రాసుకొని దానిని ధరించాలి.

ఇతరులను ద్వారా మనపై చేయబడిన దుష్ప్రయోగాలు ఈ ఉపాయాలను ఆచరించడం వల్ల శమింపచేసుకోవడమే కాక ఆ చెడు కర్మలు తిరిగి ప్రయోగము చేసిన వారి మీదకే వెళ్ళి పడతాయి.

### 3. దూరదర్శనము

కౌరవులు, పాండవుల మధ్య జరుగుతున్న యుద్ధానంతటినీ రాజమహలులో కూర్చొని సంజయుడు చూశాడు. ఇటువంటి సంపూర్ణస్థితి విశేషమైన ప్రయత్నము ద్వారానే సాధ్యవుతుంది. కానీ మెస్మరిజంను అభ్యసించేవారు కొద్దో, గొప్పో ఇటువంటి స్థితిని సాధించగలరు. దూరంగా జరిగే విషయాలు చాలా మేరకు లీలగా దర్శించడమనేది జరగవచ్చు.

అ) సంపూర్ణంగా, శాంతంగా, కోలాహలమనేది లేకుండా ఉండే ఒక ఏకాంతస్థానంలో కళ్ళు మూసుకొని కూర్చోవాలి. మనస్సును ఒక్కసారిగా సంకల్పరహితంగా చేసుకోవాలి. చంచలత్వాన్ని వదిలివేయాలి. తమయొక్క వాస్తవిక విషయాల నన్నింటిని మరచిపోవాలి. ఎలాగంటే అసలు మనకు ఎటువంటి ఆలోచనలు కానీ పనులు కానీ లేవేమో అన్నట్లుగా ఉండాలి. ఈ సంకల్పరహిత స్థితిని పొందడానికి 10,15 నిమిషాలు ప్రయత్నించండి.

ఆ) ఎప్పుడైతే చిత్తమంతా శాంతస్థితికి చేరుతుందో అప్పుడు మీరు ఎక్కడి దృశ్యాన్ని చూడాలనుకుంటారో ఆ స్థానాన్ని

**మనం ఏది మంచిది కాదనుకుంటామో, దానిని ఒప్పుకోకపోవడమే సత్యాగ్రహం**

నిర్ణయించుకోండి. ప్రతి వస్తువును గౌరవర్ణము (తెల్లనిరంగు)లో చూడండి. అక్కడ జరుగుతున్న పనులు దృష్టిగోచరమవుతాయి. ప్రారంభంలో కొంచెం సవ్యంగా కనిపించకపోవచ్చు. ఏకాగ్రత పెరిగిన కొద్దీ దూరదర్శనం సిద్ధిస్తుంది.

### 4. భవిష్యజ్ఞానము

అ) మిమ్మల్ని మీరు పూర్తిగా శిథిలం (relax) చేసుకోండి. శరీరము నుండి మీరు వేరుగా ఉన్నారు అనే అనుభూతి పొందండి. బొటనవ్రేలి పరిమాణంలో ఆత్మజ్యోతిని ధ్యానించండి. నిర్వికారమై, నిర్లిప్తమై, శుద్ధబుద్ధియై, ముక్తస్థితిలో ఉండడమనే గుణములతో కూడిన ఆత్మను అనుభూతి చెందండి.

ఆ) ఈ తేజోస్వరూపమైన ఆత్మను పైన ఉండే ఆకాశంలో కూర్చుండబెట్టండి. అక్కడి నుండి మీరు తెలుసుకోవాలనుకున్న వ్యక్తి యొక్క దేశము లేదా పనిపై దృష్టి సారించండి. ఆ వ్యక్తికి ముందు, వెనుక ఒక విశేషవర్ణముతో కూడిన పొగమంచు చుట్టుకున్నట్లు కనపడుతుంది. ఆ పొగరంగు ఏమిటి అనేది పరిశీలనగా చూసి గుర్తించండి.

ఇ) ఎవరి చుట్టూ నల్లని, దట్టమైన, భయానకమైన పొగ మంచు కనపడుతుందో వారి భవిష్యత్తు అంధకారమయమవు తుంది. అది మంచి సూచన కాదు అని అర్థము చేసుకోండి. ఎవరి చుట్టూ తెల్లని, స్వచ్ఛమైన, తేలికైన పొగమంచువంటి నీడ కనిపిస్తుందో వారి భవిష్యత్తు ఉజ్జ్వలంగా ఉంటుంది అని తెలుసుకోవాలి.

ఈ) ఇలా చాలా రోజులు అభ్యసించిన తరువాత ధ్యానంలో కూర్చోగానే భవిష్యత్తులో జరగబోయే సంఘటనలు దృశ్యాలు కనిపించడం మొదలవుతుంది.

### 5. వ్యక్తిత్వమునకు గుర్తింపు

ఏ వ్యక్తి ఎటువంటి నడవడికను, ఆలోచనలను కలిగి ఉంటాడు అనే విషయాలు ఆత్మపరమైన అభ్యాసము ద్వారా పొందవచ్చును. అది ఈ ప్రకారంగా ఉంది.

అ) ఏ మనిషి వ్యక్తిత్వము తెలుసుకోవాలనుకుంటానో 10 సెకండ్ల వరకు వారి ఎడమ కనురెప్ప మీద త్రాటకం చేయండి. ఆ తరువాత 10 సెకండ్ల వరకు కళ్ళు మూసుకోండి.

ఆ) కళ్ళు మూసుకొని ఎదురుగా ఉన్న వ్యక్తి యొక్క ముఖమును ధ్యానించండి. మీకు ఒక విశేషమైన రంగుతో కూడిన రేఖలు అతని ముఖం చుట్టూ తిరుగుతూ కనిపిస్తాయి.

ఇ) ఈ రంగుల ద్వారా వచ్చే ఫలితాలను ఇలా తీసుకోవచ్చు. తెలుపురంగు – నిజమైన నిజాయితి, మట్టిరంగు – టక్కరితనం, ఖాకీరంగు – ఇచ్చిన మాటను నిలుపుకొనుట, గులాబీరంగు – మంచి మనస్సు, ఎరుపురంగు – కోప స్వభావము, ఆకుపచ్చని రంగు – శాంతంగా, స్థిరంగా ఉండుట; పసుపు రంగు – సాహసము, ప్రయత్నశీలత; నారింజ రంగు – అభిమానము, నీలిరంగు – అస్థిరత, వంకాయరంగు – స్వార్థము, నలుపురంగు – మోసము, నిర్దయ; బంగారు రంగు – దివ్య స్వభావము, మిశ్రమ రంగులు – కుటిలనీతి, ఇలా కాకుండా అన్ని రంగులు కలిసిపోయినట్లుగా ఉంటే గుణములన్నీ కూడా కలిసిపోయే ఉంటాయి.

ఈ) కళ్ళు మూసుకొని దగ్గరలో ఉన్న వ్యక్తి ముఖమును గంభీరమైన దృష్టితో గమనించండి. అప్పుడు మీ మనస్సులో ఏ రకమైన అభిప్రాయం ఏర్పడుతున్నదో గమనించండి. స్వచ్ఛమైన మనస్సులో ఏ రకమైన శ్రద్ధ ఉన్నా, అనుమానం ఉన్నా కూడా ఎదుటివారిలో అటువంటి నడవడికను, స్వభావాన్ని మీరు గమనిస్తారు.

### 6. సందేశమును పంపించుట

టెలిఫోన్‌లు, రేడియోలు లేకుండా కూడా మనిషి తన ఆలోచనలను ఎదుటివారికి చేరవేయగలడు. యూరోపియన్ యోగులు ఈ విద్యను 'టెలిపతి' అంటారు. ఈ విద్యను క్రింది విధంగా అభ్యసించాలి.

అ) ఈ ప్రయోగం పాల్గొనే వారిని ఎన్నుకొని ఒక సమయాన్ని నిర్ధారించుకొని వారిని తమతమ స్థానముల యందు ఏకాంత ప్రదేశమును చూసుకొని శాంతచిత్తులై కూర్చోమని చెప్పాలి.

ఆ) ప్రారంభంలో మొదటి 5 నిమిషాలు మొదటి వ్యక్తి తన సందేశాన్ని పంపుతాడు. రెండవవారు వింటారు. ఆ తరువాత రెండవవ్యక్తి 5 నిమిషాలు సందేశాన్నిస్తాడు, మొదటి వ్యక్తి వింటాడు. మొదటివారు ఎవరు, రెండవవారు ఎవరు అనేది ముందుగానే నిర్ధారించుకోవాలి.

ఇ) సందేశమును ఇచ్చేవారు కళ్ళుమూసుకొని రెండవ వ్యక్తిని ధ్యానించాలి. వారు తమ సమీపంలోనే కూర్చుని ఉన్నట్లుగా అనుభూతి చెంది మనస్సులోనే తాము చెప్పదలుచు కున్నది చెప్పాలి. ఏ విషయాన్ని చెప్పాలనుకుంటారో ఆ పదాలు చాలా స్పష్టంగా, గంభీరతా పూర్వకంగా ఉండాలి. శబ్దాలను

**మంచి స్నేహం అంటే చెడుమార్గం నుంచి మంచిమార్గంలోకి తీసుకువెళ్ళడం**

నోటితో ఉచ్చరించవలసిన అవసరం లేదు. మౌనంగానే ఇవన్నీ జరగాలి.

ఈ) రెండవవ్యక్తి ప్రారంభంలో నిర్ధారించుకొనిన సమయమునందు మొదటి వ్యక్తి కళ్ళు మూసుకొని అతని ముఖమును గంభీరతా పూర్వకంగా అతని ముఖమును చూస్తూ అతను ప్రకటించే భావమును ధ్యానించాలి. అతని ముఖంలో ఏ భావము ప్రకటితమవుతున్నదో దానిని హృదయంగమం చేసుకోవాలి.

ఉ) ఈ ప్రకారంగానే 5 నిమిషాల తరువాత రెండవవ్యక్తి సందేశాన్ని పంపించాలి. మొదటి వ్యక్తి దాన్ని గ్రహించాలి.

బ్రహ్మ ముహూర్తములో దీనిని అభ్యసిస్తే చాలా మంచిది. తమ అభ్యాసము పూర్తయిన తరువాత ఈ ఇరువురు వ్యక్తులు కలుసుకొని వారు ఏమి ఆలోచించారు. అది ఎంతవరకు సరిగ్గా వ్యక్తపరచగలిగారు అనే విషయాన్ని గురించి చర్చించుకోవాలి. ప్రారంభంలో పదిశాతం మాత్రమే సాఫల్యం లభిస్తుంది. సగభాగం అర్థమైనా సరే సాఫల్యం లభించిందనే భావించాలి. ఇక అక్కడి నుండి సమయాన్ని నిర్ధారించుకోకపోయినా సరే సందేశాలను పంపించుకోవచ్చు. నిరంతరం ప్రయత్నిస్తూ ఉండడం వల్ల ఈ విద్యలో పూర్ణసిద్ధి లభిస్తుంది.

## 7. ఇతరుల మనస్సులలోని భావాలను తెలుసుకొనుట

1) ధ్యానస్థులైన తరువాత తమ మనస్సును ఖాళీగా నీలాకాశంలోని శూన్యమువలె చూడాలి. ఏ వ్యక్తి యొక్క మనస్సులోని మాటను తెలుసుకోవాలి అనుకుంటారో వారి యొక్క రూపాన్ని మాత్రమే అఖిల నీలాకాశంలో ఉన్నట్లుగా చూడాలి. అంటే ఈ విశ్వమంతా ఒక నీలాకాశమని, ఆ ఆకాశంలో మీరు అనుకున్న వ్యక్తి తప్ప మరెవ్వరు కానీ, వస్తువులు కానీ లేవని భావించాలి.

2) ఒక్కసారిగా ఆ వ్యక్తి యొక్క రూపమును తదేకంగా చూడాలి. కొద్దిక్షణాలలోనే ఆ వ్యక్తి తన భావాలను, ఆలోచనలను సంకేతాల ద్వారానో, నోటిద్వారానో చెప్పడం మీకు కనిపిస్తుంది.

3) ఇలా లభించిన సందేశముల ద్వారా ఇతరుల మనస్సులోని మాటలను తెలుసుకోవడం జరుగుతుంది.

## 8. బాధను దూరము చేయుట

దంతాలు, శిరస్సు, నాడులు, కండరాలు, కీళ్ళవంటి ప్రదేశాల్లో వచ్చే నొప్పి; తేలు, మండ్రగబ్బ, పాము వంటి విషపు జంతువులు కాటు వేసినందువల్ల వచ్చే బాధ, ఉన్మాదము, ఆవేశము, భూతముల వల్ల కలిగే బాధ, ఆవేశము, భయమువంటి మానసిక బాధలుంటే అవి నివారించాలనే దృఢమైన కోరికతో గాయత్రీమంత్రముతో అభిమంత్రించిన జలమును త్రాగించాలి. శుద్ధమైన భస్మమును తీసుకొని నొప్పి ఉన్న ప్రాంతంలో పూయాలి. నొప్పి ఉన్న ప్రాంతములో చేతితో మార్జనము (హీలింగ్) చేయాలి. ఇలా చేస్తే బాధ చాలా త్వరగా తగ్గిపోతుంది.

## 9. శక్తి పాతము

ఆధ్యాత్మిక విద్య ఉన్నత స్థితులను ఎలా పొందాలో నేర్చుకున్న వ్యక్తి ఇతరులపైన తన శక్తిని అసాధారణ రీతిలో ప్రయోగించగలడు. దానివల్ల ఆంతరికజీవితము పూర్తిగా మారిపోతుంది. స్వభావము, ఆలోచనలు, సంస్కారాలు వేరే విధంగా మారిపోతాయి. ఇది మెస్మరిజంలో ఉన్నతస్థాయి ప్రయోగము. సాధారణ ప్రయోగాలు చేసేటప్పుడు వాటి యొక్క విశేష ప్రభావము తంద్రాస్థితి (నిద్రాస్థితి) ఉన్నంతవరకే ఉంటుంది. మెలకువల రాగానే ప్రభావము తగ్గిపోతుంది. కానీ శక్తిపాతము యొక్క ప్రభావము నిలకడగా ఉంటుంది. ఒక్కసారి చేసే ప్రయోగములోనే మనిషి యొక్క మానసిక స్థితి అంతా మారిపోతుంది. ఈ ప్రయోగము స్వీకరించే సమయంలో ఒళ్ళంతా ఒక్క కుదుపు కుదిపినట్లు కంపిస్తుంది. వర్ణించేందుకు వీలులేని విచిత్ర మానసికస్థితి ఏర్పడుతుంది. సత్యమును మాత్రమే పలికే, సదాచారవంతుడైన తీక్షణమైన తపస్సును చేసే సాధకుడు మాత్రమే శక్తిపాతము చేయగలడు.

పైన చెప్పిన పంక్తులలో వర్ణించబడిన 8 సిద్ధులు ఎవరికీ ప్రారంభంలోనే పూర్తిగా లభించవు. చాలాకాలంపాటు నిరంతరం అభ్యాసము చేస్తుంటేనే అందులో వచ్చే ఫలితాలు మెల్లిమెల్లిగా మెరుగుపడుతూ ఏదో ఒకరోజు ఊహించలేనన్ని సిద్ధులు లభిస్తాయి.

*– పూజ్య గురుదేవుల వాఙ్మయం 17 (9.17) నుండి*
*అనువాదం: శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**“నేటి పరాజయమే రేపటి విజయానికి సూచిక” అనే స్ఫూర్తిని తెచ్చుకోవాలి**

శరీర విజ్ఞానం

# రహస్యమయ ఉపత్యికలు

షట్చ్రక్రములు మరియు ఉపత్యికలను గురించి యోగ విజ్ఞానములో విస్తృతముగా వర్ణించబడినది. వీటిని ముఖ్యంగా దివ్యశక్తుల భాండాగారములుగా అభివర్ణించారు. సృష్టికర్త తన యువరాజైన మానవునికి అమోఘమైన శక్తులను బీజ రూపములో ప్రదానము చేశాడు. అదే సమయములో వాటిని గుప్తముగా అట్టిపెట్టాడు. ఆవశ్యకమైన పరిపక్వత, పాత్రత వికసించినప్పుడే మనిషి వాటిని పొందగలిగేవిధంగాను మరియు సరైన సమయములో సరైన రీతిలో అందిపుచ్చుకునే విధముగాను వాటిని ప్రసుప్తస్థితిలో ఉంచాడు.

షట్చ్రక్రములను ఆత్మికశక్తుల భండాగారములుగా భావిస్తారు. ఏడవది సహస్రారచక్రము. ఇవే సప్తలోకములు! ఈ లోకములు ఒకదానిపైన మరొకటి ఉంటాయి. అలాగే విభూతులు, శక్తులు, సిద్ధులు ఒకదానిని మించి మరొకదానిలో వరుసక్రమములో ఉంటాయి. ఈ షట్చ్రక్రములను అధిరోహిస్తూ ఆత్మ – పరమాత్మవరకు చేరుకుని పూర్ణత్వమును సాధిస్తుంది. ఈ షట్చ్రక్రములు స్థూలశరీరములోకాక, సూక్ష్మ, కారణ శరీరములలో ఉంటాయి. ఆ చక్రాలను ఇంద్రియములు లేదా ఉపకరణముల సహాయముతో వీక్షించలేము.

ఇంతేకాకుండా అధ్యాత్మిక విజ్ఞానమును అనుసరించి 24 ఉపత్యికలు ఉన్నాయి. ఇవే గాయత్రీమంత్రములోని 24 అక్షరములతో అనుసంధానించబడ్డాయి. వీటినే 24 దేవతలు, 24 ఋషులు, 24 అవతారములనికూడా చెప్తారు. ఇవి స్థూలశరీరములో వెలుగొందుతున్న రహస్యములతో నిండిన గ్రంథులు. వీటిని ప్రత్యక్షముగా వీక్షించగలము. కొద్దికాలము క్రిందటివరకు వీటికి సంబంధించి విశేషమైన విషయములేవీ తెలియవు. వాటిని కందరముల వ్యవస్థలో విడివిడిగా నెలకొని ఉన్న సాధారణమైన భాగాలు అని భావించారు. అలాంటివి ఎన్నో ఉన్నాయి. కంఠము వద్ద అవి అత్యధికముగా ఉన్నాయి.

కొద్దికాలము క్రితమే ఉపత్యికలకు సంబంధించిన అంతః స్రావ గ్రంథులను (Endocrine glands) గురించిన మెరుగైన విషయములు వెలుగులోకి వచ్చాయి. వాటిలోనుండి కొన్ని విశేషమైన స్రావములు అత్యంత స్వల్పపరిమాణములో వెలువడతాయి. అవి తమదైన రీతిలో రక్తములో కలిసిపోతాయి.

శరీరములో అనేకరకములైన స్రావములు, గ్రంథుల వ్యవస్థలు ఉన్నాయి. జీర్ణప్రక్రియను సమగ్రతా పూర్వకముగా నిర్వహించటానికి నోటినుండి, అన్నాశయము నుండి, కాలేయం, చిన్న–పెద్దప్రేవుల నుండి పలురకములైన స్రావములు విడుదల అవుతాయి. రాత్రింబవళ్ళు ఆ పని జరుగుతూనే ఉంటుంది. హార్మోన్స్ అని పిలువబడే అంతఃస్రావగ్రంథుల స్రావములు అత్యంత స్వల్పమాత్రముగా వెలువడుతుంటాయి. అయినా కూడా అవి అంత అద్భుతమైన పరిణామములను చూపించి నప్పుడు వాటిని 'మాయాజాలపు పేటికలు' అని పోల్చిచెప్పుట అతిశయోక్తి కాదు! మానవునిలో ఎన్ని ప్రత్యేకతలున్నాయో వాటిని పెంచి–తగ్గించుటలో వీటి పని అసాధారణమైనది. అధికబరువు, లావు, సన్నబడుట, పొడుగు–పొట్టిగా అవ్వటము వంటి విచిత్రములలో ఈ అంతఃస్రావగ్రంథులే చమత్కారములను చూపిస్తుంటాయి. సంతాన ఉత్పత్తి అవయవములలో కనపడే నిష్క్రియత–సక్రియతలో కూడా వీటి యొక్క అద్భుతమైన భూమిక ఉంటుంది. వీటికి వ్యతిరేకముగా లింగ–పరివర్తన సంఘటనలు కూడా అప్పుడప్పుడూ సంభవిస్తుంటాయి.

అంతఃస్రావగ్రంథులను గూర్చి ఇప్పటివరకు తెలిసినది అల్పమే. ఈ తెలిసిన కొద్దిపాటి విషయముల ద్వారా మరిన్ని వివరములు సైతము వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నది. ఆకాశమునకు సూర్య–చంద్రులు అధిష్ఠానదేవతలు. ఒకానొకప్పుడు మున్ముందుగా సూర్య–చంద్రులను గురించి తెలిసింది. ఆ పిమ్మట నవగ్రహముల వివరములు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు వాటిలో గురు, బుధ, శుక్రగ్రహాల అన్వేషణా వివరములు కూడా లభ్యమౌతున్నాయి. ఈ అన్వేషణలు చివరి అంకమునకు చేరలేదు. అయితే సౌరమండలమునకు చెందిన గ్రహములు–ఉపగ్రహముల శృంఖలను గురించి అనేకమైన విషయములు వెలుగులోకి వస్తున్నాయి. వాటి సంఖ్య, స్థితిని గురించిన విషయములు అందుబాటులోకి వస్తున్నాయి. అంతఃస్రావగ్రంథుల పరస్పర సంబంధములలో కూడా ఇలానే జరుగుతున్నది. ఇప్పుడు అవి పురుషుని అండకోశ రూపములోను, స్త్రీల స్తనరూపములోను అవగాహన చేసుకోబడుతున్నాయి. దీని తరువాత సంతానోత్పత్తి

**ఓటమి జీవితానికి ముగింపు కాదు**

ప్రయోజనములో శరీరము లోలోపల శుక్రాణువులు-డింబాణువుల సమూహములు ఒకదానినొకటి ఢీకొని, అన్వేషించి, జతకడతాయి అని తెలుసుకున్నారు. ఇక ఇప్పుడు వీటిని అంతఃస్రావగ్రంథుల రూపములోనే గుర్తించడం జరుగుతున్నది. వాటిలో ముఖ్యమైనవి ఆరు అని చెప్తున్నారు విజ్ఞానవేత్తలు. వాటి గతివిధుల (activities) యొక్క రూపురేఖలు కూడా చాలావరకు స్పష్టమైనాయి.

ఇప్పటివరకు తెలుసుకున్నదే అంతా అని, ఇంకేమి కాదని భావించడము తగదు. ఇప్పటికికూడా ఆ శృంఖలలో తెలుసుకోవలసిన అంశములు చాలానే ఉన్నాయి. ఆ అవకాశాలు కూడా అమితముగానే ఉన్నాయి. ఆ రహస్య పరదాలు ప్రక్కకి తొలగి ఆ 24 ఉపత్యికలను గురించి మరిన్ని విషయములు వెలుగులోకి రావాలి. ఆరోజు ఎంతో దూరములో లేదని ఆశిద్దాము. అవి ఇప్పటివరకు తెలిసిన అంతఃస్రావ గ్రంథులతో సరిసమానముగా శక్తివంతమైనవని నిరూపించబడతాయి. పైపెచ్చు వాటికంటే కూడా, గొప్పవైన రహస్య భూమికలను నిర్వహిస్తాయి.

శారీరిక గతివిధుల సంచాలనలో (activities) కేవలము హృదయము, కాలేయము, అన్నాశయము, కండరములు మొదలైనవే సమస్తం అని భావించడం జరుగుతున్నది. వీటిని సరైన రీతిలో ఉంచుకోవడం మీదనే శరీర ఆరోగ్యము ఆధారపడి ఉంటుందని భావిస్తున్నారు శాస్త్రవేత్తలు. కానీ ఇప్పుడిక రోగాల కారణాల లోతులలోకి తొంగిచూసే అవకాశము లభించినచో శారీరక దుర్బలత, రోగములు కలగటానికి కారణమైన ఆ సూక్ష్మసంస్థానమును గురించికూడా తెలుసుకోగలుగుతాము. వీటిగురించి ఇప్పుడిప్పుడే కొద్దికొద్దిగా తెలుస్తున్నది.

ఉపత్యికా విజ్ఞానమును అనుసరించి అంతఃస్రావగ్రంథుల కార్యప్రణాళిక శరీరములోని అన్ని ప్రముఖ క్రియాకలాపములను ప్రభావితము గావిస్తుంది. వీటికి అంతర్గతముగా శారీరిక వికాసము, సంతానోత్పత్తి, పోషణ, రోగాలకు విరుద్ధముగా రక్షణను ఏర్పరచుట మరియు విభిన్న పరిస్థితులలో అనుకూలతను స్థాపించే సామర్థ్యము కలదు.

వైజ్ఞానికులు ఇప్పటివరకు ఈ అంతఃస్రావగ్రంథుల కార్యప్రణాళికను అర్థము చేసుకునే ప్రయత్నము చేస్తున్నారు. ఎందుకంటే వీటినుండి స్రవించే రసాయనిక తత్వములు అల్పమాత్రముగా ఉంటాయి. అవి అత్యంత శీఘ్రముగా స్రవించబడుటచేత వాటి జీవరసాయనిక విశ్లేషణ చేయుట అత్యంత కఠినముగా ఉంటుంది.

పురుషుల సంతానోత్పత్తి ప్రణాళికలో ప్రముఖమైన గ్రంథి టెస్టిస్ (వృషణములు). టెస్టిస్ యొక్క రెండు ప్రముఖ కార్యములు 1) శుక్రాణు కోశములను నిర్మించుట 2) పురుషుల యౌవన సంబంధమైన ఎండ్రోజన్స్ అనే అంతఃస్రావములను విడుదల చేయుట. ఎండ్రోజన్ హార్మోన్స్ పురుషత్వమును ప్రతిబింబించుటలో సహాయపడే యౌవన విశేషతలను ప్రకటీకరిస్తాయి. గడ్డము, ఛాతీమీద వెంట్రుకలు పెరిగేటట్టు చేయుట, గంభీర కంఠ స్వరము, పొడవైన కండరములు మరియు ఎముకలను రూపొందించుట, బాలుని పురుషుని రూపములో పరివర్తింప జేయుట అన్నవి వీటి పనులు.

స్త్రీల సంతానోత్పత్తి ప్రత్యేకతలు కూడా అంతఃస్రావగ్రంథుల ప్రణాళికచే నియంత్రించబడతాయి. పురుషుల గ్రంథులతో పోలిస్తే ఇవి మరింత జటిలమైనవి. స్త్రీ యౌవనవతిగా మారి ప్రత్యేకముగా నిలుచుటలో సహాయపడటముతోపాటు స్త్రీల ఋతుక్రమధర్మము మరియు గర్భధారణ ప్రక్రియల మీద ఈ అంతఃస్రావగ్రంథులే ప్రభావమును చూపిస్తాయి. స్త్రీలలో గోచరమయ్యే కోమలత్వము మీద కూడా ఈ గ్రంథుల ప్రభావమే కానవస్తుంది. ఈ రకముగా యౌవన ఆరంభ సమయములో ఈస్ట్రోజన్ (oestrogen) స్త్రీలలో స్తన రూపములో వికసిస్తాయి, ఋతుక్రమధర్మం ఆరంభము మరియు స్త్రీత్వమును సంతరించుకునే ప్రత్యేకతరూపములో ఇవి ప్రకటీకరింపబడతాయి.

ఎడ్రినల్‌గ్రంథి ఎడ్రీనాలిన్ (adrenalin) మరియు నార్‌ఎడ్రీనాలిన్ (noradrenalin) అనే రెండు ప్రముఖ హార్మోనులను ఉత్పత్తిచేస్తుంది. ఇవి పురుషులను యుద్ధోన్ముఖులను గావిస్తాయి లేక తిరోగమింపజేస్తాయి. (fight or flight) క్రోధము మరియు భయము, దుర్ఘటనలు, బాధలు మరియు రక్తస్రావము, ఉష్ణోగ్రతల స్థితులను సామాన్యమైన స్థితిగతులతో పోలిస్తే గనుక ఈ గ్రంథులు ఒక వెయ్యిరెట్లు అధికముగా మార్పును కలుగజేస్తాయి. అంతేకాక రక్తములో కలసిపోయి ప్రమాదకరమైన పరిస్థితులలో అంగములు, అవయవములు అప్రమత్తమయ్యేందుకు కావలసిన సంకేతాలను పంపిస్తాయి.

మనిషిలో ఉగ్ర-స్వభావ ప్రవృత్తి అనేది ఎడ్రీనాలిన్

**విజయం కోసం కసితో ప్రయత్నించాలి**

మరియు నార్ఎడ్రీనాలిన్ అనుపాతము మీద ఆధారపడి నిర్ధారించబడుతుంది. ఒక పిరికి మనిషిలో ఎడ్రీనాలిన్ (adrinalin) తక్కువగా స్రవిస్తుంది. ఉగ్రస్వభావిలో నార్ఎడ్రీనాలిన్ (noradrinalin) తక్కువగా స్రవిస్తుంది.

థైరాయిడ్ గ్రంథి మెడ క్రింది భాగములో నెలకొని ఉంటుంది. ఈ అంతఃస్రావగ్రంథి తక్కువగా పనిచేసినప్పుడు (hypothioridism) మనిషి మనోదౌర్బల్యముతో మందమతిగా ఉంటాడు. అతని నిర్ణయాత్మకశక్తి కూడా తక్కువైపోతుంది. హృదయగతి మందగిస్తుంది. దీనికి విరుద్ధముగా థైరాయిడ్ గ్రంథి అధిక శాతములో స్రవించుట చేత (hyperthioridism) హృదయస్పందన యొక్క వేగము ఇనుమడిస్తుంది. నిర్ణయాత్మకశక్తి వృద్ధిచెందుతుంది. ఆకలి ఎక్కువవుతుంది. మనిషి అధిక మనోవిచలత్వముతో బాధ పడుతుంటాడు.

మస్తిష్కములో నెలకొని ఉన్న పీనియల్గ్రంథి (penial gland) ఒక అత్యంత అద్భుతమైన గ్రంథి. ఈ గ్రంథి వున్న స్థానమును తృతీయ నేత్రము మరియు ఆత్మ యొక్క నివాస స్థానముగా అభివర్ణిస్తారు. పిట్యూటరీగ్రంథి (pitutary gland) వలన హార్మోనుల వృద్ధి నియంత్రించబడుతుంది. ఇది అంగ-అవయవముల వికాసములో సహాయమును అందిస్తుంది. పిట్యూటరీ గ్రంథికి సంబంధించిన అంతఃస్రావములు తక్కువగా వెలువడితే మనిషి మరుగుజ్జు అవుతాడు. ఎక్కువ స్రవించినప్పుడు పొడగరిగా రూపొందుతాడు.

అంతఃస్రావగ్రంథుల నుండి స్రవించే రసాయనాలలో మనిషి స్వభావమును, స్థాయిని, వికాసమును ప్రభావితము గావించే విశేషత ఏమున్నది? అవన్నీ కలిసి శరీరమును ఏవిధముగా అసాధారణ స్థాయిలో ప్రభావితం చేస్తాయి? ఇప్పటివరకు దీనివెనుక గల కారణములు స్పష్టముగా తెలియ రాలేదు. ఇంతవరకు తెలిసిన దానినిబట్టి అంచనావేయగలిగినది ఏమనగా అవి శరీరమును దాని ప్రకటిత మరియు అప్రకటిత అవయవముల మీద ప్రభావమును చూపిస్తాయి. స్వభావము, వ్యక్తిత్వముల ఉత్థాన-పతనములలో ఇవి దోహదపడతాయి. అసలెందుకిలా జరుగుతున్నది? ఈ అంతఃస్రావగ్రంథులలో గల విశేషత ఏమిటి? వీటికి సంబంధించిన విషయములను గురించిన ఒక సునిశ్చితమైన నిర్ధారణకు రాలేదు. చెప్పబడుతున్న విషయములన్నీ ఉజ్జాయింపుగా అంచనా వెయ్యబడినవే.

అధ్యాత్మిక విజ్ఞానము యొక్క సూక్ష్మదర్శనము చేసినవారు ఈ రహస్య సంస్థానముల విశిష్టతను యుగముల క్రిందటనే అవగాహన చేసుకున్నారు. వాటిని 'ఉపత్యికలు' అన్న పేరుతో ప్రస్తావించారు. వాటిని ధ్యానయోగము, సాధనావిధానముల మాధ్యమముగా నియంత్రించుట, వికసింపచేయుట మరియు ఉత్తేజింపజేయుటలో సాఫల్యమును పొందవచ్చును. తత్ఫల స్వరూపముగా శరీరమును కోరుకున్న ఆకృతిలో, రీతిలో మలచుకోవచ్చును. ఈ దిశలో వారు ప్రయత్నములు సాగించారు.

చక్రసాధన అన్నది కుండలినీవిజ్ఞాన అంతర్గతముగా వస్తుంది. చేతనాక్షేత్రము యొక్క ప్రతిభను, తీక్షణతను, ఉత్కృష్టతను ఇనుమడింపజేయుటలో చక్రసాధన సహాయమును అందిపుచ్చుకుంటారు సాధకులు. ఉపత్యికల సాధనాక్షేత్రము వీటికి కొంత భిన్నమైనది. స్థూలశరీరమును వికసింప చేయటానికి వాటిని జాగృతపరచి, సమున్నతము గావిస్తారు. దీనికొరకు ఆసనములు, ప్రాణాయామము, బంధనములు, ముద్రలు, జప-ధ్యానములను ఆధారముగా గైకొనడము జరుగుతుంది.

అంతఃస్రావగ్రంథుల ప్రభావమును దృష్టిలో పెట్టుకొని శారీరక సంరచన వెనుకగల సూక్ష్మతను అవగాహన చేసుకునేవారు ఈ పరిశోధనను, అన్వేషణను మరింతగా ముమ్ముందుకు తీసికెళ్ళాలని భావిస్తున్నారు. ప్రత్యక్షవాదులు కూడా తమకు తాము సమస్త ఉపత్యికల స్థానము, స్వరూపము, క్రియాకలాపముల వాస్తవస్థితిని సులభముగా అర్థము చేసుకొని, ఇతరులకు అతి తేలికగా అవగాహన కల్పించే రీతిలో శాస్త్రవేత్తలు తమ ప్రయత్నములు కొనసాగిస్తున్నారు. సమగ్ర ఆరోగ్యాభిలాషులు ఇప్పుడిక ఆహార-ఔషధముల సహాయముతో రక్తమాంసములను ప్రభావితము గావించే అమలులో ఉన్న చికిత్సా పద్ధతులలో కొంగ్రొత్త అధ్యాయము జోడింపబడాలి అని, ఉపత్యికల వ్యవస్థను ప్రభావితము కావిస్తూ మస్తిష్కము, శరీరములను రోగరహితముగాను, శక్తివంతముగాను, సమర్థ వంతముగాను రూపొందించే విధానం తెలుసుకొనవలసిన అవసరమున్నదని భావిస్తున్నారు.

*- అఖండజ్యోతి, జనవరి 1984*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**అపజయాలను విజయానికి సోపానాలుగా మార్చుకోవాలి**

# పునర్జన్మ

మానవ శరీరంలోని జీవాత్మకు ఉచ్చ-నీచ కర్మానుసారం ఫలితం అనుభవించవలసి ఉంటుంది. ఆ కర్మల ఆధారం మీదనే ఆ జీవాత్మ విభిన్న యోనుల్లో పుట్టవలసి ఉంటుంది. కర్మఫల వ్యవస్థ నుండి ఎవరూ తప్పించుకొని రక్షించబడలేదు. మంచి కర్మకు మంచి ప్రతిఫలం, పాపకర్మకు ప్రతిఫలం చెడుగా ఉంటుంది. ఎవరు నికృష్ట పనులు చేస్తూ ఉంటారో, వారంతా నిమ్నయోనులందు తిరిగి-తిరిగి జన్మతీసుకుంటూ ఉంటారు. అంతేగాక ఒక్కోసారి జడ యోని కూడా ప్రాప్తించవచ్చు. ఇదెప్పుడు ప్రాప్తిస్తుందంటే, అతడు ఎప్పుడు ప్రకృతికి ఎదురు తిరిగి, ప్రాకృతిక మర్యాదను అతిక్రమించినప్పుడు...

చిన్న-చిన్న తప్పులకు జీవాత్మకు ఇంత పెద్ద శిక్ష పడదు. కానీ అదే యోనిలో ఉంటూనే తదనురూప కర్మఫలం అనుభవించవలసి ఉంటుంది. అందుకొరకే సృష్టికర్త పునర్జన్మ వ్యవస్థను ఏర్పరిచాడు. జీవాత్మ చేసినదానికి ఉచితమైన శిక్ష మరుజన్మలో పొందుట కొరకు; ఈ శృంఖలా వ్యవస్థకు గొలుసు లోని ఒక కొక్కెమువంటి రూపంలో, మనం ఈ లోకంలో వికలాంగునిగా, కుంటి, గ్రుడ్డితనంతో ఉన్నవారిని చూస్తాము. మరికొందరిని చిన్నతనంలోనే మంచి ప్రావీణ్యత ఉన్నవారిని చూస్తాము, అటువంటి వారిని చూసినప్పుడు ఆశ్చర్యం పొందుతాము. సామాన్యంగా ఇంత చిన్న వయసులో 'ప్రతిభ' వారిలో ఎంత ఉన్నతంగా వికసింపబడిందో, అంత ప్రతిభను పెద్దవారిలో అత్యంత కఠిన పరిశ్రమ చేస్తేగాని కనిపించదు.

ఒక ప్రత్యేకతలున్న వారిలో ఈ సంఘటనలు వారి పునర్జన్మ లను పరిపుష్టిని చేస్తూ ఉంటాయి. వెనుకటి జన్మలో చేసిన పరిశ్రమే మరుసటి జన్మలో ప్రతిభగా వికసింప బడుతుంది. 16 సంవత్సరాల వయస్సులోనే శ్రీ శంకరాచార్యుల వారు వేద-వేదాంతాల మీద అధికారం సంపాదించుట, 'సాతవలేకర్' తన 7 సంవత్సరాల వయసులోనే సంస్కృతంలో ధారళంగా మాట్లాడటం, కేవలం 8 సంవత్సరాల వయస్సులోనే 'మోజార్ట్' సంగీత శాస్త్రంలో గొప్ప విద్వాంసుడుగా పేరు సంపాదించటం మొదలైనవన్నీ ప్రతిభా విశేషాలు పరోక్ష రూపంలో పునర్జన్మకు చెందినవే. వీటికి అదనంగా రాబోయే రోజుల్లో అప్పుడప్పుడు ఇటువంటి అనేక సంఘటనలు వెలుగులోకి వస్తాయి.

అటువంటిదే ఒక సంఘటన 'హరదోఈ' జిల్లాలోని 'పండరవా' అనే గ్రామంలో జరిగింది. ఆ గ్రామంలో బద్రీ ప్రసాద్ గుప్త ఒక పేద రైతు! తన కుటుంబంలో ఉన్న ఐదు మందిని పోషించే భారం అతని మీద ఉన్నది. కుటుంబ పోషణకు, తన పొలం నుండి లభించే ప్రతిఫలం అతి తక్కువ కారణంగా, వేరే దారి లేక, ప్రక్క గ్రామంలోని ఒక సంపన్న సేఠ్ అంగన్‌లాల్ అనే ధనికుని ఇంటి నౌకరీకి కుదిరాడు. అక్కడ అతడు పిండిమరను నడిపే పనికి కుదిరి, ఏదో విధంగా తన కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నాడు. 1978 సంవత్సరంలో సేఠ్‌గారు మరణించారు.

ఈ సేఠ్ మరణం తరువాత ఒక సంవత్సరానికి బద్రీ ప్రసాద్‌కు ఒక కుమారుడు జన్మించాడు. 'కమలేష్' అనే పేరున్న ఈ పిల్లవాడు 5 సంవత్సరాల వయసు నుండి, 'పిహానీ' గ్రామం నుండి ఎవరు వచ్చినా, వారిని పిలచి నమస్కరించి యోగ క్షేమాలను అడుగుతుండేవాడు. మొదట్లో కుటుంబంలోని వారు ఈ పిల్లవాని ఈ వ్యవహారం గురించి పెద్దగా పట్టించు కోలేదు. ఒక రోజు బద్రీ ప్రసాద్ ఏదో కారణంగా కోపంతో 'కమలేష్' ని కొట్టాడు. దాంతో కోపం వచ్చిన కమలేష్ 'నీవు మా నౌకరివి, నన్నే కొడతావా? నేను 'పిహానీ' గ్రామంలోని సేఠ్ అంగన్ లాల్‌ని. ఆనాడు నీకు ఆశ్రయం ఇవ్వకపోతే, ఈనాడు నీవు ఎక్కడో మసిబొగ్గులు ఏరుకుంటూ ఉండేవాడివి. చేసిన ఉపకారాన్ని మరచి ఇప్పుడు నా మీద కోపం చూపుతున్నావా? అని అన్నాడు'. పిల్లవాని మాటలు విన్న బద్రీప్రసాద్ ఉలిక్కిపడ్డాడు. నిజం తెలుసుకొంటానికి అతడు కమలేష్‌ని అనేక ప్రశ్నలు వేశాడు. అన్నింటికి సరైన జవాబులిచ్చాడు. అవి సేఠ్‌కి తప్ప మరెవ్వరికి తెలియనివి. ఇంతేగాక అతడు తన తండ్రితో జరిగిన కొన్ని సంఘటన వివరాలు కూడా చెప్పాడు. దీని తరువాత సేఠ్ కుటుంబాన్ని పిలిపించి విచారించుట జరిగింది. ఈ కమలేష్ తన పూర్వజన్మ లోని భార్యని, పిల్లలను, మనవలనందరిని గుర్తించాడు. వారు వేసిన ఇతర ప్రశ్నలకు కూడా సరైన జవాబులిచ్చాడు. తరువాత అప్పటి సేఠ్ ఫోటో చూపగా దానిని వెంటనే గుర్తించాడు. 'ఇది నా ఫోటోయే' అంటూ అందరిని ఆశ్చర్యపరిచాడు.

ఇంకొక సంఘటన ప్రసిద్ధ రచయిత చార్లెస్ డికెన్స్ విషయంగా జరిగింది. ఒకసారి ఈయన ఇటలీలోని రోమ్

**నాలుగు మంచి మాటలతో సమస్యను పరిష్కరించుకోవచ్చు**

నగరాన్ని చూడాలని బయలుదేరాడు. రోమ్ నగరంలోని ఒక హోటల్ రూములో బస ఏర్పాటు చేసుకొని చుట్టు ప్రక్కలున్న వింతలు-విశేషాలను చూసిన తరువాత 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక ప్రసిద్ధ పార్కుని చూడటానికి, మరుసటి రోజు ఒక టేక్సీని బాడుగకు మాట్లాడుకొని బయలుదేరాడు. దాదాపు 80 కి.మీ. దూరం చేరగానే ఈ ఇంగ్లీషు రచయిత గారికి, రోడ్లుకు ఇరుప్రక్కలున్న దృశ్యాలను చూడగా, ఇవన్నీ ఇంత క్రితమే తెలిసినట్లు అనిపించసాగింది. అక్కడ నుండి ముందుకు సాగేకొద్దీ, ప్రతీది తనకు ముందే పరిచయం అయినట్లు అనిపించసాగింది. కారు పార్కు గేటు వద్ద ఆగిన పిదప, అక్కడున్న ఎదురెదురుగా ఉండే నివాసాలను, ఎన్నో అంతస్తులు గల అపార్ట్‌మెంట్లను (మేడలను), ఎదురుగా ఉన్న వాటర్ టవర్ మొదలైనవన్నీ తనకు ఇంతకుముందు పరిచిత మైనవే అన్నట్లు అనిపించాయి. పార్కులోకి ప్రవేశించాక చూస్తే అక్కడ కూడా అవే తెలిసిన దృశ్యాలు. ఎత్తుగా పెరిగిన యూకలిప్టస్ వృక్షాలు, పచ్చని గడ్డితో ఉన్న విశాల మైదానం, దాని మధ్య-మధ్యలో వాటర్ ఫౌంటెన్స్, ఈ అన్ని దృశ్యాలు అతని మదిలో జ్ఞాపకాల వలయాలుగా తిరుగాడ సాగాయి. అతడు మైదానంలో కూర్చొని ఆలోచిస్తూ కొంత విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకొనటానికి ప్రయత్నించాడు. చివరకు కూర్చున్న చోటు నుండి లేచి ఇరుప్రక్కలున్న క్షేత్రాలను నిశితంగా పరిశీలించి, తన మిత్రునకు అన్ని వివరాలు చెప్పగా, అతడు ఆశ్చర్యానికి లోనైపోయాడు. ఎందుకనగా అతనికి ఈ ప్రదేశం ఇంతకు ముందే బాగా తెలుసు. అతడు 'డికెన్సు చెప్పింది నూటికి నూరుశాతం నిజాలని తేల్చాడు. అయితే ఆశ్చర్యకర విషయ మేమంటే, చార్లెస్ డికెన్సు తన జీవితంలో మొదటిసారి ఈ 'ఇటలీ'కి రావడం మరి ఇటువంటి, ఎన్నడూ చూడనటు వంటి, తెలియిన క్షేత్రం గురించి, ఇంతకు క్రితం చూసిన జ్ఞాపకాలు ఈనాడు కలగటం గురించి అడిగిన వారికి డికెన్సు "మొదటగా రోడ్డు ప్రక్కన ఉన్న దృశ్యాలను చూసిన తరువాత ఈ క్షేత్రంలోని అన్ని దృశ్యాలు సహజంగానే నా స్మృతిపథంలో సినిమా ఫిల్మ్‌లాగా కనిపించసాగాయని" చెప్పాడు.

1960లో ఫిరోజ్‌పూర్ (పంజాబ్)లోని 'నూర్‌పూర్' గ్రామంలో పునర్జన్మ గురించి ఒక సంఘటన జరిగింది. ఫిరోజ్ పూర్ నగరానికి 10 మైళ్ళదూరంలో 'నూర్‌పూర్' అనే గ్రామంలో ఒక బ్రాహ్మణ కుటుంబంలో ఒక బాలుడు జన్మించాడు. తండ్రి సుందర్‌లాల్‌గారు గ్రామంలోని శివాలయంలో అర్చకుడు. పిల్లవానికి $2^1/_2$ సంవత్సరాలు వచ్చిన తరువాత స్కూలుకు వెళతానని తండ్రి వద్ద గోల చేయటం మొదలు పెట్టాడు. కుతూహలంతో సుందర్‌లాల్ ఆ గ్రామంలోని పాఠశాలలో చేర్చాడు. కొన్ని రోజుల్లోనే 'రమేష్' పేరున్న ఈ కుర్రవాడు మంచిపేరు తెచ్చుకున్నాడు. ఇతర పిల్లలు గురువుగారడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పలేనప్పుడు, ఇతడు వెంటనే వాటికి సరైన జవాబులు ఇచ్చేవాడు. తన తరగతిలో అతనిదే ప్రథమ స్థానం. 15 సంవత్సరాల వయసులోనే భగవద్గీత, రామాయణం, మహాభారతంలో పాండిత్యం సంపాదించి, వాటిని చక్కగా ప్రవచనం చేయసాగాడు, విన్న శ్రోతలు ఆశ్చర్యపోయేవారు. ఈ రమేష్ 3 సంవత్సరాల వయస్సున్నప్పటి నుండి తాను గుజరాత్‌లోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టానని చెప్తూ ఉండేవాడు. "వెనుకటి జన్మలో నేను ఆ బ్రాహ్మణ కుటుంబం లోని వ్యక్తినని, ఆ రోజుల్లో అక్కడక్కడ భాగవత కథను సభల్లో వినిపించేవాడినని, ఒక రోజు రోడ్డు ప్రమాదంలో నేను మృత్యు వాత పడ్డానని, దాని తరువాత నేను ఇక్కడ జన్మించానని" చెప్పేవాడు. రమేష్ చెప్పిన అడ్రసు ప్రకారం వెళ్ళి విచారణ చేయగా, అతను చెప్పినవన్నీ సత్యాలేనని తేలింది. ఆ గుజరాతీ పరివార సభ్యులు, దీన్ని ఒప్పుకొని, కొన్ని సంవత్సరాల వెనుక తమ కుటుంబంలోని ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు చెప్పారు.

కొన్నికొన్నిసార్లు నికృష్టకర్మల కారణంగా మానవులు పక్షులుగా లేక జంతువులుగా కూడా జన్మించవచ్చు. ఇది కూడా వారి సూక్ష్మ సంస్కారం, ఆ జీవాత్మను వదలక, వారు వెనుకటి జన్మలో చేసిన పాపకర్మల అనుసారం ఇటువంటి యోనులలో కూడా జన్మించుటమనేది స్పష్టంగా కనబడుతుంది. 'కైరెకస్'లోని చిలుక జన్మ, ఇంకా 'జోహన్స్‌బర్గ్' లో జన్మించిన ఒక కోతిపై జన్మలకు చక్కటి ఉదాహరణలు. అవి తమ అద్భుత ప్రవర్తన ద్వారా అక్కడి ప్రజలను విస్మయంలో ముంచి, ఆకర్షించేవి.

'క్యూబా' దేశంలోని 'కైరెకస్' అనే ప్రాంతంలో అక్కడి ప్రజలు ఒక చిలుక గురించి చెప్పుకునేవారు. సామ్యవాదం కొరకు పోరాడుతున్న కమ్యూనిస్టు ఉగ్రవాదైన 'ఫీడెల్ కాస్ట్రో'ని సమర్థించే గెరిల్లావాదులకు ఈ చిలుక "హుర్రా" అని పలుకుతూ ఉత్సాహపరుస్తూ ఉండేది. అలాగే వారు జరుపు ఆందోళనల కార్యాలలో ప్రోత్సాహాన్నిస్తూ, తనకు వీలైన సహాయం ఇస్తూ ఉండేది. స్థానీయ ప్రజలు చెప్పేది ఈ పక్షి (చిలుక) సామ్యవాది గెరిల్లాలకు క్యూబా భాషలో స్పష్టమైన

**కష్టాలను ఎదిరించి ముందుకు సాగటమే సజ్జనుల నైజం**

ఆదేశాలతోపాటు, మార్గదర్శనం కూడా చేస్తుంటుందని అనుకొనేవారు. ఈ చిలుకతో విసిగిపోయిన అక్కడి ప్రభుత్వం వారు 'కైరెకస్' నుండి 278 మైళ్ళదూరంలోని ఒక నగరంలో ఈ చిలుకను బందీగా ఉంచారు. అక్కడ ఈ చిలుకకు దుర్గుణాలు వదులుటకు, సద్గుణాలను నేర్పటానికి ప్రయత్నాలు సాగేవి. అయితే చేసిన ప్రయత్నాలు ఏవీ సఫలం కాలేదు.

కొన్ని సంవత్సరాల క్రితం ఆఫ్రికాలోని 'జోహాన్స్‌బర్గ్'లో ఒక పరిశ్రమలకు సంబంధించిన ఫార్మ్ వద్ద ఒక కోతి ఉండేది. ఈ కోతిని ప్రజలు 'సాండో' అని ముద్దుగా పిలుచుకొనే వారు. ఈ ఫార్మ్ యజమాని 'ఆల్బర్టో' కి పశుపాలనంటే ఎంతో ఇష్టం. ఆ కారణం చేత ఫారంలోనే ఒక చిన్న పశు శాలను నిర్మించి, దానిలో గొఱ్ఱెలను, మేకలను, ఆవులను ఉంచాడు. వీటిపాలన పోషణ కొరకు ఒక నౌకరును ఏర్పాటు చేశాడు. ఈ కోతి బాధ్యత కూడా అతనికి అప్పగించాడు.

నౌకరు పశువులను త్రిప్పటానికి బయటకు తోలుకు పోయేటప్పుడు ఈ కోతిని కూడా తనతోపాటు తీసుకుపోయే వాడు. కొన్ని రోజులకు మెల్లిమెల్లిగా కోతికి పశువులను కాయు పని అభ్యాసం అయింది. ఒకరోజు ఏదో అవసరం వచ్చి, నౌకరు తన గ్రామానికి వెళ్ళాడు. ఆ రోజు ఈ కోతి ఎవరిని అడగకుండానే సకాలంలో గొఱ్ఱెలను, మేకలను శాల నుండి బయటకు మేత కొరకు తీసుకుపోయింది. రోజంతా వాటిని మేపింది. అది కేవలం పశువులను తిప్పి, తీసుకొని రావటం అనేది ఒక తెలివైన పశువుల కాపరివంటి భూమికను నెరవేర్చటం జరిగింది. ఎప్పుడైనా తప్పిపోయిన వాటిని వెదికి తిరిగి మందలోకి చేర్చటమే గాక, ఒక చోట పచ్చిక అయిపోతే, పచ్చిక బాగా ఉండే చోటికి మందను మళ్ళించేది. తిరిగి సరైన సమయంలో ప్రతిరోజు పశువులను ఇంటికి తోలుకు వచ్చేది.

ఒకరోజు ఇంటికి చేరిన తరువాత, ఒక మేకకున్న రెండు పిల్లల్లో ఒకటి తల్లిపాలను తాగుతుంటే, రెండవ పిల్ల ఆడుకుంటూ ఉన్నది. మొదటి పిల్ల ఒక్కటే తల్లి పాలనంతటిని త్రాగటం గమనించిన 'సాండో' దాన్ని పట్టుకొని దూరంగా ఉంచి, రెండవ పిల్లను లాక్కొచ్చి మేకపాలను తాగించేందుకు తల్లి మేక వద్ద వదిలింది. ఒకరోజు రెండు కూనలు తల్లి యొక్క రెండు రొమ్ములతో పాలు తాగేందుకు రెంటిని వదిలింది. ఈ సంఘటనను చూచిన 'ఆల్బర్టో' ఎంతో ఆనందించాడు. ఆ రోజు నుండి నౌకరును వేరే పనికి వినియోగించి, పశువులను త్రిప్పే పనిని 'సాండో' కి అప్పగించాడు. ఈవిధంగా 14 సంవత్సరాలపాటు 'సాండో' పేరున్న ఆ కోతి సేవలందించింది.

ఇది తన ప్రతిభతో పరివారంలోని వారి మనస్సు జయించ గలిగింది. ఇంత ఉన్నతమైన ప్రతిభ ఆ కోతికి ఎందుకు ఎలా లభించింది? జీవ వైజ్ఞానికుల వద్ద దీనికి ఎటువంటి జవాబు లేదు.

'సాండో' విషయంలో ప్రజలంతా "ఈ కోతి వెనుక జన్మలో ఎక్కడో పశువుల కాపరిగా ఉండి, ఆ జన్మలో చేసిన ఏదో చెడ్డ పని కారణంగా ఈ జన్మలో, జీవాత్మకి కోతి శరీరం ప్రాప్తించి ఉండవచ్చుని" విశ్వసించేవారు.

పునర్జన్మ గొప్పదనం గురించి గీతాచార్యుడు ఇలా అన్నాడు.

**"యత్ర తం బుద్ధి సంయోగం లభతే పౌర్వదైహికమ్"**

అనగా ఆత్మ మొదటి శరీరంలో సంగ్రహించుకున్న బుద్ధి సంయోగం అనగా బుద్ధి యొక్క సంస్కారాలు తదుపరి జన్మలో అనాయాసంగానే ప్రాప్తించగలవు.

ఈ విధంగా పైన పేర్కొన్న అన్ని సంఘటనలు దీనినే సమర్థిస్తున్నాయి. "జీవనం అనంతం" దీనికి ఎటువంటి హద్దు లేదు. ఒక శరీరం నశించిన పిదప, జీవాత్మ రెండవ శరీరం స్వీకరిస్తుంది. తన పూర్వ జన్మలోని కర్మఫలితాన్ని అనుభవిస్తుంది. కర్మఫల ఆధారం మీదనే దాని జన్మ, జాతి, ఆయువు నిర్ణయమవుతుంది. ఈ సందర్భంలో 'పతంజలి' ఋషి తన యోగదర్శనంలో ఇలా అన్నారు.

**క్లేశ మూలః కర్మాశయో దృష్టా-దృష్ట జన్మవేదనీయః**
**సతిమూలే తద్విపాకో జాత్యాయుర్భోగాః ॥**

అర్థం: అన్ని రకాల క్లేశాల మూలంలో జీవి ద్వారా చేయబడిన కర్మయే ప్రధానమైనది. దాని ద్వారానే అతని జాతి, ఆయువు లేక సుఖ-దుఃఖాల నిర్ధారణ జరుగుతుంది.

మనం మన మరుసటి జన్మని సంస్కరించుకోవాలను కుంటే, ఆ ప్రయత్నం ఈ జీవితం నుండే ప్రారంభించవలసి ఉంటుంది. ఆచరణ, వ్యవహారం, కర్తృత్వంలో కలిపి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తయారు చేసుకోగలిగితే, మనిషిలోనే 'దైవత్వం' ప్రకటితమవుతుందని చెప్పుట జరిగింది.

*– అఖండజ్యోతి, ఆగస్టు 1985*
*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**ఏదీ సాధించకపోతే జీవితానికి అర్థం లేదు**

సమాజ నిర్మాణం

# విపరీత కామవాసనలతో భయంకర దుష్పరిణామాలు

వివాహం కాగానే యవ్వనవంతులైన యువతీ యువకుల మధ్య వైవాహిక సంబంధానికి సంపూర్ణ స్వేచ్ఛ లభిస్తుంది. కానీ వారిరువురు తమ మధ్య ఒక ప్రతిబంధం ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. ఆ ఏర్పాటు తామిరువురు "పతివ్రత -పత్నీవ్రత" మర్యాదలను అతిక్రమించకుండా గౌరవప్రదమైన దాంపత్యజీవనం సాగించగలమని, ఎప్పుడు సంతానం కావాలనే కోర్కె ఇరువురిలో సమానంగా కలిగినప్పుడే అందుకు ఉపక్రమించాలి. అప్పటివరకు ఇరువురు నవ్వుతూ-వినోదిస్తూ-హాస-పరిహాసాలవంటి సంతోషకరమైన వాతావరణంలో వినోదిస్తూ తమ ప్రేమ ప్రదర్శన ఉద్దేశ్యాన్ని పూర్తి చేసుకోగలగాలి. స్నేహ, సహయోగాలవంటి దినచర్య ఏర్పాటు చేసుకొని దాంపత్యజీవితాన్ని ఉల్లాస-ఉత్సాహాలతో నింపుకోగలగాలి.

ఈ సృష్టిలోని జీవ జంతువులన్నీ ఈ మర్యాదలను పాటిస్తాయి. వాటిలో అధికాంశం సంవత్సరానికొకసారి మాత్రమే సంతానం కొరకు కలయిక జరుపుకుంటాయి. బుద్ధి-జ్ఞానం వాటికి లేకపోయినా ప్రకృతి అనుశాసనాన్ని పాటిస్తూ, ప్రక్కప్రక్కనే కలసి జీవిస్తున్నా మర్యాదను దాటవు.

కేవలం మానవుడు మాత్రమే ఈ క్రమాన్ని ఉల్లంఘిస్తున్నాడు. వైవాహిక పవిత్ర సంబంధాన్ని మనోరంజక విషయంగా మార్చుకొంటున్నాడు. సంతాన సాఫల్యం కొరకు మాత్రమే శారీరక కలయికను వీలున్నంత వరకు చాలా తక్కువగా ఉపయోగించాలి. అది కూడా తన భాగస్వామి అంగీకారంతోనే జరగాలి. దీన్ని ఉల్లంఘిస్తే ఆరోగ్యం పాడవుతుంది. తేజస్సు, సౌందర్యం తగ్గిపోయి జీవనీశక్తికి కొరత ఏర్పడగలదు. ఇతరులతో శారీరిక సంబంధం ఏర్పరచుకుని విశృంఖలంగా ప్రవర్తిస్తే లైంగికరోగాల బారిన తప్పక పడగలరు. ఇదేగాక ఈ అనాచారాన్ని గమనించేవాళ్ళు, వినేవాళ్ళ మనస్సులు వికలమైపోగలవు. ఈవిధంగా ఆ విశృంఖలత పెరిగి తమ పరివారానికే గాక పూర్తి సమాజ జీవనం మీద కూడా దాని ప్రభావం పడగలదు. తమ సంతానం మీద కూడా చెడు ప్రభావం పడుతుంది. అక్రమ సంబంధంతో లైంగిక రోగాలు ప్రతిఫలంగా లభిస్తాయి. ఆ రోగాలకు సరైన చికిత్స కూడా లభించకపోవచ్చు. ఇలా సుఖరోగాల పాలైనవారు తమకు పుట్టబోయే సంతానానికి కూడా ఈ వ్యాధులు సోకి, వారి వంశపరంపర మొత్తం ఈ వ్యాధితో శాపగ్రస్తులుగా మారిపోగలరు. వ్యభిచారి-వ్యభిచారిణులు క్రమంగా ఈ సుఖవ్యాధుల బారిన పడటం కనిపిస్తుంది. ఏ సమాజంలో విచ్చలవిడి శృంగారపు స్వేచ్ఛ ఉంటుందో అటువంటి వారి జీవితాల్లో సందేహం, అవిశ్వాసంతోపాటు సమాజమంతా కలహాల కేంద్రంగా మారిపోగలదు. దానితోపాటు ఈ భయంకర రోగ పరంపర వేగంగా విస్తరించి దోషులతోపాటు నిర్దోషులు కూడా వీటి పంజాలో ఇరుక్కుంటారు. పాశ్చాత్యదేశాల్లో ఈ జాడ్యం విపరీతంగా పెరిగిపోయింది. ఎందుకంటే అక్కడి వారు దాంపత్య మర్యాదలు అనివార్యమని భావించరు.

మొదటి ప్రపంచ యుద్ధంలో యువకులు, ప్రౌఢులు చాలా పెద్ద సంఖ్యలో మరణించుట జరిగింది. దాని ఫలితంగా అక్కడ ప్రజలలో భావనాత్మకంగా, ఆర్థికపరంగా పెద్ద కుదుపు తగిలింది. స్త్రీలతో పోల్చుకుంటే పురుషుల సంఖ్య చాలా తక్కువైంది. అనాథ స్త్రీలకు సంసార పోషణ ఒక పెద్ద సమస్యగా ఎదుట నిలచింది. అంతేగాక వీరు భావనాత్మక సహయోగపు కొరతను కూడా అనుభవించవలసి వచ్చింది. ఈ రెండు సమస్యల కారణంగా వారికి లైంగిక స్వేచ్ఛ కొరకు అవకాశం ఏర్పడింది. దాంపత్య మర్యాదలు పాటించటం ప్రజలు మాని వేశారు.

ఇటువంటి దుష్పరిణామాల ఫలితంగా లైంగిక రోగాలు వ్యాపించడం జరిగింది. రహస్యాంగాల చర్మం చిట్లుట, దురదలు, పుండ్లు లేచుట ఇంకా వీర్య స్కలనం వంటి సామాన్య రోగాల నుండి, మహా రోగాల వరకు విస్తరించు రోగాలను సుఖరోగాలని అంటారు. అవే సిఫిలిస్ రోగాలు చిన్న రోగాలను మనిషి ఏదో విధంగా ఓర్చుకుంటాడు కానీ 'సిఫిలిస్' వంటి రోగాలను దాచటం కుదరదు. ఇందులో వ్యాధి ముదిరితే దాదాపుగా కుష్ఠు రోగంలాగా మారిపోతుంది. ఈ వ్యాధితో జననాంగానికి 'కొరుకుడు' వ్యాధి సోకి కుళ్ళిపోవటం మొదలవగానే, ఆ రోగ క్రిములు రక్తంలో చేరి అభివృద్ధి చెంది శరీరం మొత్తం పెద్ద వ్రణంగా మారిపోతుంది. ఇటువంటి సుఖ రోగాలు ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తాయి. నిర్దోషులు ఏమరుపాటుతో ఉంటే ఈ సంక్రమిక రోగాల బారిన పడి, ఈ అగ్నిలో కాలిపోతారు.

**లక్ష్యం లేని జీవితానికి విలువ ఉండదు**

1914 నుండి ప్రారంభమై 1919 వరకు సాగిన మొదటి ప్రపంచ యుద్ధం యూరప్ దేశాలలో జరిగింది. యుద్ధం ముగిసిన తరువాత ఇతర సమస్యలతోపాటు అదనంగా వ్యభిచారం విచ్చలవిడి శృంగారంగా మారింది. దాంతో లైంగిక రోగాలు బాగా విస్తరించాయి. దీని దుష్పరిణామం గమనించిన వారంతా ఇంటువంటి రోగులను యమదూతలుగా భావించి, తమ ప్రాణాలు నిలుపుకొనే భయంతో, ఆ రోగుల నుండి చాలా దూరాలకు వేరేగా వెళ్ళిపోవటం జరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధభేరి మోగింది. ఇది కూడా అదే పాత పరిస్థితులకు కొత్త ప్రాణం ఇచ్చింది. ఈ మధ్యలో మరొక కొత్త వ్యసనం 'స్వలింగ సంపర్కం' ప్రబలమగుట మొదలైంది. మగవారు–మగవారితో, స్త్రీలు–స్త్రీలతో తమ విశృంఖల శృంగారానికి తెరలేపారు. ఇది ఇంతకు క్రితం వ్యాపించిన 'సుఖరోగాలు' లాగా విజృంభించకపోయినా, ఏదో తృప్తి లభించి, ఆ వ్యసన అలవాటుకు బానిసలైపోతున్నారు.

ఈ విధమైన అప్రాకృతిక వ్యసనం కారణంగా మరొక కొత్త రోగం 'ఎయిడ్స్ (AIDS)' రూపంలో విస్తరించుట ప్రారంభ మైంది. దీని పూర్తి పేరు "ఎక్వార్డ్ ఇమ్యూనో డెఫిసిఎన్సీ సిండ్రోమ్".

ఈ రోగం వచ్చిన రోగి తన నరాల శక్తిని, జ్ఞాన నాడీ శక్తిని క్రమేపీ పోగొట్టుకొంటూ, కొన్ని వారాలలోనే పక్షవాత పీడుతునిగా, అంగహీనుడుగా మారి కొద్ది సమయంలోనే మృత్యువుపాలైపోతాడు. ఒక విధంగా ఆ రోగికి మంచే జరిగినట్లు భావించాలి. ఎందుకనగా ఆ రోగంతో ఎక్కువ కాలం బాధపడకుండానే త్వరగా విముక్తి లభిస్తుంది. చికిత్సకు ఎక్కువ వ్యయం చేయు అవసరం లేకనే, పరలోకానికి టిక్కెట్ లభిస్తుంది.

వెనుకటి కాలంలో 'సిఫిలిస్' వ్యాధి యూరప్ దేశాల వరకు మాత్రమే పరిమితమై ఉండేది. ఆ రోజుల్లో రాకపోకల సౌకర్యాలు కొంతవరకు మాత్రమే ఉండేవి. ఉద్యోగాలు, పర్యటనలు కూడా ఇంత ఎక్కువగా ఉండేవి కాదు. ఆ కారణంగా ఈ 'సిఫిలిస్' ఇతర దేశాలకు వ్యాపించలేదు. ఆ తరువాత జరిగిన యుద్ధాల కారణంగా ఈ వ్యాధి విస్తరణ జరిగింది. కానీ ఇప్పుడు మూడవ ప్రపంచ యుద్ధం జరగక పోయినా, ఎక్కడో ఒకచోట చిన్న చిన్న పోరులు మాత్రమే జరుగుతున్నాయి. అయితే సంపన్నవర్గ ప్రజలు కొత్త ప్రదేశాలకు పర్యటనార్థం, ఇంకా కొత్త కొత్త వ్యసనాలను తీర్చుకునేందుకు గాను రాకపోకలు ఇతర దేశాలకు విపరీతంగా పెరిగి పోవటంతో, వారి ద్వారా ఈ కొత్త 'ఎయిడ్స్' రోగం క్రమంగా ప్రపంచమంతటా వ్యాప్తి చెందింది. ఈ రోగం ఆసియా దేశాలను కూడా తన వశంలోనికి తెచ్చుకొంది. ముఖ్యంగా సింగపూర్, థాయిలాండ్ ముఖ్య వాణిజ్య కేంద్రాలుగా మారినందున వాణిజ్యంతోపాటు వ్యభిచారానికి కూడా అవి కేంద్ర ప్రదేశాలు అయ్యాయి. ఇందుకు లభించే ప్రతిఫలం స్పష్టం. అక్కడ నుండి ఈ రోగ బీజాలు తీసుకొన్న వ్యక్తులు తమ ప్రాంతాలకు తిరిగి వచ్చి, తమ పరివారానికి, ఇతర పరిసర వ్యక్తులకు ఈ రోగాలను ఫలహారంగా పంచుతున్నారు.

ఈ వ్యాధి, ప్లేగు, కలరా వ్యాధుల్లాగా ఎంతో వేగంగా వ్యాపించదు. దీని లక్షణాలు కూడా స్పష్టంగా బైటకు కనిపించవు. నెత్తిపైకి చేరిన జలం క్రిందకు జారినట్లు, వస్త్రాల ఫ్యాషన్లు త్వరత్వరగా మారే విధంగా ఈరోగ వ్యాప్తి కూడా చిత్రవిచిత్ర రూపంలో వస్తుంది. వెనుకటి కాలంలో సుఖ రోగాలు, నపుంసకతతోపాటు, దుర్గంధపూరిత స్రావాల రూపంలో ఉత్పత్తి అయ్యేది. ఇవి వాపులుగా, కొరుకుడు రోగంగా, సుఖరోగాలుండేవి. వీటిని ఆపేందుకు కొంత ఉపాయాల ద్వారా రోగ నివారణ ప్రయత్నం జరిగే సమయం లోనే, మరొక కొత్త రోగం 'ఎయిడ్స్' రూపంలో ఎదురైంది. ఇది ప్రపంచం నలుమూలలకు ప్రస్తుతం చేరిపోయింది. ప్రస్తుతం ఈ రోగమున్న రోగుల సంఖ్య లక్షలు దాటి కోట్ల సంఖ్యకు చేరిపోయింది. ఇంతవరకు ఈ రోగానికి సరైన ఔషధం తెలుసుకోబడలేదు. పరిశోధన ద్వారా ఔషధాన్ని కనిపెట్టే లోపు దీని ఉద్దండ విస్తరణ కారణంగా, మరొక కొత్త రోగరూపాన్ని ధరించి ఎదురవవచ్చు.

ఈ ఆధునిక 'ఎయిడ్స్' రోగ నియంత్రణ ఎప్పుడు జరుగుతుంది? దీనికి జవాబు ఒక్కటే. దాంపత్య జీవితాన్ని సదాచారమని నమ్మి, పురాతన దాంపత్య పరంపరను తిరిగి అవలంబించి, కుటుంబాన్ని స్వర్గమయంగా మార్చుకొనుటకు ప్రయత్నించనంతవరకు ఈ క్షేత్రంలో నరకం వంటి అనేక వ్యధలు–వేదనలు నుండి విముక్తి లభించనేరదు. ఇటువంటి అభిశాపాలలో 'ఎయిడ్స్' వంటి సుఖరోగాల అభివృద్ధి నిరంతరంగా సాగుతూనే ఉంటుంది. మనం మన దుష్కార్యాల ప్రతిఫలాన్ని మన చేతులలో మనమే అనుభవించవలసి ఉంటుంది.

*– అఖండజ్యోతి, ఆగస్టు 1985*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**లక్ష్యం సాధించాలనే తపన ఉండాలేగాని సాధనములు అన్నీ లేకపోయినా లక్ష్యాన్ని సాధిస్తారు**

# మానవేతర ప్రాణులు మానవునికి ఏ విషయంలోను తీసిపోవు

సృష్టిలోని జీవకోటిలో తానే మహామేధావినని, ఇంక ఏ ఇతర ప్రాణికి ఏ విధమైన ప్రత్యేకత భగవంతుడు ప్రసాదించలేదని మానవుడు విర్రవీగరాదు. సృష్టిలోని మూగజీవాలు కూడా ఏదో ఒక విధమైన అతీంద్రియ శక్తులను కలిగి ఉన్నాయన్న విషయాన్ని మరచిపోరాదు.

మానవుడు గ్రహణాల గురించిన జ్ఞానం అనేక సంవత్సరాల క్రితమే తన బుద్ధిబలంతో గ్రహించాడు. కానీ వాటివలన కలిగే దుష్పరిణామాలను తెలుసుకోవడంలో ఇప్పటికీ అసమర్థుడుగానే ఉండిపోయాడు. కానీ పశుపక్ష్యాదులు సూర్య గ్రహణాన్ని గురించి 24 గంటలు ముందుగానే పసిగడతాయి. అంతేకాదు దానివల్ల కలిగే దుష్పరిణామాల నుండి రక్షించుకోవడానికి శబ్దాలను చేయడం మాని వేస్తాయి (మౌనం వహిస్తాయి). చిలిపితనానికి మారుపేరుగా చెప్పుకునే కోతులు కూడా సూర్య గ్రహణానికి కొన్ని గంటల ముందుగానే తినడం-త్రాగడంవంటి వానిని మాని వేస్తాయి. ఏకాంతంగా ఒక మునీశ్వరుని పాత్రను పోషిస్తాయి.

జపానులోని 'చీవీ' అనే పక్షులు భూకంపం రావడానికి 24 గంటలు ముందుగానే తమ నివాసాన్ని వదిలి దూరంగా ఎగిరి పోతాయి. అదేవిధంగా చైనాలోని ఆవులు, ఎద్దులు మొదలైన పెంపుడు జంతువులు భూకంపం రాబోతోందని గ్రహించి తమ తమ పలుపు త్రాళ్ళను త్రెంచుకుని బయటకు దూరంగా పారిపోతాయి. ఈ విషయాన్ని అనేకమార్లు ప్రత్యక్షంగా చూడడం జరిగింది. ఇప్పటికీ మానవుడు రాబోయే భూకంపాన్ని 24 గంటలు ముందుగా పసికట్టడంలో అసమర్థుడే.

ఎత్తైన కొండల మీద నివసించే పక్షులు మంచుగడ్డలు విరిగి పడడాన్ని నెలరోజులు ముందుగానే పసిగడతాయి. వెంటనే కొండలను వదిలేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోతాయి. మానవుడు మంచుతుఫాన్ల ప్రమాదాన్ని పసిగట్టగల సమర్థతను ఇప్పటికీ సాధించలేకపోయాడు. హఠాత్తుగా దొర్లిపడే మంచును గురించి పక్షులు నెలరోజులు ముందుగానే గ్రహిస్తాయి. దూర ప్రాంతాలకు తరలిపోతాయి. దీనినే 'మైగ్రేషన్' అంటారు.

టిబెట్, డార్జిలింగ్ ప్రాంతాలలోని కొండలమీద అందమైన పెద్ద పక్షులు నివసిస్తాయి. 10-15 నిమిషాల్లో వర్షం వస్తుందనగా పర్వత గుహల్లో కాని, కొండల మీది బండల క్రిందగాని చేరి రక్షణను కల్పించుకుంటాయి. అది గమనించిన టిబెట్ వాసులు మూట-ముల్లె సర్దేసుకుని వర్షం నుండి రక్షించుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఒక్కొక్కసారి ఆకాశంలో మేఘాలుగాని, ఉరుములు -మెరుపులు గాని లేకుండానే వర్షం వచ్చేస్తుంది. అయినా సరే పక్షులు దాక్కోవడం చూస్తే చాలు వారికి వర్షం రాబోతోందని అర్థం అయిపోతుంది. వెంటనే తమ జాగ్రత్తలో తాముంటారు.

సముద్రంలో ఉండే చేపల భవిష్యజ్ఞానం వింటే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. అవి అహర్నిశలు సముద్రంలోని అలలను గమనిస్తూ ఉంటాయి. అలలు తగ్గిపోయి, ఇప్పట్లో పైకి లేవవు అనే విషయాన్ని గుర్తించగలుగుతాయి. సరిగ్గా అదే సమయంలో తమ వంశాభివృద్ధి కోసం గ్రుడ్లు పెడతాయి. వాటి అంచనాలలో ఒక్క నిమిషం తేడా వచ్చినా అవి పెట్టే గ్రుడ్లు సముద్రంలో కొట్టుకుపోతాయి. వీటి భవిష్యజ్ఞానాన్ని పరిశీలించే నిమిత్తం శాస్త్రవేత్తలు కొన్ని ప్రయోగాలు చేశారు. ఆ చేపలను చెరువులలోను, సరస్సులలోను, ప్రయోగశాలలలోను ఉంచారు. కృత్రిమ వెలుగును, కృత్రిమ చీకటిని సృష్టించారు. కృత్రిమంగా చంద్రుని కూడా సృష్టించి ఆకర్షించుకునే ప్రయత్నం చేశారు. కానీ ప్రకృతిని ప్రేమిస్తూ, ప్రకృతిలో జీవించే ఆ చేపలను ఏమాత్రం భ్రమలో పడవేయలేకపోయారు. అవి సరిగ్గా అదే సమయానికి అంటే సముద్రంలోని చేపలు గ్రుడ్లుపెట్టే సమయంలోనే ఇక్కడ అవి గ్రుడ్లు పెట్టాయి. అంటే అక్కడ సముద్రంలో అలలు తగ్గిన సమయంలోనే ఇక్కడి చేపలు కూడా గ్రుడ్లు పెట్టాయి. వాటి విధానంలో లక్షల సంవత్సరాలు గడచినా ఏ మాత్రం మార్పు లేదు. అవి వాటి విధానాన్ని మార్చుకుని ఉంటే ఇప్పటికి వాటి వంశమే లేకుండా పోయేది.

శాస్త్రవేత్తలు పక్షిరాజైన నెమలి దినచర్యను కూడా లోతుగా పరిశీలించారు. నెమళ్ళు మేఘాలను చూస్తే చాలు, ఒక విధమైన సంగీత ధ్వనులను వ్యక్తం చేస్తూ ఆనందపడతాయి. అయితే భయంకరమైన వర్షం వస్తుందని పసిగట్టగానే పెద్దగా అరుస్తూ పిచ్చివాని మాదిరి అటూ ఇటూ పరుగులు తీస్తుంటాయి. ఇది మానవునికి ఒక విధమైన హెచ్చరిక అనుకోవచ్చు. ఋతువులో రాబోతున్న ఈ పరిణామాన్ని మానవుడు నూటికి నూరుపాళ్ళు గ్రహించే స్థితిలో లేడని అర్థం అవుతోంది. నెమళ్ళు చెప్పే ఈ భవిష్యవాణి ద్వారా విపరీతాలు ఉత్పన్నం కాబోతున్నాయని అర్థం చేసుకుంటున్నాడు. ప్రస్తుతానికి మానవుని స్థానం అదే.

*- అఖండజ్యోతి, మార్చి 1984*

*అనువాదం: పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**జీవితంలో ఒడిదుడుకులు లేకుండా ఉండాలంటే కుదరదు**

బోధ కథ

# పూర్ణత్వమనే మార్గంలోకి నడిచిన పూర్ణ

రాజగృహ నగరభూమి, ఆరోజులలో తథాగతుని చరణ స్పర్శతో పావనమవుతూ ఉండేది. భగవానులు ఇక్కడ ఒక మామిడితోటలో వేంచేసి ఉన్నారు. ప్రతిదినం స్వామియొక్క అమృతవాక్కులతో ధన్యులవుతుండే భిక్షుసంఘ సభ్యులు కొంతమందికూడా వారితో ఉన్నారు. రాజగృహ నగర ప్రజలు కూడా భగవానుని సాన్నిధ్యం వలన కలిగే మేలును పొందటానికి నిత్యం వస్తుంటారు. అయితే ప్రాపంచిక జీవితములోని అనేకమైన సమస్యలు, రకరకాలైన ప్రలోభాలు వారిని అప్పుడప్పుడూ ఆ వనానికి రానీయకుండా అడ్డుపడేవి. ఈరోజు శారదా పూర్ణిమ కావటముచేత నగరంలో జరుగుతున్న మహోత్సవము సందర్భముగా ఎక్కువమంది ప్రజలు భగవానుని సన్నిధికి రాలేకపోయారు.

యువతీ యువకుల కేరింతలతో నగరవీధులన్నీ ప్రతిధ్వనిస్తున్నాయి. ఈ ఉత్సవము నేలమీదనేకాక, నింగిలోకూడా జరుగుతున్నదా అన్నంత ఉల్లాసపూర్వకముగా ఉన్నది ఆనాటి వాతావరణము. మబ్బులు లేని వినీలాకాశములో సంపూర్ణమైన వెండి వెలుగులను విరజిమ్ముతూ, తన శోభాయాత్రను ప్రారంభించాడు వెన్నెలరాజైన చంద్రుడు. ఆయనకూడా తళుకు బెళుకుల తారకల సముదాయములో పరివేష్ఠించబడి ఉన్నాడు. ఇంతేకాదు శరత్‌పూర్ణిమ మహోత్సవ సందర్భముగా తన యొక్క వెన్నెల ఖజానానుండి వెన్నెలను దోసిళ్ళతో ప్రజలపై విరజిమ్ము తున్నాడు. చంద్రునిచే వర్షించబడుతున్న ఈ వెన్నెల నగర వీధులలోనే కాదు, స్వామి నివసిస్తున్న ఈ మామిడి తోటలోను జాలువారుతున్నది. నగరప్రజలు ఈనాటి వెన్నెల వెల్లువను తమ హాసవిలాసాలకు ఉత్ప్రేరకముగా భావిస్తుంటే, అక్కడ భిక్షుసంఘ సభ్యుల దృష్టిలో దాని అర్థము భిన్నముగా ఉన్నది. నిర్మలమైన హృదయాలనుండి వెలువడే నిరంతరధారగా లేక సంపదగా వారు దీనిని భావించారు.

పూర్ణకు భిక్షుసంఘ సభ్యుల మనోభావాల గురించి తెలియదు. ఆమెకు జీవితములో గీటురాళ్ళు వేరే ఉన్నాయి. జీవితము అంటే ఆమె దృష్టిలో డబ్బు, కీర్తి, అనుభవించడం ఈ మూడూ మాత్రమే!

ఎంతో రూపవతియైన ఆమెకు తన సౌందర్యముపట్ల చాలా గర్వంగా ఉండేది. తన సౌందర్యమునకు మరింత మెఱుగులు పెట్టుకోవడమే ఆమెకు జీవిత లక్ష్యముగా ఉండేది. తనయొక్క నూతన శృంగారముతో ప్రజలను ఆశ్చర్యచకితులను చేయటమే ఆమెకు తృప్తి కలిగించే అంశము. ఈరోజు ఆమె మరింత అందముగా ప్రత్యేకముగా అలంకరించుకొని యౌవనముతో కాంతులీనుతూ రూపుదాల్చిన సౌందర్యమా అన్నట్లు మంద గమనముతో తన గదిలో తిరుగుతున్నది. రతీదేవివంటి కమనీయ సౌందర్యముతో పూర్ణ ఈరోజు తన ప్రియుని కోసము ఎదురుచూస్తున్నది. ఆమె హావభావాలన్నీ కూడా ఇదే సందేశమును తెలియజేస్తున్నాయి.

ఎదురుచూపులతో వ్యాకులమైన పూర్ణ దృష్టి, బుద్ధ భగవానుడు తన శిష్యగణముతో పరివేష్ఠించి ఉన్న ఆ మామిడి తోటపై పడింది. కొంతమంది శిష్యులు శాంతపూర్ణమైన హృదయాలతో స్థిరముగా కూర్చుని, కొందరు నిలబడి, మరికొందరు అటూఇటూ తిరుగుతూ ఉండటము ఆమెకు గోచరించినది. 'ఇంత ప్రొద్దుపోయి, రాత్రివేళ వీరంతా ఏమి చేస్తున్నట్లు? ఎందుకు మేలుకొని ఉన్నారు?' అని ఆమె ఆలోచించింది.

'నేనయితే నా ప్రియునికోసము వేచి ఉన్నాను. నేను మేల్కొని ఉండటానికి కారణము విరహములోని వ్యాకులత. కానీ వీరంతా ఎవరికోసము ఎదురుచూస్తున్నారు? ఎవరి కోసము వ్యాకులపడుతున్నారు?' అనుకుంటూ ఆమె ఒక కుటిల పూర్ణమైన నవ్వు నవ్వుకొంది. 'ఆ! అందరూ భ్రష్టులు, వంచకులు, మోసగాండ్రు! వీరుకూడా తమతమ ప్రేయసీ ప్రియుల కోసం వేచి ఉన్నారు. లేకుంటే ఇంత రాత్రివేళ మేల్కొని ఉండవల్సిన అవసరమేమున్నది?' అనుకున్నది లోలోపల.

వెటకారపూరితమైన ఆమె హృదయగత మనోభావాలను తెలుసుకొనగలిగిన అంతర్యామియైన భగవానుడు మరుసటి ఉదయము ఆమె ఇంటికే భిక్షకు వచ్చారు. ఆమెకు చాలా ఆశ్చర్యముగా అనిపించినది. 'ఓహో! ఈయన ఇక్కడికి ఎందుకు

**జీవితంలో అన్నీ సులభంగా సమకూరితే వాటికి విలువ ఉండదు**

వచ్చాడో!' అని ఒక్కక్షణము ఆలోచించింది. మోసగాళ్ళకు గురువైన ఇతడుకూడా మోసగాడే అయి ఉండాలి.' వెంటనే అక్కడినుండి పారిపోదామనుకున్నది. కానీ ఎదురుగా శాంతముద్రలో నిలబడి ఉన్న వ్యక్తి ఆమెను పారిపోనీయలేదు. తిరస్కరించాలని అనుకున్నా, ఆమె తిరస్కరించలేకపోయింది. మొదట కొంతసేపు మౌనంగా నిలబడినా, చివరకు ఏదో విధముగా తనను సంబాళించుకొని స్వామికి భిక్ష నివేదించినది.

బుద్ధభగవానుడు ఎంతో ప్రసన్నముగా ఆమె నివేదించిన భోజనమును స్వీకరించినాడు. భోజనము అయిన తరువాత ఆయన 'పూర్ణా! మా బౌద్ధభిక్షువులను నీవు ఎందుకు నిందిస్తావు?' అని అడిగారు. భగవానుని యొక్క ఈ ప్రశ్న విని ఆమె అవాక్కయ్యింది. మనసులోని తొట్రుపాటు ముఖముపై ద్యోతకమైనది. తను ఎవ్వరితోను తన మనస్సులోని మాటలు చెప్పలేదే అనుకున్నది.

'నింద ఏమిటి స్వామి? నేను ఎప్పుడూ ఎవ్వరినీ నిందించలేదే!' అన్నది. 'రాత్రి నీవు భిక్షువులను గురించి ఆలోచించినదానిని గురించే అడుగుతున్నాను' అన్నారు స్వామి. చిరునవ్వుతో మరల హెచ్చరించారు. తథాగతుని వాక్కులకు పూర్ణ ఎంతో సిగ్గుపడింది. కానీ తను అనుకున్న సమస్త విషయముల గురించి వివరించినది. బుద్ధభగవానుడు ఆమె చెప్పినదంతా విని 'పూర్ణా! నీవు దుఃఖముతో నిద్రించలేక పోయావు. మా భిక్షువులు ఆనందముతో నిద్రించలేక పోయారు. నువ్వు రకరకాలైన ఆలోచనల వలన, మనో వికారాల వలన నిద్రించలేదు. మా భిక్షువులు ధ్యానం చేస్తూ ఉండటము వలన నిద్రించలేదు. వారు నిర్వికారస్థితిలో, ధ్యాన మగ్నులై ఉండటము వలన నిద్రించలేకపోయారు' అని చెప్తూ ఉండగా తథాగతుని ముఖమండలము తేజోవంతమైనది. వారు ఇంకా ఈవిధముగా అన్నారు, 'పూర్ణా! నిద్రకు-నిద్రకు మధ్య తేడా ఉన్నది. ఈవిధముగానే మెలకువ (జాగరణ)కు, మెలకువకు మధ్య కూడా భేదమున్నది. ఈ క్రొత్తదైన జాగరణను (మేల్కొనుటను) నేర్చుకో! దీనివల్ల నీవు ఎంతో పొందగలవు. ఇంతకు ముందు నీవు మేల్కొన్నదంతా వ్యర్థమైన జాగరణ.'

దీనితోపాటే వారు ఈ క్రింది ధర్మగాథను కూడా వినిపించారు.

**'సదా జాగరణమానానం అహోరత్తాను సికినం ।**
**నిచ్చానం అధిముత్తానం అత్థం గచ్ఛన్తి ఆసవా ॥'**

'ఎవరైతే ఎల్లప్పుడూ జాగరూకులై ఉండి, రేయింబవళ్ళు నేర్చుకుంటూ ఉంటారో, మోక్షమును పొందటమే లక్ష్యముగా చేసుకుంటారో, వారియొక్క కషాయకల్మషములన్నీ తొలగి పోతాయి' అని పై శ్లోకమునకు అర్థము.

భగవానుని ముఖతః ఈ ధర్మగాథను విన్న పూర్ణకు అంతవరకు ఆవరించి ఉన్న గాఢనిద్ర చెదరిపోయింది. ప్రాయశ్చిత్తము తాలూకు వేదన, జ్ఞానము పొందాలనే ఆత్రుత ఒక్కసారిగా ఆమె కన్నులలో తొంగిచూశాయి. భావవిహ్వలయై ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది కానీ, ఱెప్పవేయకుండా తథాగతుని వైపు చూస్తున్నది. ఆమెలో వచ్చిన మార్పును గమనించిన స్వామి, తన కరుణామృతమును ఆమెపై వర్షిస్తూ తను చెప్పిన వాక్యాలలోని అంతరార్థమును వివరిస్తూ ఇలా చెప్పారు.

'తనయొక్క లక్ష్యముపట్ల సమర్పణ భావము కలిగినవారే జాగరూకులు (మేల్కొన్నవారు)! సంపూర్ణమైన శిష్యత్వము కలిగినవారు నేర్చుకొనటానికి ఎప్పుడూ బద్ధకించరు. వారు రాత్రైనా, పగలైనా, ఉదయాస్తమయాలైనా, తనవారైనా, పరాయి వారైనా, స్నేహితులు, శత్రువులు ఎవరైనాసరే, ఎవరైనా తనను ప్రేమించినా, ద్వేషించినా, నిందించినా, గౌరవించినా ప్రతి క్షణము ప్రతివ్యక్తినుండి నేర్చుకుంటూనే ఉంటారు. ప్రతిదానిని తనకు అనుగుణముగా మార్చుకోగలిగే నేర్పు ఉన్నవారు మోక్షమునే తమ లక్ష్యముగా ఏర్పరచుకుంటారు. మనస్సు శరీరాల హద్దులు దాటి సర్వవ్యాపకమైన చేతనత్వములో లీనము కావటానికి, తమ జీవితమనే బిందువును సముద్రంలో జారవిడవటానికీ ఎవరైతే ఉత్సుకత కలిగి ఉంటారో వారు ఈ జీవితమనే ఘోరతిమిరమును దాటగలరు!'

ప్రభువు యొక్క వాక్కు విన్న పూర్ణ పూర్ణత్వమనే మార్గము వైపుకు మళ్ళింది. ఆమెతోపాటు ఇంకా అనేకమంది వ్యక్తుల పాదాలు ఈ మార్గములో నడవటానికి ఉత్సాహముగా ముందుకు సాగాయి.

*- అఖండజ్యోతి, సెప్టెంబరు 2004*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**చిక్కులు ఎదురైతేనే మన సామర్థ్యం తెలుస్తోంది**

# ఆధ్యాత్మికత యొక్క మొదటి పాఠం-కర్మయోగం-2

*గత సంచికలో పండిత శ్రీరామశర్మ ఆచార్యులవారు తమ చారిత్రకమైన ప్రబోధములో 'ఆధ్యాత్మికత యొక్క ప్రథమపాఠము కర్మయోగముతో ప్రారంభమౌతుందని, అదే ఆధ్యాత్మికతకు ప్రథమసోపానమని' చెప్పారు. కర్మయోగమనగా ప్రయత్నము-పురుషార్థముల యొక్క మారుపేరే తప్ప మరేమీ కాదు. స్వామీరామతీర్థ జపానుయాత్రను ఉదహరిస్తూ 'జపానుదేశము యావత్ప్రపంచమునకు మకుటాయమైన కిరీటముగా భాసిల్లటానికి ముఖ్యకారణము ఆ దేశవాసుల కర్మయోగమే' అని పరమపూజ్యగురుదేవులు చెప్తున్నారు. అంధకారమనే జడత్వములో కూరుకుపోయున్న అసంఖ్యాకమైన ఈ దేశప్రజలకు ప్రేరణనందిస్తూ యుగఋషియైన పూజ్యగురుదేవులు 'భగవంతుడు ఏర్పరచిన నీతి నియమాలను, విధించిన కట్టుబాట్లను అర్థము చేసుకొనటము ఎంతో అవసరము. 'భగవంతుడిని అర్థము చేసుకున్నవారు, కర్మయోగులు మాత్రమే ఆయన అనుగ్రహానికి పాత్రులు కాగలరు అని తెలుసుకుంటారు' అని వివరిస్తున్నారు. రండి! యుగఋషి తేజోవంతమైన వాక్కులను హృదయంగమము చేసుకుందాము!*



### భగవంతుడి యొక్క మొదటి పాఠము - కర్మయోగము

భగవంతునికి సంబంధించిన మూడు అంశాలున్నాయి. అందులో ఒకటి కర్మయోగం. ఎప్పుడైనాసరే మన యొక్క భౌతిక అవసరముల కొరకు మనము కర్మయోగులం కావాలి. కష్టపడి పనిచెయ్యాలి. కష్టపడి పనిచెయ్యటానికి అలవాటు పడగలిగితే కోరుకున్న వస్తువును పొందగలుగుతాము. మీ ఆరోగ్యము దెబ్బ తిన్నదనుకోండి. దానికి మందు ఎలా వస్తుంది? **శరీరమును సరియైన రీతిలో ఉపయోగించుకొనడము ద్వారా, కష్టపడి పనిచెయ్యడము ద్వారా మీ ఆరోగ్యమును చక్కపరచుకొనవచ్చు.** దీనికి ఉదాహరణగా ఒక కథ వినండి.

ఒకానొక దేశములో ఒకరాజుగారు ఉన్నాడు. ఆయన ఒకరోజు తన రాజ్యములోని ఒక గ్రామానికి వెళ్ళాడు. ఆ గ్రామప్రజలంతా ఆయనకు ఘనంగా స్వాగతమిచ్చారు. అమాయకులైన ఆ పల్లెవాసులకు వచ్చింది రాజుగారు అనికూడా తెలియదు. అయినప్పటికీ వాళ్ళు తమదైన రీతిలో ఆయనకు మంచి ఆహారమును, పండ్లను సమకూర్చారు. రాజు ఎంతో సంతోషించి 'నేనెవరో మీకు తెలియదు కదా! నేను ఈ దేశపు రాజును' అని ప్రకటించుకున్నాడు. అందుకు ఆ గ్రామప్రజలు 'అయ్యో! మీరు ఈ దేశపురాజు అని తెలిసినట్లయితే మీకు మరింత చక్కని భోజనమును పెట్టేవాళ్ళము' అని నొచ్చుకున్నారు.

'మీ ఆతిథ్యము ఎంతో గొప్పగా ఉన్నది. నాకు చాలా తృప్తిని, సంతోషమును కలిగించారు' అని ఆయన పలికి, ఆయన వారికి ప్రతిగా ఏదైనా మేలు చేయదలచి ఆ గ్రామంలో ఒక మంచి ఆసుపత్రిని కట్టించాడు. అన్నిరకాలైన హంగులతో, వివిధ విభాగాలతో, శస్త్రచికిత్స గదులతో సహా ఆసుపత్రి సిద్ధమయ్యింది. గొప్ప గొప్ప వైద్యులను, నర్సులను అక్కడ నియమించారుకూడా. ఒక ఏడాది గడిచిన తరువాత రాజు ఆసుపత్రి పని తీరును విచారించాలని వైద్యులను పిలిచి మాట్లాడాడు. ఇప్పటివరకు ఒక్క రోగికూడా చికిత్సకోసము ఆసుపత్రికి రాలేదని వైద్యులు చెప్పగా విని ఆయన ఆశ్చర్యచకితుడయ్యాడు. ఆయనకు కొంచెం కోపం కూడా వచ్చింది. తాను స్వయముగా ప్రజల వద్దకు వెళ్ళి 'మీకు అసలు జబ్బు అనేదే చెయ్యదా? చికిత్సకు ఎవ్వరు ఆసుపత్రికి రాకపోవటానికి కారణమేమిటి?' అని ప్రశ్నించాడు.

**'ఆకలి అయినదానికన్నా తక్కువ భుజిస్తాము, ఎక్కువ శ్రమ చేస్తాము. అందుచేత తిన్నది సక్రమముగా జీర్ణమౌతుంది కాబట్టి మాకు జబ్బుచెయ్యటముకాని, చికిత్స చేయించు కొనవలసిన అవసరము కాని ఏర్పడదు'** అని వారు చెప్పిన సమాధానముతో వైద్యులు కూడా ఏకీభవించడముతో ఆయన

**జీవితంలో స్పష్టత ఉంటే ఒత్తిడి అనేది తలెత్తదు**

సంతృప్తిచెందాడు. ఆకలికన్నా తక్కువగా తిని, ఎక్కువగా కష్టపడి పనిచేసేవారికి చెమటరూపములో జబ్బులన్నీ బయటకు వెళ్ళిపోతాయి. కానీ శ్రమ అనే దేవతను మనము దండించి దూరముగా తరిమివేశాము. అందుచేతనే ఈ దేశము దారిద్ర్యం పాలబడింది. 'కష్టపడి పనిచెయ్యటానికి మనము ఇష్టపడము. అందుచేతనే ఈ దేశము దారిద్ర్యమునకు, పేదరికమునకు గురయ్యింది' అని పైన చెప్పబడిన కథద్వారా అర్థము చేసుకున్నపుడు ప్రతి వ్యక్తీ తానే ఒక వైద్యుడు కాగలడు.

## పనిని నిర్లక్ష్యము చెయ్యటమే దారిద్ర్యమునకు కారణము

కష్టపడి పనిచేసేవారిని మనము అదృష్టహీనులుగా, అల్పులుగా భావిస్తాము. అన్యాయార్జితమును తింటూ, చల్ల గాలి తగిలేటట్లు కుర్చీవేసుకుని కూర్చుని విశ్రాంతి తీసుకునే వాడిని సంపన్నుడని, అదృష్టవంతుడని భావిస్తుంటాము. ఇదీ మన భావన. 'నిజానికి అసలైన దరిద్రులెవరు? దారిద్ర్యము ఎక్కడున్నది?' అని ఆలోచించము. ప్రతి మనిషికి పనిచెయ్యడము ఇష్టము ఉండదు. **చెమట చిందించకుండా హాయిగా కాలము గడపటమే గొప్ప అనే స్వభావము కలిగి ఉండటమే దారిద్ర్యమునకు అసలైన కారణము.** మన దేశములో ఈవిధమైన ఆలోచనాధోరణి, మనస్తత్వం ఉన్నంత కాలము ఈ దేశము దారిద్ర్యం నుండి బయటపడదు. మన దేశములోని పిల్లలు 10వ తరగతిలో ఉత్తీర్ణులైనప్పటి నుండి తండ్రితో కలిసి వ్యవసాయము చెయ్యటానికి ఇష్టపడరు. కష్టపడి పొలము పనిచెయ్యడం నామోషీగా భావిస్తుంటారు. ఉన్న ఆ కాస్త పొలమును అమ్మివేసో, కౌలుకిచ్చో పట్టణమునకు వెళ్ళి తక్కువ జీతానికైనాసరే ఉద్యోగము చెయ్యటానికే ఇష్టపడుతుంటారు. ఆ వచ్చే జీతము చాలదు. అయినాసరే ఫరవాలేదు ఎంత వస్తే అంతే చాలు, ఉద్యోగమే చేస్తామంటారు. ఉద్యోగమంటే శారీరిక కష్టము చెయ్యవలసిన అవసరము ఉండదు. 'సార్! అయ్యగారు!' అని పిలిపించుకుంటూ కుర్చీలో కూర్చుని నాలుగు కాగితాల కట్టలను ముందు పెట్టుకుంటే సరిపోతుంది.

నక్కకు మృత్యువు సమీపించినపుడు పిచ్చెక్కినట్లు నీళ్ళలో మునగటానికి పరుగులెత్తుతుంది. ఏదో ఒక నీటిమడుగును చూసి అందులోకి దూకుతుంది. చివరకు మరణిస్తుంది. అదే విధముగా ఈ తరము మనుష్యులు వెఱ్ఱివాళ్ళలాగా పల్లెటూళ్ళను వదిలి రకరకాలైన క్రిమికీటకాలతో, తేమతో, కొంచెము కూడా గాలిచొరని గదులతో, కలుషిత వాతావరణముతో, మాయలు కుతంత్రాలతో కూడిన స్వార్థపరులైన మోసగాండ్రతో నిండిన పట్టణాలలోకి పరుగులుతీస్తున్నారు. స్వచ్ఛమైన, నిర్మలమైన తాజా గాలితో కూడిన పల్లెలను వదిలి తాతతండ్రులవలె చెమటోడ్చి వ్యవసాయం చెయ్యకుండా, ఒళ్ళు కదలకుండా కుర్చీలో కూర్చుని చేసే ఉద్యోగముకోసం పట్టణాలను చేరుకుంటున్నారు.

శ్రమచేసేవారిని, కష్టపడి పనిచేసే చాకలి, కమ్మరి వంటి వృత్తిపనివారిని మనము తక్కువగా చూస్తాము. తాపీ మేస్త్రీలు, వడ్రంగులు, చెప్పులుకుట్టేవారు ఇలా రాత్రింబవళ్ళు కాయ కష్టము చేసేవాళ్ళను మనము హీనముగా చూస్తున్నాము. మనకు ఏమయింది? పనిపట్ల, శ్రమపట్ల చిన్నచూపు ఏర్పడటం వలన ఘోరమైన అంధకారం అలుముకుంది. అంతెందుకు, మనం అమ్మాయికి వివాహము చేసేటప్పుడు అత్తవారింట్లో అమ్మాయికి కష్టము కలిగించే పనులున్నాయా అని తెలుసుకుని మరీ చేస్తాము. అమ్మాయికి పిండి విసరటము, ఇల్లు చిమ్మటము, పేడ ఎత్తడమువంటి పనులు ఉండకూడదు. మరి ఎలాంటి ఇల్లు కావాలి? మంచము మీద కూర్చుని మహారాణిలాగా పెత్తనము చేస్తూ, వంట చెయ్యటానికి, గిన్నెలు కడగటానికి, ఇల్లు చిమ్మటానికి ఇలా ప్రతిపనికీ మనుషులు ఉండే ఇంట్లోకి అమ్మాయిని పంపించటానికి విశ్వప్రయత్నాలు చేస్తాము. మా అమ్మాయి ఎంతో అదృష్టవంతురాలు, ఆగర్భ శ్రీమంతుల ఇంట్లోకి అడుగుపెట్టిందని చెప్పుకుని మురిసి పోతుంటాము. కానీ ఇది కర్మరాహిత్యానికి, దారిద్ర్యానికి ప్రతీక అని గుర్తించలేము. ఫలితముగా ప్రతి కాన్పుకి అమ్మాయికి శస్త్రచికిత్స చేయవలసివస్తుంది. ప్రతినెలలో ఎన్నెన్నో మందులు తీసుకొనవలసివస్తుంది. చివరకు శరీరము ఎంతో దెబ్బ తింటుంది. ఇదేనా అదృష్టమంటే?

## ఆధ్యాత్మికత యొక్క మొదటి లక్షణము - సమృద్ధి

ఇలాంటి మానసిక ప్రవృత్తులు మన దేశములో వేళ్ళూను కున్నాయి. ఇవి మన దారిద్ర్యమునకు చిహ్నములు. ఈ చిహ్నములను సమూలముగా నాశనము చెయ్యటం మన కర్తవ్యము. మన దేశములో సమృద్ధిని సాధించాలంటే మొదట ఈ దారిద్ర్యమునకు చెందిన చిహ్నములను మనము తొలగించి వెయ్యాలి. సమృద్ధి ఆధ్యాత్మికత యొక్క ప్రథమ లక్షణము. మీరు పెట్టినది మేము తినడము కాదు. మేము మీకు తినిపించాలి, అది వేరే విషయము. ఆధ్యాత్మికవేత్తలు పేదవారు కావచ్చు, కానీ దరిద్రులు కారు. దారిద్ర్యానికి, పేదరికానికి తేడా ఉన్నది. సంపాదించగలిగే అర్హత, సామర్థ్యములు పుష్కలంగా ఉండి, సంపాదిస్తూకూడా స్వయముగా తాను

**అప్పుడప్పుడు మౌనవ్రతమే ఆయుధం అవుతుంది**

తినడు ఇతరులకు పెట్టని వానిని దరిద్రుడు అంటారు. చాలా మందికి ఈ అలవాటే నచ్చుతుంది. తానే ఆకలిగా ఉన్నవాడు ఇతరులకు ఏమి తినిపించగలడు, ఏ సహాయము చెయ్యగలడు? కాబట్టి మనిషి ముందుగా తాను సమృద్ధిని పొంది ఉండటం అనేది ఆధ్యాత్మికతకు మొదటి మెట్టుగా తెలుసుకోవాలి. **తాను తినడము కన్నా ఇతరులకు తినిపించాలనే కోరిక ఉన్న వ్యక్తిని సాధువు అంటారు.** సాధువులు చాలా ప్రసన్నముగా ఉంటారు. వారు మానసికంగా అభివృద్ధిని సాధించగలరు.

ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌గారికి నెలకు 500 రూపాయల వేతనముతో ఉద్యోగము దొరికింది. ఆయన తన కుటుంబ సభ్యులను పిలిచి కేవలము 50 రూపాయలు మాత్రమే ఇంటి ఖర్చులకు ఉపయోగించి, మిగిలిన 450 రూపాయలను చదువు కొనటానికి కనీసము పుస్తకాలు, కలము కూడా కొనలేని స్థితిలో ఉన్న పేద విద్యార్థులకు పంచిపెడదామని' చెప్పారు. అదే విధముగా ప్రతినెలా 450 రూపాయలను పేద విద్యార్థులకై వినియోగించారుకూడా.

### త్యాగము, కరుణ, ఔదార్యములకు ప్రతిరూపమే సాధువులు

సంపాదించే డబ్బులో అధికభాగము పేదలకు ఖర్చుచేసి తాను పేదరికమును అనుభవించిన ఈశ్వరచంద్ర విద్యాసాగర్ మీ దృష్టిలో పెద్ద మూర్ఖుడు, పిచ్చివాడు. మీ తెలివితేటలు ఆయనకు ఉండి ఉంటే తనకు వచ్చే 500 రూపాయలతో పాటు ఇంకొక 500 రూపాయలు కూడా సంపాదించేవాడు.

మనము మన సంపాదన, మన పిత్రార్జితములే కాకుండా దేవుడి డబ్బు, గురువుల డబ్బుకూడా తినాలని కోరుకుంటాము. ఎంత తిన్నా మన పొట్ట నిండదు! ఎందుకంటే మన తృష్ణలు, కోరికలు పసిపిల్లలకన్నా అధికముగా ఉంటాయి. మనము ఎంత సంపాదించినా ఇతరులకు ఇవ్వటానికిగాని, ఖర్చు చెయ్యటానికిగాని ఇష్టము ఉండదు. కానీ సాధువులు అలా కాదు, వాళ్ళకు ఉన్నదంతా ఇతరులకు పంచిపెట్టడము వలన పేదవారు అవుతారేమో కానీ దరిద్రులు మాత్రము కారు. వారి వద్దకు వెళ్ళిన తరువాత మనుష్యులలో ఎంతటి మార్పు వస్తుందో ఊహించలేము. చాణక్యుని వద్దకు వెళ్ళిన చంద్ర గుప్తుడు, సమర్థగురురామదాసు వద్దకు వెళ్ళిన శివాజీ, రామకృష్ణపరమహంసను చేరిన వివేకానందుడు ఎలా తయారయ్యారు? మహాత్ముల వద్దకు వెళ్ళిన బాబూ రాజేంద్ర ప్రసాద్, జవహర్‌లాల్, రాధాకృష్ణన్ మొదలైనవారు ఎంతటి ఉన్నతస్థాయికి చేరుకున్నారు? సాధువులైన వ్యక్తులకు నాయకులు, సంపన్నులు కావలసిన అవసరము ఉండదు.

సాధువుల అంతరంగములో తాము సంపాదించగలమనే శక్తి, విశ్వాసము ఉంటాయి. మానవుడిని జ్ఞానిగా, వివేకవంతునిగా, ఉదారునిగా, త్యాగిగా, దయామయునిగా, పరోపకారిగా తీర్చిదిద్దగలిగేదే 'ఆధ్యాత్మికత'! భారతదేశము తమోగుణమనే ఘోర అంధకారములో పడి ఉన్నదని స్వామి వివేకానందుడు అమెరికాలో చెప్పిన మాటలు నూటికి నూరు పాళ్ళు యథార్థమైనవి. ఎందుకంటే మన లోపల 'సక్రియత' అనేది ఏమాత్రము అభివృద్ధి చెందలేదు.

### మానవునికి మూడు శరీరములు ఉంటాయి

మానవునికి ఉన్న మూడు శరీరములలో స్థూలశరీరము మొదటిది. దీనిలో శ్రమరూపములో శక్తులు బయట పడతాయి. శ్రమ చెయ్యడము ద్వారా సంపద ఉత్పన్నమౌతుంది. రెండవది జ్ఞానముతో ముడిపడి, మనిషికి స్వర్గప్రాప్తిని కలుగజేసే సూక్ష్మ శరీరము. మూడవది జీవాత్మ, అంటే మన అంతరంగము. దీనినే మనము కారణశరీరము అంటాము. కారణశరీరము వికసించినప్పుడు మన ఆత్మ-పరమాత్మతో సంబంధమును పొందగలుగుతుంది. ఆత్మ-పరమాత్మల మధ్య ఇచ్చిపుచ్చు కొనడంలాంటి సంబంధము స్థాపితమౌతుంది. ఆత్మయొక్క సంపద పరమాత్మవైపు-పరమాత్మ యొక్క సంపద ఆత్మవైపు ప్రవహించడము ప్రారంభమవుతాయి. రెండూ ఏకీకృతమైపోతాయి. పిల్లకాలువ గంగానదిలో కలిసినప్పుడు అవి రెండూ విడదీయలేని విధముగా ఏకమైపోతాయి. అదేవిధముగా ఆత్మ వికసించినప్పుడు భగవంతునికి-భక్తునికి మధ్య తేడా ఏమీ ఉండదు. ఇది చాలా ఉన్నతమైన స్థితి.

ఇవన్నీ మీకు ఇప్పుడే చెప్పడము వల్ల, చదివించడము వల్ల ప్రయోజనమేముంటుంది? మీ కోర్కెలు, మహత్వా కాంక్షలు, అభిరుచులు ఏమిటో మాకు తెలుసు. మీరు డబ్బుతప్ప దేనినీ కోరుకోరు. ఇంకా చెప్పాలంటే ప్రాపంచికమైన డబ్బును, కీర్తిని, ఆరోగ్యమును కోరుకుంటారు. ఇవన్నీ మొదటి తరగతి విద్యార్థికి సంబంధించిన అంశములు. ఆధ్మాత్మికతను గురించి చెప్పవలసిన మొదటి తరగతి విద్యార్థికి ముందుగా కర్మ యోగమును నేర్పించాలి. తద్వారా మీరు ధనవంతులు కాగలరు. **సంపన్నుడు కావాలంటే ముందర పనిచేసే విధానమును అంటే కర్మయోగమును నేర్చుకోవాలి.**

*- అఖండజ్యోతి, ఆగస్టు 2013*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

గెలిచామా ఓడామా అనేది ముఖ్యం కాదు. ప్రయత్నం చేశామా లేదా అనేదే ముఖ్యం

నా వారితో నా మాట

# యుద్ధం మనుషులతో కాదు, ప్రవృత్తులతో



### ఈ మహా సంగ్రామం ఉజ్జ్వల భవిష్యత్తు తేవడం కోసమే

21వ శతాబ్దంలో ఒక్కో సంవత్సరం గడిచి పోతూనే ఉన్నది. మనం ఉజ్జ్వల భవిష్యత్తు వైపుకు ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నాం. అదే నిష్పత్తిలో దాని కోసం చేస్తున్న సంగ్రామం తీవ్రతరం అవుతున్నది. అయితే ఈ యుద్ధం మనుషులతో కాదు, ప్రవృత్తులతో అని గుర్తుపెట్టు కోవాలి. కలుషితమైన ప్రవృత్తులున్నంత కాలం మనుషులు కానీ, సమూహాలు కానీ విరోధులే అవుతారు. అవే ప్రవృత్తులు పరిశుద్ధంగా, సాత్వికంగా మారిన వెంటనే వారు శ్రేయోభిలాషులు, సహచరులుగా మారిపోతారు. ఈ విధంగా మెల్లిమెల్లిగా విరోధుల వ్యూహం చెదిరిపోయి, సృజన సైనికుల సైన్యం సుదృఢమవుతుంది. గురుదేవులు మొదటి నుండి మనకిదే నేర్పిస్తూ వచ్చారు. అంతేకాదు, ఈ సంగ్రామం జరిగే కురుక్షేత్రం అత్యంత విశాలమైనదని కూడా చెప్తూ వచ్చారు. ఇది మన మనసు, ఇంటి గడప నుండి మొదలుకుని సమాజం, దేశ సరిహద్దులు దాటుకుంటూ సంపూర్ణ మానవత్వమంతా విస్తరించి ఉన్నది. మనం కోరుకునే ఉజ్జ్వల భవిష్యత్తు ఒక వ్యక్తి కోసమో, ఒక జాతి కోసమో కాదు, సంపూర్ణ మానవాళి కోసం.

మనిషిలో దైవత్వం ఉదయించాలి, పృథ్విపై స్వర్గం అవతరించాలి అన్నదే మన ధ్యేయం. ఈ లక్ష్యానికి అనుగుణంగా మనలో ప్రతి ఒక్కరూ ఈ మహాసంగ్రామం యొక్క ఆలోచనా సరళిని అర్థం చేసుకోవాలి. సృజన సైనికులందరి జీవితం ఒక సంగ్రామమే. దీనినే మన జీవన నిర్వచనంగా ఎన్నుకోవాలి, అనుభవించాలి. ఎందరో వ్యక్తులు, ప్రవృత్తులు, పరిస్థితులు, ఆటంకాలు మనకు ఎదురవుతాయి. వాటన్నిటినీ ఎదిరించడం తప్ప వేరే మార్గం లేదు. ధైర్యంగా ముందుకు సాగడం, ప్రాణాలు పణంగా పెట్టే సైనికుల మానసిక స్థితి, ఈ యుద్ధానికి కూడా కావాలి. మనమెక్కడున్నా, ఎక్కడ పని చేస్తున్నా అక్కడ సమస్యలంటూ ఉంటాయి. వాటి సమాధానాలు వెతకటంలోనే మన పురుషార్థం, ధైర్యం, కౌశలం నిరూపించబడతాయి. అక్కడి అవసరాలు, వాటి సేకరణలో ఎదురయ్యే కష్టాలు, అడ్డంకులను ఎదుర్కోవడమే ఈ సంఘర్షణ.

### సంఘర్షణ లేకుండా జీవితంలో సౌభాగ్యమెలా కలుగుతుంది?

దుష్ప్రవృత్తుల ఉన్మూలనలో చాలా కష్టాలు ఉన్నాయనేది నిజమే. కాని వాటన్నిటినీ ఎదుర్కోకుండా సత్ప్రవృత్తుల సంవర్ధన ఎలా సాధ్యమవుతుంది? అయినా, కష్టాలు లేని, వైఫల్యాలు లేని, సరళమైన సౌకర్యవంతమైన జీవితం ఎవరో నిర్భాగ్యులకు మాత్రమే దక్కుతుంది. అలాంటి జీవితమంటే, కళావిహీనమైన బ్రతుకు శాపంగా తగిలిందను కోవాలి. ప్రశాంతంగా, విశ్రాంతిగా బ్రతికే వారి జీవితంలో ప్రతిభ సన్నగిల్లుతూనే ఉంటుంది. ఇలాంటి ఖరీదైన సుఖ శాంతులు కొనుక్కునే వారు నష్టాలపాలవుతారు. తన పెద్ద కొడుకు ఇలాంటి జీవితం గడపడం ఈశ్వరుడికి ఇష్టం లేదు. అందుకే సమస్యను పరిష్కరించే సామర్థ్యంతో కూడిన జీవితాన్ని ప్రసాదించి ప్రాపంచిక క్షేత్రంలో అడుగడుగునా సంఘర్షణ చేయడానికి పంపించాడు. ఈ రోజుల్లో ఇటువంటి సమర్థ వంతమైన మానవీయ ప్రతిభ చాలా అవసరం.

సమస్యలని చూసి భయపడి పారిపోయే వాళ్ళకి కాదు ఈ ఉజ్జ్వల భవిష్యత్తు. అలా ముఖం చాటేసుకునే వారికి తగ్గ స్థలమే లేదు. ఇంటిని వదిలేసి అడవులు పట్టి పోదామనుకునే వారికి ఒక చెడు వార్త, అడవులు ఎక్కువగా మిగిలిలేవు. ఆ మిగిలిన కొన్నిట్లో ఉండాలన్నా, అక్కడ బతకాలన్నా పడవలసిన శ్రమ కుటుంబాన్ని పోషించడానికన్నా చాలా ఎక్కువ. గుంపులో బ్రతకడం కష్టమే కాని, ఒంటరిగా బ్రతకడం ఇంకా కష్టం. ఏకాంత జీవితం ప్రశాంతమైనది అని ఊహిస్తాం, అనుభవిస్తే కానీ తెలీదు. ఏకాంతంగా ఉండవలసి వచ్చిన వాళ్ళు కూడా పరుగు పరుగున సమూహంలోకి రావలసి వస్తుంది.

**ప్రయత్నిస్తూ మరణిస్తే గెలిచినట్లే లెక్క**

## నేటి యుగధర్మం

నిజానికి గుంపు, ఏకాంతం రెండూ 'అతి' అనే చెప్పాలి. సంతులిత సామాజిక జీవితమే సరైనది. సమస్యలున్న మాట నిజమే. అయితే? తెలివి, పరాక్రమాన్ని సమాధానం కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలి. సర్వతోముఖ ప్రగతికి కావలసిన సద్గుణాలు అప్పుడే వికసిస్తాయి. తత్వాలను అర్థం చేసుకోవాలి. మానవత్వ ఉజ్జ్వల భవిష్యత్తు కోసం మొదలుపెట్టిన మహా సంగ్రామంలో నిలకడగా నిలిచే వీర సైనికుల భూమికను నిర్వర్తించేందుకు కటిబద్ధులై ఉండాలి. ఇదే ఇప్పటి యుగధర్మం. ఇదే మహాకాలుని సంకల్పం. దీనినే మన సంకల్పంగా చేసుకోవాలి.

ఈ పనిలో రాబోయే కష్టాలకు భయపడడం, ఇబ్బందులకు బెదరడం అనవసరం. ఆందోళనతో ఏం సాధించగలం? ఆ భగవంతుడు, గురుదేవులు మనకు అప్పచెప్పిన బాధ్యతను వదిలేసి ప్రశాంతత కోసం వెతుకుతాం. యుద్ధరంగాన్ని వదిలి పారిపోయి, సురక్షిత స్థలాన్ని వెతుక్కుంటూ పోతాం. ఇలా చేయచ్చు, కానీ ఎందుకు పుట్టామో ఆ ప్రయోజనం నెరవేరదు, మహాకాలుని సహచరులుగా ఎందుకు మారామో అది పూర్తి కాకపోతే ఆత్మగ్లాని పాలవుతాము. అయినా జీవితంలో ప్రగతి కావాలంటే సంఘర్షణ అవసరం. ఎవరికైనా సహకరించాలన్నా, ఆత్మరక్షణకైనా, సంపాదనకైనా సంఘర్షణ ఒక్కటే సమాధానం. రైతులు భూమితో, విద్యార్థులు పుస్తకాలతో, శ్రామికులు మెషీన్లతో, ఆలోచనాపరులు సమస్యలతో పెనగులాడక తప్పదు.

మానవ శరీరంలో గుండె, కిడ్నీలు, కాలేయం, పేగులు, మెదడు మొదలైన అన్ని అవయవాలు క్షణం తీరిక లేకుండా పని చేస్తూనే ఉంటాయి. బ్రతికుండడానికి, మృత్యువును దూరంగా నెట్టడానికి, నిరంతరంగా సంఘర్షణ సలుపుతూనే ఉంటాయి. రక్తంలోని తెల్లకణాలు విషాణువులతో, విజాతీయ ద్రవ్యాలతో తలపడడానికి ప్రతిక్షణం నడుం బిగించి ఉండవల సిందే. ఏ కాస్త జాప్యం చేసినా రోగాలు, దౌర్బల్యం, అకాల మృత్యువులాంటి భయంకర ఆక్రమణలు మొదలవుతాయి. జీవితంలో స్థిరత్వం ఉండదు. లోపల, బయట వచ్చే అసంఖ్యాకమైన సమస్యలకు సమాధానాలు ఒకేసారి శతావధానుల్లాగా ఇవ్వడానికి మెదడు చురుకుగా, సిద్ధంగా ఉంటుంది.

## న దైన్యం, న పలాయనం

మహాభారత సంగ్రామం ఆగిపోవాలి, లేదా వదిలి పారిపోవాలి అనుకున్నాడు అర్జునుడు. అలా చేసి నువ్వు ఎక్కడా ప్రశాంతంగా ఉండలేవని శ్రీకృష్ణభగవానుడు వారిస్తాడు. పాపాన్ని మనం నాశనం చేయకపోతే, అధర్మాన్ని, అవినీతిని ఎదురించకపోతే, ఏ అవరోధాలు లేకపోవడం వలన అవి మన సామాజిక వ్యవస్థనే నాశనం చేస్తాయి. బ్రతికున్నాళ్ళు సుఖం, చనిపోయాక స్వర్గప్రాప్తి అనే ఉభయ లాభాలను వివరిస్తూ లేచి నిలబడమని ఉపదేశించాడు. ఏకాగ్రత కోల్పోయినప్పుడు, 'యుద్ధాయ కృతనిశ్చయః' అని నిర్దేశించాడు, అంటే ఖచ్చితంగా యుద్ధం చేసి తీరాలి. మన మార్గదర్శకులు కూడా మన నుండి ఇదే ఆశిస్తున్నారు. పిరికితనాన్ని వదిలేసి ఈ యుగపు మహాసంగ్రామానికి నడుం బిగించమని ఆదేశించారు.

బుజ్జగించడం, సౌమ్యంగా వ్యవహరించే నీతి ఎప్పుడూ గెలవదు. సారవంతమైన భూమిలోనే అందమైన వనాన్ని ప్రేమతో అభివృద్ధి చేయవచ్చు. దుష్టత్వానికి భయపెట్టే భాషే అర్థమవుతుంది. సామంతో పాటు దండనని కూడా నీతిశాస్త్రం ఒప్పుకుంది. పరశురాముని అవతారంగా నమ్మే గురుగోవింద్ సింగ్ ఆ కాలపు దుర్దశకు సమాజంలోని అందరి పిరికితనమే కారణమని నమ్మారు. ప్రజల్లో ఆక్రోశం మేల్కొంటే తప్ప శౌర్యం, సాహసం మళ్ళీ ప్రతిష్ఠించుకోలేవని, అప్పటి వరకు అణిగి మణిగి ఉండే స్థితి నుండి ఎదిగే అవకాశం లేదని వారు తేల్చారు. ఆయన ప్రజలను సంఘర్షణ చేయమని పురికొల్పారు. భగవంతుడికి అసిధ్వజుడు, మహాలౌహుడు అనే పేర్లిచ్చారు. జండా మీద ఖడ్గం గుర్తుండే దేవుడు 'అసిధ్వజుడు'. ఖడ్గం రూపంలో ప్రతిష్ఠించబడే దేవుని మూర్తి మహాలౌహుడు. సృష్టి ఆరంభం గురించి చర్చిస్తూ, దేవుడు ముందు ఖడ్గాన్ని సృష్టించి, తరువాతే మిగిలినవన్నీ సృష్టించాడని వ్రాసారు.

## బ్రహ్మాస్త్రమైన గాయత్రియే ఆత్మబలం మరియు ఆత్మతేజం

గురుగోవిందుడు చెప్పిన ఖడ్గానికి అభిప్రాయం హింస, నరకటం కాదు. సమర్ధవంతమైన సంఘర్షణకు ప్రతీక. బుద్ధుడు, మహావీరుడు, గాంధీ చెప్పిన అహింసకు కూడా ఇదే అభిప్రాయం. అహింసను చాలాసార్లు పిరికితనంగా భావిస్తారు. కాని దాని అర్థం దానికి పూర్తిగా వ్యతిరేకం. అహింస ఆత్మతేజం. ప్రఖర ఆత్మబల సంపన్నులు మాత్రమే

**గెలుపును మించిన ఆనందం లేదు**

ఈ అమోఘ అస్త్రాన్ని ప్రయోగించగలరు. యుగ సమస్యలు సాధారణ సామర్థ్యంతో సాధనలతో తీరేట్టు కనపడకపోతే ప్రచండ ఆత్మబల సంపన్నులు ఈ అమోఘ అస్త్రాన్ని ప్రయోగిస్తారు. అందుకే గాంధీగారు స్వాతంత్ర సంగ్రామంలో తన అహింసను పిరికితనంగా భావించి తప్పు చేయవద్దని మళ్ళీ మళ్ళీ వారించారు. పరమపూజ్య గురుదేవులు ఈ ఆత్మతేజాన్ని, బ్రహ్మతేజాన్ని గాయత్రి బ్రహ్మాస్త్రంగా పేర్కొన్నారు. ఈ యుగపు సంగ్రామంలో ఇదే అన్నింటికన్నా చాలా అవసరం.

ఆషామాషీగా మాల తిప్పేస్తే ఈ వరం లభించదన్నారు గురుదేవులు. పూజా పునస్కారాలతో కూడా దీనిని సాధించలేం. ఆలోచనలలో సంకీర్ణత పోయి, వ్యాపకత పెరిగి; వ్యక్తిత్వంలో వాసనలు పోయి, భావనాత్మకత పెరిగి; ఆచరణలో స్వార్థం పోయి సేవ ప్రభావం చూపితే ఈ వరం చేజిక్కుతుంది. ఈ ఆత్మతేజస్సు, బ్రహ్మతేజస్సు వికసించగానే మామూలు మనిషి కూడా తనంతటతానే అతి పెద్ద అవరోధాలను పటాపంచలు చేయగలడు. గాంధీగారు కూడా దేశ ప్రజలందరికీ ఇదే నేర్పించారు. ఆంగ్లేయులు దేశం వదిలి వెళ్ళవలసి వచ్చింది. 'చేస్తావా, చస్తావా (do or die)', 'ఆంగ్లేయులు దేశాన్ని వదలండి' ఆందోళనలను ఇదే ప్రభావితం చేసింది.

గురుదేవులు ఈ యుగంలో దీన్ని కొత్తగా నిర్వచించారు. వారి ప్రకారం బ్రాహ్మణ జీవితం, ఋషికర్మలతో ఈ దివ్యశక్తిని పొందవచ్చు. వారు తమ కార్యకర్తలను మళ్ళీ మళ్ళీ వారించారు, సగటు భారతీయుని జీవితం. సామాన్య భారతీయ పౌరుడికి అందుబాటులో లేని సుఖసౌకర్యాలు మనము ఉపయోగించ రాదు. దీనితోనే ఆత్మబలం జాగృతమవుతుంది. సామాన్య పౌరుని ఆత్మబలం మేల్కొంటే శాసనసభను కూడా ఆశ్చర్య పరచవచ్చు.

### ఉజ్జ్వల భవిష్యత్తుకు ఇదే సమర్థ ఆధారం

ఈ సత్యాన్ని అర్థం చేసుకుని, ఒప్పుకుని, విస్తరింపజేసేవారు ఖచ్చితంగా విజేతలవుతారు. మనమా కాదా అనే ప్రశ్న ఇక లేదు. మహాకాలుడు మొదటి పిలుపును మనకే ఇచ్చాడు. కానీ మన పిరికితనం, సంకీర్ణత, కొట్లాటల్లో చిక్కుకుని కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటే పనులేవీ ఆగవు. మనం కాకపోతే ఇంకొకరు చేస్తారు. (Time and tide wait for none) మహా సంగ్రామంలో ఎవరు ఎంత సక్రియంగా ఉంటారన్నదే పరీక్ష. గురుదేవులు పలుమార్లు మనకు ఉపదేశించిన ఈ సంగ్రామ ఆలోచనా సరళినే ఇక్కడ మళ్ళీ మళ్ళీ ప్రచురించి గుర్తుచేసే ప్రయత్నం చేస్తున్నాం.

యుగపరివర్తన మన వాకిట్లో నిలబడి పిలుస్తోంది. సమర్థ రామదాసు, గురుగోవింద్ సింహ్, దయానంద సరస్వతి, వివేకానందుడు, లోకమాన్య తిలక్, మహాత్మాగాంధీ, ఇప్పుడు మనందరి మార్గదర్శనం చేస్తూ గురుదేవులు – అందరూ ఈ యుగవాణినే వినిపించారు. ఇవాళ పెడచెవిన పెడితే మరెప్పుడూ వినిపించదు. మన యుద్ధం మనుషులతో కాదు, ప్రవృత్తులతో. మన జీవితాలతోనే ఇది మొదలుపెట్టాలి. తరువాత మన కుటుంబ సభ్యులు ఈ పరిధిలోకి వస్తారు. ఆ తరువాత సమాజం, నగరం. సృజన సైనికుల సామర్థ్యం నిరంతరం పెంపొందాలి. రాబోయే ప్రతి ఉదయం, మనందరికీ ఉజ్జ్వల భవిష్యత్తును పరిచయం చేసే విధంగా మన సామర్థ్యం, సంఘర్షణ నిరంతరం మరింత తీవ్రతరం అవుతూ ఉండాలి.

*– అఖండజ్యోతి, మార్చి 2014*

*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్*


## శాంతికుంజ్‌లో సంజీవనీ సాధనా శిక్షణా శిబిరము

*01.05.2014 (గురువారము) నుండి 05.05.2014 (సోమవారము) వరకు శాంతికుంజ్, హరిద్వార్‌లో సంజీవని సాధనా శిక్షణా శిబిరము తెలుగుభాషలో నిర్వహించ బడుతుంది. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులై సామాజిక సేవపట్ల మక్కువ కలిగి, స్వచ్ఛందంగా నిస్వార్థ సేవ చేసేవారు దీనికి అర్హులు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కళాకారులు, వ్యాసకర్తలు, విలేఖరులు, వృత్తి నిపుణులు మున్నగువారి స్వచ్ఛంద సేవలు కోరడమైనది. ఉత్సాహవంతులు, పై శిబిరములో పాల్గొని స్వచ్ఛంద సేవకులుగా వారి పేర్లను చేతనా కేంద్రము హైదరాబాద్ నందు నమోదు చేయించుకొన ప్రార్థన.*

*శిక్షణానంతరము వివరములకై గాయత్రీ చేతనా కేంద్రము హైదరాబాద్ వారిని సంప్రదించవలసినదిగా కోరడమైనది. అభిలాష కలిగిన వారు 2014 ఏప్రిల్ 30వ తేది నాటికి శాంతికుంజ్, హరిద్వార్ చేరుకొనవలయును.*

**వివరాలకు సంప్రదించండి:**

**ఫోన్: 040-23700722, 9949111175**


**వాదనలకు దూరంగా ఉండటం మంచిది**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## ఇల్లందులో

గాయత్రీ పరివార్ ఇల్లందు శాఖ, ఖమ్మం జిల్లా వారి సారథ్యంలో స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవాలు కడు వైభవంగా నిర్వహించారు. ఇల్లందు పట్టణంలో ఊరేగింపుగా పురజనుల జాగృతి కార్యక్రమాలు చేపట్టారు.

## ఒంగోలులో

వసంత పంచమి వేడుకల సందర్భంగా ఒంగోలు పట్టణంలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు శ్రీ సరస్వతీ శిశుమందిర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడినవి. 242 మంది చిన్నారులకు అక్షరాభ్యాస సంస్కారం ఒంగోలు గాయత్రీ పరివార్ వారి ఆధ్వర్యంలో శ్రీ బిట్రగుంట సత్యన్నారాయణగారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సరస్వతీ శిశుమందిర్ నిర్వాహకులు తగిన తోడ్పాటునందించారు.

## నెల్లూరులో

నెల్లూరు జిల్లా బి.ఎస్.జి.పి. కన్వీనర్ శ్రీమతి టి.లక్ష్మీ భవాని (భువన) గారి ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమము నెల్లూరులోని పాండురంగ అన్నదాన సమాజ కళ్యాణ మండపమునందు 2014 మార్చి 2వ తేది ఆదివారము రోజున కన్నుల పండువగా నిర్వహించబడినది. 200 మంది విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రదానం జరిగింది. మొత్తం 800 మంది పరిజనులు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా శ్రీటి.రమణమూర్తిగారు 1008 దీపాలతో విరాట్ దీపయజ్ఞమును నెల్లూరు జిల్లా కన్వీనర్ శ్రీ జి. తిరునారాయణగారి ఆధ్వర్యంలో నిర్వహించారు. పై కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా "నెల్లూరు నగర ఎం.ఎల్.ఎ. శ్రీ ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డిగారు, నెల్లూరు జిల్లా కలెక్టర్ శ్రీ ఎన్.శ్రీకాంత్, ఐ.ఎ.ఎస్. గారు, నెల్లూరు చిన్మయామిషన్ ఆచార్య పూజ్యశ్రీ స్వామిని నిర్మలా నందగారు, నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ శ్రీమతి జి.సుభద్రాదేవి గారు, డా॥సి.వి. సుబ్రహ్మణ్యం యం.డి.గారు" విచ్చేసి విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు అమోఘమైన సందేశాలను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసి, ఉత్తేజ పరిచిన ఉపాధ్యాయులకు గురుదేవుల సాహిత్యమును ప్రదానం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో గాయత్రీ పరివార్ సభ్యులు శ్రీమతి పద్మ, శ్రీ పి.వి. సుబ్రహ్మణ్యం, శ్రీ బి.రంగనాథ్, శ్రీ టి. సుబ్రహ్మణ్యం, శ్రీ రమణయ్య, శ్రీ టి.వి.సురేష్‌గార్లు సహాయసహకారాలను అందజేశారు.

## అమలాపురంలో

తేది 04-02-2014న అమలాపురం మండలం అమలాపురం గ్రామంలో శ్రీ గాయత్రీ దివ్య భవ్య సాధనా మందిరము నందు శ్రీ గాయత్రీమాత సాన్నిధ్యంలో శ్రీ రామానందస్వామి ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా ఉత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. 9 రోజుల అనుష్ఠాన కార్యక్రమంగా సామూహిక జపసాధన (1,25,000 జపం జరిగింది). 2000 మంది పరిజనులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భోజన ప్రసాదములు శ్రీ ఆకుల ఆదినారాయణ, శ్రీదేవి గార్లు (ఆలయ నిర్మాణకర్తలు) ఇతర సహాయ సహకారములను అందించారు. సాయంత్రం 6 గంటలకు 1008 దీపాలతో దీపయజ్ఞము నిర్వహించబడింది.

అమలాపురం మండలం రంగాపురం గ్రామంలో శ్రీ గాయత్రి చరణ పీఠము నందు ఎన్.ఆర్.కె. రాజు, సుభద్రగార్ల ఆధ్వర్యంలో సామూహిక జపసాధన నిర్వహించబడింది. 9 రోజుల ఈ జపసాధనలో ప్రతిరోజు 12 మంది పాల్గొన్నారు. జపసంఖ్య 1,10,000. వసంత పంచమి రోజున పూర్ణాహుతి నిర్వహించబడెను.

## ప్రత్తిపాడులో

2014 మార్చి 1,2 తేదీలలో ప్రత్తిపాడు గ్రామ గాయత్రీ పరివార్ శాఖ (గుంటూరు జిల్లా) దశమ వార్షికోత్సవ సందర్భంగా 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞము ఇండియన్ కాన్సెప్ట్ స్కూల్ ప్రాంగణమునందు శ్రీ మదమంచి సుధాకర్‌గారి ఆధ్వర్యంలో శ్రీ వేణుగోపాలరెడ్డిగారి పర్యవేక్షణలో శ్రీ డి.వి.ఆర్.మూర్తి, శ్రీమతి అనసూయమ్మ, శ్రీ పేరిశాస్త్రి గార్లు అత్యంత వైభవంగా నిర్వహించబడింది. వేలాది మంది పరిజనులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు. రూ.5000/-ల గురుదేవుల సాహిత్యం విక్రయించబడింది.

**అసూయ నిప్పులాంటిది, నిలువునా దహించి వేస్తుంది**